

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



జియో సేవలు మరింత ప్రియం 7

జులై 3 నుంచి 27% వరకు టారిఫ్‌ల పెంపు

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

త్వరలో జియో బాటలో మిగతా టెల్కోలు!

శుక్రవారం | 28-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 90

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: సప్తమి సా. 4.27 తదుపరి అష్టమి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 10.11 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా. 7.14 -8.44; దుర్ముహూర్తం: ఉ. 8.23-9.15, మ. 12.44-1.36; అమృతఘడియలు: తె. 4.17-5.47; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఫిరాయింపు పునాదులు

కేసీఆర్‌వే..

ఆయనకు సిగ్గుతోపాటు మతి కూడా తప్పింది

క్షమించాలంటూ ఆయన ముక్కు నేలకు రాయాలి

ప్రభుత్వాన్ని కూలుస్తామని రంకెలేస్తే వదిలేయాలా!?

లోక్‌సభ ఫలితాలతోనూ కేసీఆర్‌కు కనువిప్పు కలగలేదు

విద్యుత్తు కమిషన్ వేయాలని అడిగిందే జగదీశ్ రెడ్డి

విచారణకు ఇప్పుడు కేసీఆర్‌ను పిలవడంతో విమర్శలు

గతంలో పక్క రాష్ట్రంలో పెట్టినట్లు రాజకీయ ప్రేరేపిత కేసులు తెలంగాణలో ఇప్పటి వరకూ లేవు

పక్క రాష్ట్రం అభివృద్ధి చెందితే అసూయపడం

తెలంగాణ అభివృద్ధిలో అలసత్వం ప్రదర్శించం

క్యాబినెట్ విస్తరణపై అసలు చర్చలు జరగలేదు

పీసీసీ చీఫ్‌గా సమర్థుడిని నియమించాలని కోరా

కాంగ్రెస్‌కు నష్టం చేయాలని చూసిన వారికి జీవన్ రెడ్డి అవకాశం ఇవ్వలేదు: సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): "ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంలో కేసీఆర్ తీరు వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్లుంది. కేసీఆర్‌కు సిగ్గుతోపాటు మతి కూడా తప్పింది. అసలు ఫిరాయింపులకు పునాదులు వేసింది కేసీఆర్ కాదా?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తమ పార్టీకి చెందిన 61 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను తీసుకున్నారని గుర్తు చేశారు. తాను చేసిన తప్పులకు క్షమించాలంటూ అమరవీరుల స్థూపం దగ్గరకు వచ్చి ముక్కు మూడించులు అరిగేలా నేలకు రాయాలని కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులు కూడా మనుగడ సాగించదని కేసీఆర్, కేటీఆర్, హరీశ్ అన్నారు. దానికి బీజేపీ వంతపాడింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ బీఆర్ఎస్, బీజేపీలు రోడ్లపై రంకెలేస్తే గాలికి వదిలేయాలా?" అని రేవంత్ ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు సాధించిన బీఆర్ఎస్.. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి 16 శాతానికి పడిపోయిందని, మొత్తం 17 సీట్లలోనూ ఓడిపోవడమే కాకుండా

మిగతా 13వ పేజీలో...



ప్రభుత్వ సుస్థిరతకు చేరికలు అవసరం

పుంజుకునేందుకు కేసీఆర్‌కు అవకాశాలున్నాయి 13

అసెంబ్లీకి వచ్చి ఆయన తన ఉనికిని నిరూపించుకోవాలి

టీడీపీని ఖతం చేయాలని పగబట్టి జగన్ వైసీపీనే ఖతం చేసుకున్నాడు

ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిట్‌చాట్

తెలంగాణ కాంగ్రెస్

పగ్గాలు ఎవరికి?

పరిశీలనలో పలువురు నేతల పేర్లు

బీసీ కోటాలో మహేశ్ కుమార్ గౌడ్

ఎస్టీ కోటాలో తెరపైకి బలరాం నాయక్

ఎస్సీ కోటానూ పరిగణలోకి తీసుకుంటే భట్టి విక్రమార్క, సంపత్

సీఎం సహా.. ముఖ్య నేతలంతా ఢిల్లీలోనే


మహేశ్ కుమార్ గౌడ్


బలరాం నాయక్

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ)కి కొత్త అధ్యక్షుడిని నియమించేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. రేవంత్‌రెడ్డి ఓ వైపు సీఎంగా.. మరోవైపు పీసీసీ చీఫ్‌గా జోడు పదవులు నిర్వహిస్తుండగా.. పార్టీ పగ్గాలను మరొకరికి ఇవ్వాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. ఓ దశలో రేవంత్‌రెడ్డి కూడా తాను ప్రభుత్వ బాధ్యతలకే పరిమితం కానున్నట్లు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే కాకుండా.. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. వచ్చేనెల ఏడో తేదీతో రేవంత్‌రెడ్డి పీసీసీ బాధ్యతలను స్వీకరించి మూడేళ్లు పూర్తవుతాయి. దీంతో కొత్త పీసీసీ చీఫ్ ఎంపికపై కసరత్తు ప్రారంభమైంది. సీఎం రేవంత్ సహా ముఖ్య నేతలంతా ఢిల్లీలోనే ఉన్న నేపథ్యంలో పీసీసీపై శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కాగా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఈ అంశంపై రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు.. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహా పలువురు

మిగతా 14వ పేజీలో...



18,942 మంది

ఉపాధ్యాయులకు పదోన్నతులు 14

ఎస్జీటీలు, పండితులు, పీఈటీలకు..

20 ఏళ్ల నిరీక్షణకు తెర.. టీచర్ల హర్షం

ముఖ్యమంత్రి రేవంత్‌కు కృతజ్ఞతలు




అమెరికాలో తెలుగోళ్ల హవా

అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య

8 ఏళ్లలో 4 రెట్లు పెరుగుదల.. 2016లో 3.2 లక్షలు, ప్రస్తుతం 12.3 లక్షలు

అక్కడ అత్యధిక ఆదరణ ఉన్న విదేశీ భాషల్లో 11వ స్థానంలో తెలుగు 7

అమెరికాకు ఏటా వెళ్లే భారతీయ విద్యార్థుల్లో 12.5% మంది తెలుగువారే



వందేభారత్, గతిమాన్ 2

రైళ్ల వేగం తగ్గింపు

గంటకు 160 కి.మీ నుంచి 130 కి.మీలకు కుదించిన రైల్వే బోర్డు

భద్రతా కారణాల దృష్ట్యా నిర్ణయం

గోదావరి జలాలకు నమస్కరిస్తున్న మంత్రి తుమ్మల





సీతారామ ప్రాజెక్టు మోటార్ ఆన్ కావడంతో కెనాల్‌కు దుంకుతున్న గోదావరి జలాలు

'సీతారామ' ట్రయల్ రన్

విజయవంతం

బీజీ కొత్తూరు పంప్‌హౌస్ నుంచి 9 వేల క్యూసెక్కుల పంపింగ్

త్వరలో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు

నా రాజకీయ ఆకాంక్ష నెరవేరబోతోంది: మంత్రి తుమ్మల 12

ఎన్ని ఆటంకాలున్నా రుణమాఫీ చేస్తాం

భట్టి, తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి

కొత్తగూడెంలో తాగునీటి పథకానికి శంకుస్థాపన

నాడు ఎన్టీఆర్‌ను గెలిపించినట్లే..

మళ్లీ ప్రజలు ఆదరిస్తారు

అప్పటిదాకా ఓపికతో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

ముఖ్యమంత్రి పదవి నాకు పెద్ద విషయం కాదు

ఎన్నో పదవులను త్యాగంచేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది

జనం పాలిచ్చే బర్రెను వదిలి దున్నపోతు తెచ్చుకున్నరు

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ దారి తప్పింది

పార్టీ నేతలు, కార్యకర్తలతో మాజీ సీఎం కేసీఆర్

విద్యుత్తు కమిషన్.. వివక్ష చూపుతోంది!

కేసీఆర్ తప్పు చేసినట్టు ముందే నిర్ణయించేశారు

ఇక.. విద్యుత్తు కమిషన్ ఎదుట హాజరైతే ఏం లాభం?

కేంద్ర శాఖల అనుమతితోనే కొనుగోళ్లు, ప్రాజెక్టులు

కమిషన్.. నివేదికను ఇవ్వకుండా స్టే ఇవ్వండి

హైకోర్టులో కేసీఆర్ తరఫున న్యాయవాది వాదనలు

విచారణను నేటికి వాయిదా వేసిన ధర్మాసనం 12



వ్యాన్ నడిపిన కేసీఆర్

ఫామ్‌హౌస్‌లో స్వయంగా డ్రైవింగ్ చేసిన మాజీ సీఎం

పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు

పరీక్షలు నిజాయితీగా జరగాలి.. నియామకాల్లోనూ ఆటంకాలు ఉండొద్దు

ఉత్తర, దక్షిణ, తూర్పు భారతాల్లో బుల్లెట్ ట్రైన్ కారిడార్లపై అధ్యయనం

వచ్చే బడ్జెట్‌లో చారిత్రాత్మక నిర్ణయాలు.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!

ఎమర్జెన్సీ.. రాజ్యాంగంపై అతిపెద్ద దాడి: పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సమస్యలను విస్మరించి ఎమర్జెన్సీ ప్రస్తావన ఎందుకు?.. ప్రస్తుతం మెగా-ఎమర్జెన్సీ

కేంద్రం స్క్రిప్టు... అబద్ధాల మయం!.. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్షాల విమర్శ

నీట్, ఇతర సమస్యలపై లోక్‌సభలో విపక్ష ఎంపీల నినాదాలు

స్పీకర్ 'ఎమర్జెన్సీ' ప్రస్తావన పూర్తిగా రాజకీయం: రాహుల్ గాంధీ 2





వానొచ్చింది!

గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జోరుగా వర్షం

రాష్ట్రంలో వర్షాలతో రైతుల్లో ఆనందం 12

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలుచోట్ల 10 సెం.మీ.పైనే నమోదు


కుంటాల, పొచ్చెర జలపాతాల పరవళ్లు

మేడిగడ్డకు 8,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేరళలో ముందుకొచ్చిన సముద్రం

భారీ వర్షం నేపథ్యంలో ఎర్నాకులంలో ఘటన

200 ఇళ్లు మునక 2



చరిత్రలో రామోజీకి చిరస్థాయి

విశాఖ చిత్రనగరికి, రాజధానిలో ఒక రోడ్డుకు ఆయన పేరు

అమరావతిలో విజ్ఞాన కేంద్రం.. ఎన్టీఆర్, రామోజీని తెలుగు జాతి మరవదు

వారిద్దరికీ భారతరత్న సాధిద్దాం: సంస్మరణ సభలో ఏపీ సీఎం చంద్రబాబు

రాజధాని నిర్మాణానికి రామోజీ కుటుంబం రూ.10 కోట్ల విరాళం

అమరావతి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉత్తమ పాత్రికేయ విలువలను తెలుగు సమాజానికి అందించిన ఈనాడు గ్రూపుల అధిపతి రామోజీరావు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎంచుకున్న ప్రతి రంగంలోనూ అగ్రస్థానాన్ని అధిరోహించారని, ఏ పని చేసినా అందులో ప్రజా హితం కోరుకున్నారని కొనియాడారు. "ఎందరో నటులు, కళాకారులకు రామోజీరావు జీవితం ఇచ్చారు. ఆయన గౌరవార్థం విశాఖపట్నంలోని చిత్రనగరికి రామోజీ పేరు పెడతాం. రాజధానిగా అమరావతి పేరు ఆయనే

మిగతా 3వ పేజీలో...


ఫోన్ ట్యాపింగ్ నిందితుల బెయిల్ పిటిషన్ల తిరస్కరణ 14

చార్జిషీట్ దాఖలు చేశామన్న దర్యాప్తు అధికారుల వాదనతో ఏకీభవించిన జడ్జి

కేంద్రం స్క్రిప్టు.. అబద్ధాల మయం

రాష్ట్రపతి ముర్ము ప్రసంగంపై ప్రతిపక్షాల విమర్శ

- నీట్, ఇతర సమస్యలపై విపక్ష ఎంపీల నినాదాలు
- ఇంకా ఎమర్జెన్సీని ప్రస్తావించడంలో అర్థంలేదని నాయకుల ధ్వజం



న్యూఢిల్లీ, జూన్ 27: పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం 'అబద్ధాల మయం', 'కేంద్రం ఇచ్చిన స్క్రిప్టు' అని ప్రతిపక్షాలు విమర్శించాయి. ప్రభుత్వం '1975 ఎమర్జెన్సీ'ని పదేపదే ప్రస్తావిస్తూ ప్రస్తుత సమస్యలను గాలికొదిలేస్తోందని మండిపడ్డాయి. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని, మోదీ పాలనలో రాజ్యాంగంపై దాడి జరుగుతోందని దుయ్యబట్టాయి. రాష్ట్రపతి ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష సభ్యులు మణిపూర్‌లో హింస, నీట్ ప్రశ్నపత్రం లీక్, కొత్త క్రిమినల్ చట్టాల వంటి అంశాలపై పలుమార్లు నినాదాలు చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మోదీని, 400కుపైగా సీట్ల నినాదాన్ని తిరస్కరించారని, బీజేపీని కనీస మెజారిటీకి దూరంగా ఉంచారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే 'ఎక్స్' వేదికగా విమర్శించారు. రాష్ట్రపతితో అబద్ధాలు చదివించి మెప్పు పొందేందుకు మోదీ విఫలయత్నం చేశారని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగంలో నీట్, ధరల పెరుగుదల, నిరుద్యోగిత, మణిపూర్‌లో హింస, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు, రైలు ప్రమాదాలు, బీజేపీపాలిత రాష్ట్రాల్లో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై దాడుల వంటి వాటి ప్రస్తావన లేకపోవడాన్ని విమర్శించారు. 49ఏళ్ల తర్వాత కూడా ఎమర్జెన్సీ అంశాన్ని ప్రస్తావించడంలో అర్థంలేదని, ప్రస్తుత అంశాల గురించి ఒక్క మాటైనా లేదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన పలు ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఓడించారని కాంగ్రెస్ నేత తారీఖ్ అన్వర్ గుర్తుచేశారు. 'ప్రభుత్వం చెబుతున్నట్టు ప్రపంచంలో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థే అయితే రైతులు ఎందుకు అభివృద్ధి చెందడం లేదు? యువతకు ఎందుకు ఉద్యోగాలులేవు? ధరల పెరుగుదలను ఎందుకు ఆపలేకపోతున్నారు?' అని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన స్క్రిప్టును రాష్ట్రపతి చదివి వినిపించారని, అందుకే ప్రభుత్వం మైనారిటీలో ఉన్నా స్పష్టమైన మెజారిటీ ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని 'కొత్త సీసాలో పాత సారా'గా మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అభివర్ణించారు. మైనారిటీల గురించి, నీట్‌లో అక్రమాల గురించి ప్రస్తావన లేకపోవడాన్ని తప్పుపట్టారు. మోదీ ప్రభుత్వం ఎమర్జెన్సీ గురించి మాట్లాడుతోందని, కానీ ప్రస్తుతం 'మెగా-ఎమర్జెన్సీ' అమలవుతోందని సీపీఐ (మార్క్సిస్ట్-లెనినిస్ట్) ఎంపీ సుదామా ప్రసాద్ విమర్శించారు. కాగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆప్ ఎంపీలు రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించారు. పార్లమెంటు వెలుపల ఆందోళన నిర్వహించారు.

సంసద్ టీవీలో మోదీని 73 సార్లు, రాహుల్‌ను 6 సార్లు చూపారు

రాష్ట్రపతి ప్రసంగం కొనసాగిన 51నిమిషాల్లో సంసద్ టీవీలో ప్రధాని మోదీని 73సార్లు చూపిస్తే విపక్షనేత రాహుల్‌ను ఆరుసార్లే చూపారని కాంగ్రెస్‌నేత జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. సంసద్ టీవీ ఉన్నది సభా కార్యక్రమాలను ప్రసారంచేయడానికని, 'కెమెరాజీవి' కోసం కాదన్నారు.



పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు

పరీక్షలు నిజాయితీగా జరగాలి.. నియామకాల్లోనూ ఆటంకాలు ఉండొద్దు

- పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే పరీక్షలు నిజాయితీగా, పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. దేశంలోని యువత తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సరైన అవకాశాలను కల్పించడం ప్రభుత్వం కనీస బాధ్యత అని, పోటీ పరీక్షలైనా, ప్రభుత్వ నియామకమైనా ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూడాలని ఆమె పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన కొన్ని పరీక్షల్లో పేపర్ లీకేజీలు జరిగాయని, వీటిని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే శిక్షించేందుకు కఠిన చట్టాలు ఉన్నాయని చెబుతూ పేపర్ లీకేజీ ఘటనల్లో నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. "గతంలోనూ వివిధ రాష్ట్రాల్లో పేపర్ లీకేజీలు జరిగిన సందర్భాలను మనం చూశాం. ఇటువంటి విషయాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, కఠిన చర్యలు చేపట్టడం ఎంతో ముఖ్యం" అని ఆమె వ్యాఖ్యానించారు. ఉత్తర, దక్షిణ, తూర్పు భారతాల్లో బులెట్ ట్రెయిన్ కారిడార్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కేంద్ర ప్రభుత్వం త్వరలోనే అధ్యయనం చేస్తుందని చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ మధ్య 'హై స్పీడ్ రైలు' కారిడార్ పనులూ వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. గురువారం పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ముర్ము ప్రసంగించారు. సుపరిపాలన, సుస్థిరతపై నమ్మకంతోనే మరోసారి ఎన్డీయేకు ప్రజలు అవకాశమిచ్చారని పేర్కొన్నారు. 18వ లోక్‌సభ అనేక విధాలుగా చరిత్రాత్మకమైనదని, అమృత్ కాలంలో సభ ఏర్పాటైందని చెప్పారు. జమ్మూకశ్మీర్ గురించి శత్రువులు అంతర్జాతీయ వేదికలపై దుష్ప్రచారం చేస్తున్నారని, అయితే ఈసారి కశ్మీర్ లోయలో మార్పు కనిపించిందని, శత్రువులకు గట్టిగా బదులిస్తూ అక్కడి ప్రజలు పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారని చెప్పారు. వచ్చే సమావేశాల్లో బడ్జెట్ ఉంటుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ఉండబోతోందన్నారు. బడ్జెట్‌లో ఆర్థిక, సామాజిక నిర్ణయాలతోపాటు అనేక చరిత్రాత్మక చర్యలు కనిపిస్తాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించేలా నిర్ణయాలు ఉంటాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టామని, గత పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థికవ్యవస్థ పరిపుష్టమైందని పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 15 శాతంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని ఆమెతెలిపారు.


పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ముర్ము

ఇప్పటికీ రాజ్యాంగంపై దాడులు

దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత అనేకసార్లు దాడులు జరిగాయని, ఇప్పటికీ రాజ్యాంగంపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ముర్ము అన్నారు. 1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధించడం రాజ్యాంగంపై ప్రత్యక్షంగా జరిగిన అతి పెద్ద దాడి అని, అదో చీకటి అధ్యాయమని తెలిపారు. ఆ చర్యతో దేశమంతా ఆగ్రహానికి లోనైందన్నారు. ఆ అత్యయిక స్థితి నాటి రోజుల్లో దేశ ప్రజలు ఎన్నో బాధలు అనుభవించారని తెలిపారు. కానీ అటువంటి రాజ్యాంగ విరుద్ధ శక్తులపై వ్యతిరేకంగా దేశం విజయం సాధించిందని చెప్పారు.

ప్రపంచమంతా డిజిటల్ ఇండియా వైపే చూస్తోంది

డిజిటల్ ఇండియా సాధనకు ప్రభుత్వం సంకల్పించిందని, బ్యాంకుల క్రెడిట్ బేస్ పెంచి వాటిని బలోపేతం చేశామని ముర్ము తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో జీఎస్టీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వాణిజ్య, వ్యాపారాన్ని సులభతరం చేసిందని చెప్పారు. ఏప్రిల్‌లో తొలిసారిగా జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు దాటాయని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రాలు ఆర్థికంగా బలోపేతం అయ్యాయని అన్నారు. ప్రస్తుతం.. ప్రపంచం మొత్తం డిజిటల్ ఇండియా వైపు చూస్తోందని చెప్పారు. అదేవిధంగా.. సైనికదళాల్లో స్థిరమైన సంస్కరణల కారణంగా బలగాలు స్వయం సమృద్ధి సాధించాయని తెలిపారు. రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయటం, సైనికులకు ఒకే ర్యాంకు ఒకే పింఛను అమలు చేసినట్టు వెల్లడించారు. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగాయని అన్నారు. సీఏఏ కింద శరణార్థులకు ప్రభుత్వం పౌరసత్వం కల్పించిందని చెప్పారు.

ఆయుష్మాన్ భారత్.. గేమ్ చేంజర్

ఆరోగ్య రంగంలో దేశం అగ్రగామిగా ఉన్నదని, అత్యంత వేగంగా పురోగతి సాధిస్తున్నదని ముర్ము పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ అనేది గేమ్ చేంజర్ నిలుస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులు కోసం పీఎం సమ్మాన్ నిధి కింద ఇప్పటివరకు రూ.120లక్షల కోట్లు ఇచ్చామని గుర్తు చేశారు. గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాల్లో రోడ్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కరోనా మహమ్మారి కష్టకాలంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ పేదల గౌరవాన్ని పెంచిందన్నారు. దేశంలోని కోట్లాది మంది పేదలకు తొలిసారిగా మరుగుదొడ్లు నిర్మించినట్టు వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ యోజన కింద 55 కోట్ల మంది లబ్ధిదారులకు ఉచిత ఆరోగ్య సేవలను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. తద్వారా మహాత్మా గాంధీ ఆశయాలు నిజరూపం దాల్చాయని ఆమె తెలిపారు.

1 నుంచి కొత్త నేర చట్టాల అమలు

జూలై 1వ తేదీ నుంచి కొత్త నేర చట్టాలు అమల్లోకి రానున్నాయని రాష్ట్రపతి తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి శిక్షా స్మృతులే నేటికీ అమల్లో ఉన్నాయని, వాటిని సంస్కరించడం గొప్ప విషయమని చెప్పారు. కొత్త న్యాయ చట్టాలతో ఒకరిని శిక్షించడం కంటే ఒకరికి న్యాయం చేయడానికే ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. కొత్త చట్టాలు న్యాయ ప్రక్రియను వేగవంతం చేస్తాయని పేర్కొన్నారు. సీఏఏ అనేది కూడా అతిపెద్ద నిర్ణయమని తెలిపారు.

ఎమర్జెన్సీ ప్రస్తావన ఎందుకు?

- అది పూర్తిగా రాజకీయం: రాహుల్
- ప్రతిపక్ష నేతగా ప్రకటించాక స్పీకర్ ఓం బిర్లాతో భేటీ



న్యూఢిల్లీ, జూన్ 27: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గురువారమిక్కడ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. సభాపతిగా ఎన్నికయ్యాక ఆయన చేసిన ప్రసంగంలో 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించడాన్ని ప్రస్తావించడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇది పూర్తిగా రాజకీయ అంశమని.. ప్రస్తావించి ఉండాల్సింది కాదని వ్యాఖ్యానించారు. తనను సభలో ప్రతిపక్ష నేతగా ప్రకటించాక ఇండియా కూటమి నేతలతో కలిసి రాహుల్ స్పీకర్‌తో సమావేశమయ్యారు. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడారు. సభాపతిని రాహుల్ మర్యాదపూర్వకంగా కలిశారని చెప్పారు. ఎమర్జెన్సీతో పాటు పార్లమెంటు పనితీరు గురించి పలు అంశాలు చర్చించారన్నారు. కాగా.. ఎమర్జెన్సీ ప్రస్తావనపై కాంగ్రెస్ తరఫున అసంతృప్తి తెలియజేస్తూ వేణుగోపాల్ స్పీకర్‌కు విడిగా లేఖ కూడా రాశారు. బుధవారం కొత్తగా ఎన్నికైన స్పీకర్ సభలో ప్రసంగిస్తూ.. రాజకీయ ప్రస్తావన చేయడం అసాధారణమని.. అర్ధ శతాబ్దం కింద జరిగిన అంశా న్ని స్పృశించడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని.. పార్లమెంటరీ సంప్రదాయాలను ఉల్లంఘించడంపై తమ పార్టీ ఆందోళన చెందుతోందని పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయండి

- ఒక్కలిగ మహాసంస్థాన పీఠాధిపతి వ్యాఖ్యలు
- సిద్దరామయ్య సమక్షంలోనే చంద్రశేఖరనాథ స్వామీజీ విజ్ఞప్తి

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కీలకమైన ఒక్కలిగ వర్గానికి ముఖ్యమంత్రి పదవి కేటాయించాలని, అందుకోసం సిద్దరామయ్య సీఎం పీఠం వదులుకోవాలని విశ్వ ఒక్కలిగ మహాసంస్థాన పీఠాధిపతి చంద్రశేఖరనాథ స్వామీజీ విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి, ఒక్కలిగ వర్గానికి చెందిన డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వీరశైవ లింగాయత్, ఎస్సీ/ఎస్టీ, మైనార్టీల వర్గాల నుంచి ముగ్గురు ఉప ముఖ్యమంత్రులను చేయాలని డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో స్వామీజీ ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు నగరంలోని కంఠీరవ స్టేడియంలో గురువారం జరిగిన కెంపేగౌడ జయంతి వేడుక ఇందుకు వేదిక అయింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్ సమక్షంలోనే చంద్రశేఖరనాథ స్వామీజీ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.కాగా.. చంద్రశేఖరనాథ స్వామీజీ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పందించారు. వేడుకల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి పదవిని నిర్ణయించేది పార్టీ అధిష్ఠానం అని స్వామీజీ కాదని తెలిపారు.

మళ్లీ 'సెంగోల్'పై వివాదం!

- పార్లమెంటు నుంచి దానిని తొలగించాలని ఎస్పీ ఎంపీ డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 27: పార్లమెంటులో ఉన్న 'సెంగోల్ (రాజదండం)'పై మరోసారి వివాదం ముసురుకుంది. రాచరికానికి చిహ్నమైన ఈ దండాన్ని పార్లమెంటు నుంచి తొలగించాలని సమాజ్‌వాదీ ఎంపీ ఆర్‌కే చౌధరి డిమాండ్ చేశారు. ఇది ఇప్పుడు రాజకీయ వివాదంగా మారింది. మన ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం చిహ్నమని.. కానీ ప్రధాని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో రాజదండాన్ని ప్రతిష్ఠించిందని రెండ్రోజుల కింద తప్పుబట్టారు. రాజరికానికి స్వస్తి పలికి స్వాతంత్ర్యం తెచ్చుకున్నామని.. ఈ నేపథ్యంలో దేశాన్ని ఏలాల్సింది రాజ్యాంగమే తప్ప.. రాజదండం కాదని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి దానిని పార్లమెంటు నుంచి తీసివేయాలని స్పష్టం చేశారు. ఆయనకు సమాజ్‌వాదీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ గురువారం మద్దతు పలికారు. సెంగోల్‌ను పార్లమెంటులో ప్రతిష్ఠించినప్పుడు మోదీ శిరసు వంచి నమస్కరించారని. ఎంపీగా ప్రమాణం చేసేటప్పుడు అలా నమస్కరించడం మరచిపోయి ఉంటారని.. దానిని గుర్తుచేయడానికి తమ ఎంపీ అలా మాట్లాడి ఉంటారని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. కొత్త పార్లమెంటు ప్రారంభ సమయంలో సెంగోల్ ప్రతిష్ఠకు సంబంధించి మోదీ ప్రభుత్వం హైడ్రామా సృష్టించిందని ఠాగూర్ ఆరోపించారు. దానిని తొలగించాలని చౌధరి మంచి సలహాయే ఇచ్చారని చెప్పారు.

రాజ్యసభ సభాపక్ష నేతగా నడ్డా

న్యూఢిల్లీ, జూన్ 27: కేంద్ర ఆరోగ్య మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా రాజ్యసభ సభానాయకుడిగా నియమితులయ్యారు. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో నడ్డాను రాజ్యసభ సభానేతగా చైర్మన్ జగదీప్ ధనఖడ్ ప్రకటించారు. ఆ తర్వాత మోదీ తన మంత్రి వర్గాన్ని రాజ్యసభలో పరిచయం చేశారు. అలాగే బిహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన ఆరుగురు సభ్యులు గురువారం సభలో ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణం చేసిన వారిలో బిహార్ నుంచి కాంగ్రెస్ నేత అఖిలేష్ ప్రసాద్ సింగ్, మధ్యప్రదేశ్ నుంచి బీజేపీ నాయకులు బన్సీలాల్ గుర్జర్, మాయా నరోలియా, బాలయోగి ఉమేశ్‌నాథ్, ఝార్ఖండ్ నుంచి జేఎంఎం నేత సర్ఫరాజ్ అహ్మద్, బీజేపీ నేత ప్రదీప్ కుమార్ వర్మలు ఉన్నారు.

కేరళలో ముందుకొచ్చిన సముద్రం

- 200 ఇళ్ల మునక

కొచ్చి, జూన్ 27: భారీ వర్షం అనంతరం కేరళలోని ఎర్నాకుళం ప్రాంతంలో సముద్రం ముందుకు రావడంతో ఆందోళన నెలకొంది. ఎడవనక్కాడ్, నయరాంబళం, నజరక్కల్, చెల్లనం పంచాయతీల్లో సుమారు కిలోమీటరు మేర బుధవారం సముద్రం నీరు చొచ్చుకువచ్చింది. ఎడవనక్కాడ్‌లో సుమారు 200 ఇళ్లు నీట మునిగాయి. ఆగ్రహం చెందిన గ్రామస్థులు పరామర్శకు వచ్చిన కొచ్చి తహసీల్దారును ఘెరావ్ చేశారు. గురువారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. తగిన రక్షణ గోడలు నిర్మించకపోవడం వల్లనే ఈ ముప్పు కలిగినట్టు ఆరోపించారు.

వందేభారత్, గతిమాన్ రైళ్ల వేగం తగ్గింపు

- 160 కి.మీ నుంచి 130 కి.మీకి కుదించిన రైల్వే బోర్డు
- భద్రతా కారణాల దృష్ట్యా కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 27: ఆటోమ్యాటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చేవరకు సెమీ హైస్పీడ్ రైళ్లయిన వందేభారత్, గతిమాన్ ఎక్స్‌ప్రెస్‌ల వేగాన్ని గంటకు 160 కి.మీ నుంచి 130 కి.మీ.కి తగ్గించినట్టు భారతీయ రైల్వే వెల్లడించింది. ఈ మేరకు రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సిగ్నల్) నార్త్ సెంట్రల్ రైల్వే (ఎన్‌సీఆర్) జోన్ జనరల్ మేనేజర్‌కు లేఖ రాశారు. హజ్రత్ నిజాముద్దీన్, ఆగ్రా-ఢిల్లీ మార్గాల్లో వందేభారత్, గతిమాన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే గంటకు 160 కి.మీ. వేగంతో నడుస్తున్నాయి. 'ఆటోమ్యాటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థ పనిచేసేవరకు ఎన్‌సీఆర్ జోన్ పరిధిలో రైళ్లు గరిష్ఠంగా గంటకు 130 కి.మీలోపు వేగంతో నడవాలని నిర్ణయించాం. ఇంతకుముందు సూచించినట్టుగా ఈ జోన్ విభాగంలో ఐఆర్-ఏటీపీ కవచ్ పనులు వేగవంతం చేయాలి' అని ఆ లేఖలో సూచించారు. ఈ నెల 25 నుంచే స్పీడ్ లిమిట్ అమలులో ఉందని తెలిపారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో కంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. రైల్వే బోర్డు ప్రకారం గతిమాన్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 12050/ 12049 ఢిల్లీ-ఝాన్సీ), వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 22470/22469 నిజాముద్దీన్-ఖజురహో), వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 20172/20171 ఢిల్లీ-రాణి కమలాపతి) రైళ్ల వేగం తగ్గింది. కాగా, ఢిల్లీ-ఆగ్రా రూట్ మినహా మిగిలిన అన్నిచోట్లా వందేభారత్ 130 కి.మీ. వేగంతోనే నడుస్తోంది.

నీట్ కేసులో సీబీఐ అరెస్టులు షురూ

పట్నాలో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం

- గుజరాత్‌లో ముగ్గురు విద్యార్థులను ప్రశ్నించిన సీబీఐ అధికారులు
- మార్కుల గణనలో వైరుధ్యాలపై ఎన్‌టీఏకి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, జూన్ 27: నీట్ అక్రమాల కేసులో దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ.. పట్నాలో మనీశ్‌కుమార్, అశుతోష్ కుమార్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి అభ్యర్థులతో ఒప్పందం కుదుర్చుకున్నందుకు ఒకరిని.. పరీక్ష ముందురోజు, అంటే మే 4వ తేదీన రహస్యంగా బస చేయడానికి ఏర్పాట్లు చేసిన ఆరోపణలపై మరొకరిని సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుంది. అనంతరం వీరిని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. వీరిలో అశుతోష్ కుమార్.. పట్నాలోని 'లెర్న్ బాయ్స్ హాస్టల్ అండ్ ప్లే స్కూల్'ని ప్రత్యేకంగా నీట్ అభ్యర్థుల బస కోసం అద్దెకు తీసుకున్నాడు. బిహార్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు ఆ స్కూల్‌లోనే.. కాల్చేసిన నీట్ ప్రశ్నపత్రం అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక మనీశ్ కుమార్.. నీట్ ప్రశ్నపత్రాన్ని ముందే ఇస్తానంటూ అభ్యర్థులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అశుతోష్ అద్దెకు తీసుకున్న ప్లేస్కూల్‌కు అభ్యర్థులను తీసుకొచ్చి.. వారికి ప్రశ్నపత్రంతోపాటు, ఆన్సర్ కీని కూడా ఇచ్చాడు. మర్నాడు పరీక్షా కేంద్రాలకు వెళ్లేదాకా వారు అక్కడే ఉన్నారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వీరిద్దరినీ ప్రశ్నించడానికి తమ కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోర్టును సీబీఐ కోరనుంది. మరోవైపు.. నాలుగు రోజులుగా గుజరాత్‌లోని గోద్రాలో ఉన్న మరో ప్రత్యేక బృందం అక్కడ నీట్‌లో ఉత్తీర్ణత సాధించడం కోసం రూ.10 లక్షలు ఇచ్చినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను గురువారం ప్రశ్నించింది. అలాగే.. నీట్ అవకతవకలకు కేంద్రబిందువుగా మారిన అక్కడి జే జలరామ్ స్కూల్ యజమాని దీక్షిత్ పటేల్‌నూ ప్రశ్నించింది.



ఢిల్లీలోని ఎన్‌టీఏ కార్యాలయం వద్ద విద్యార్థుల నిరసన

మీరేమంటారు?

నీట్ మార్కుల కేటాయింపులో వైరుధ్యాలు, ఓఎంఆర్ షీట్లను విద్యార్థులకు ఇవ్వడంలో వైఫల్యాల గురించి పలు ఆరోపణలు చేస్తూ ఒక కోచింగ్ సెంటర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కి సుప్రీంకోర్టు నోటీసు ఇచ్చింది. కోచింగ్ సెంటర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వొకేట్ ఆర్ బసంత్.. ఈ లోపాల గురించి ధర్మాసనానికి నివేదించారు. అయితే.. ఈ పిటిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద దాఖలు చేయడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌ను కోచింగ్ సెంటర్ దాఖలు చేయడమేమిటని ప్రశ్నించింది. ఓఎంఆర్ షీట్లకు సంబంధించి ఫిర్యాదులకు కాలపరిమితి ఏమైనా ఉందా అని కోర్టు ప్రశ్నించగా.. దానిపై తాను ఎన్‌టీఏని అడిగి తెలుసుకోవాల్సి ఉందని, కాబట్టి ఈ పిటిషన్‌ను జూలై 8కి వాయిదా వేసి, ఆరోజు విచారించే మిగతా పిటిషన్లతో కలిపి విచారించాలని ఎన్‌టీఏ తరఫు న్యాయవాది అభ్యర్థించారు. ధర్మాసనం తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. అలాగే.. నీట్ ప్రశ్నపత్రంలో సిలబస్‌లో లేని ప్రశ్న ఇవ్వడం, మరో ప్రశ్నకు తప్పు ఆన్సర్‌ను సమాధానంగా గుర్తించడంపై ఢిల్లీ హైకోర్టులో ఒక విద్యార్థి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండు వారాల్లోగా స్పందన తెలపాలంటూ ఢిల్లీ హైకోర్టు కేంద్రానికి, ఎన్‌టీఏకి, నేషనల్ మెడికల్ కమిషన్‌కు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

జొరబడి.. నిరసన..

నీట్ అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా, కాంగ్రెస్ విద్యార్థి విభాగాలకు చెందిన దాదాపు వందమంది సభ్యులు.. గురువారం ఢిల్లీలోని ఎన్‌టీఏ కార్యాలయంలోకి చొరబడి నిరసన తెలిపారు. మరోవైపు.. నీట్ అక్రమాలను, అగ్నివీర్ పథకాన్ని నిరసిస్తూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగారు. ప్లకార్డులు చేతబూని.. పెద్దపెట్టున నినాదాలతో నిరసన తెలిపారు.

ఆ 12 మంది విపక్ష ఎంపీలు దోషులే!

- సభా వ్యవహారాలకు అంతరాయం కలిగించారు
- రాజ్యసభ సభాహక్కుల సంఘం నిర్ధారణ

న్యూఢిల్లీ, జూన్ 27: గతంలో సభలో నిబంధనలను ఉల్లంఘించి సభా వ్యవహారాలకు అంతరాయం కలిగించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న 12 మంది విపక్ష ఎంపీలను రాజ్యసభ సభాహక్కుల సంఘం దోషులుగా నిర్ధారించింది. భవిష్యత్తులో ఇటువంటి ప్రవర్తన పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని వారిని హెచ్చరించింది. ఈ మేరకు రాజ్యసభకు గురువారం నివేదికను సమర్పించింది. 12 మంది ఎంపీల్లో సంజయ్‌సింగ్, శక్తిసింగ్ గోహిల్, సుశీల్‌కుమార్‌గుప్తా, సందీప్‌కుమార్ పాఠక్, నారన్‌భాయ్ రత్వా, ఎల్ హనుమంతయ్య, సయ్యద్ నజీర్ హుస్సేన్, కుమార్ ఖేత్కర్, ఫూలోదేవి నేతమ్, జెబి మేథర్ హిషమ్, రంజీత్ రంజన్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి ఉన్నారు. కాగా, వీరిలో ఖేత్కర్, రత్వా, హనుమంతయ్య ఇప్పటికే ఎంపీలుగా రిటైర్ అయినందున వారిపై ఎటువంటి చర్యలకు సిఫార్సు చేయలేదు. మిగిలిన ఎంపీలను మాత్రం ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించింది. ఆమ్‌ఆద్మీపార్టీ ఎంపీ సంజయ్‌సింగ్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. అయితే, ఆయన ఇప్పటికే బేషరతు క్షమాపణ చెప్పటంతోపాటు రాజ్యసభ నుంచి సస్పెన్షన్‌కు గురైన నేపథ్యంలో మరింత శిక్ష అవసరం లేదని అభిప్రాయపడింది. సస్పెన్షన్‌ను తొలగించాలని సిఫార్సు చేసింది. ఈ మేరకు రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌కడ్.. సంజయ్‌సింగ్‌పై గత ఏడాది జూలై 24వ తేదీ నుంచి కొనసాగుతున్న సస్పెన్షన్‌ను తొలగించారు. కాగా, రాజ్యసభ సభా వ్యవహారాల కమిటీ భేటీ గురించి 'తెలంగాణ టుడే'లో ప్రచురించిన ఓ వార్తకు సంబంధించి సభాహక్కుల సంఘం మరో నివేదికను సమర్పించింది. సదరు వార్త ప్రచురణ విషయంలో ఆ పత్రికకు ఇప్పటికే సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు పంపించారు. దీనిపై తెలంగాణ టుడే ఎడిటర్.. సదరు వార్తలో తప్పు దొర్లిందని, అది అనుకోకుండా జరిగిందని పేర్కొంటూ బేషరతు క్షమాపణ చెప్పిన నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని ఇక్కడితో ముగించాలని కమిటీ తీర్మానించింది.

సంస్కరణలు లేకుండా 'సంహిత'లా?

- కొత్త నేర చట్టాలపై 'సుప్రీం'లో పిల్

న్యూఢిల్లీ, జూన్ 27: కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మూడు నేర న్యాయ చట్టాలను అమలు చేయకుండా స్టే ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో గురువారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలయింది. నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ)లను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అయితే వీటిలో పలు లోపాలు ఉన్నందున అమలును నిలిపివేయాలని పిటిషనర్లు కోరారు. బ్రిటిష్ పాలనకు చిహ్నంగా పోలీసు వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోందని, తొలుత దానికి సంస్కరణలు చేయకుండా ఈ సంహితలను తీసుకురావడం సరికాదని ఈ పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. అంజలి పటేల్, ఛాయా మిశ్రా అనే మహిళలు న్యాయవాదులు సంజీవ్ మల్హోత్రా, కున్వర్ సిద్ధార్థల ద్వారా ఈ పిల్‌ను దాఖలు చేశారు.

అరుంధతీరాయ్‌కు పెన్ అవార్డు

- అక్టోబరులో బ్రిటిష్ లైబ్రరీలో ప్రదానం



న్యూఢిల్లీ, జూన్ 27: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌కు ప్రతిష్ఠాత్మకమైన బ్రిటన్ 'పెన్' అవార్డు లభించింది. సాహిత్య నోబెల్ విజేత హారాల్డ్ పింటర్ స్మృత్యార్థం 2009 నుంచి ఇస్తున్న ఈ అవార్డు 2024 సంవత్సరానికిగాను అరుంధతిని వరించింది. బ్రిటిష్ లైబ్రరీతో కలిసి 'పెన్' సంస్థ ఈ అవార్డును ఏటా ప్రదానం చేస్తోంది. బ్రిటిష్ లైబ్రరీలో జరిగే కార్యక్రమంలో ఈ ఏడాది అక్టోబరు 10న ఆమెకు అవార్డును ప్రదానం చేయనుంది. అనంతరం ఆమె హారాల్డ్ పింటర్ స్మారక ప్రసంగం చేస్తారు. 'శక్తిమంతమైన అరుంధతి గొంతుకను నొక్కివేయలేరు' అని అవార్డు ప్రకటన సందర్భంగా 'పెన్' నిర్వాహకు లు వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్‌పై వేర్పాటువాద వ్యాఖ్యలు చేశారనే కారణంగా అరుంధతి ప్రస్తుతం 'ఉపా' (ఉగ్రవాద నిరోధక చట్టం) నేరాభియోగాలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తనకు అవార్డు రావడంపై అరుంధతి స్పందించారు. ప్రపంచం తీసుకుంటున్న నిర్దయమైన మలుపుల గురించి రాస్తున్నప్పుడు పింటర్ సదా వెంటే ఉంటారని, ఆ విధంగా ఆయన లేని లోటును మనలో కొందరం తప్పక పూరించాల్సి ఉంటుందన్నారు. కాగా, కశ్మీర్‌పై వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో అరుంధతీరాయ్, ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లపై మోపిన కేసులను వెనక్కి తీసుకోవాల్సిందిగా భారత ప్రభుత్వానికి అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ విజ్ఞప్తి చేసింది.

ఏపీ సీఎస్ నీరబ్ సర్వీస్ పొడిగింపు

- ఆరు నెలలు సర్వీస్ పొడిగించిన ప్రభుత్వం
- కేంద్ర అనుమతివ్వడంతో ఉత్తర్వులు జారీ


నీరబ్‌కుమార్ ప్రసాద్

అమరావతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్నీ ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెలాఖరున నీరబ్ పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ మరో ఆరు నెలల పాటు ఆయన సేవలు తమ రాష్ట్రానికి కావాలని కేంద్రానికి కూటమి ప్రభుత్వం లేఖ రాసింది. కేంద్రం అనుమతి ఇవ్వడంతో ఈ ఏడాది డిసెంబర్ వరకూ ఆయన సీఎస్‌గా కొనసాగుతారు. కాగా, సీనియారిటీ లేకపోయినా గత ప్రభుత్వం జవహర్ రెడ్డిని సీఎస్‌గా నియమించింది. ఎన్నికల సమయంలో వైసీపీకి కొమ్ముకాస్తూ ఆయన అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన సెలవుపై వెళ్లిపోయారు.

దానం, తెల్లం, కడియంపై అనర్హత వేటుకు అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించండి

- హైకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేకానంద వాదనలు
- 3వ తేదీకి విచారణ వాయిదా

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 'బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి.. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ఎదుట పిటిషన్లు దాఖలు చేసి ఇప్పటికీ 3 నెలల గడువు ముగిసి వారం అవుతోంది. అయినా స్పీకర్ ఆ ఎమ్మెల్యేలకు కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. పార్టీ మారిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయాలి' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద హైకోర్టును కోరారు. పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఆర్యమ సుందరం వాదనలు వినిపించారు. మూడు నెలల్లో అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు మహారాష్ట్ర, మణిపూర్ కేసుల్లో తీర్పులు ఇచ్చిందని.. సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా స్పీకర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రకారం ట్రైబ్యునల్‌గా వ్యవహరించాల్సిన స్పీకర్.. రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా నడుచుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఒక ఎమ్మెల్యే ఏకంగా మరో పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేశారని.. ఇంత బహిరంగంగా ఫిరాయింపులు జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తుంటే స్పీకర్ చర్యలు తీసుకోవట్లేదని ఆక్షేపించారు. ప్రభుత్వం తరఫున హాజరైన ఏజీ సుదర్శన్‌రెడ్డి సమయం కావాలని కోరారు. వాదనల అనంతరం ధర్మాసనం.. ప్రతివాదుల వాదనల కోసం విచారణను వచ్చేనెల 3వ తేదీకి వాయిదా వేసింది.



రాజధాని నిర్మాణానికి రూ. 10 కోట్ల విరాళం చెక్కును సీఎం చంద్రబాబు, పవన్‌కు అందజేస్తున్న కిరణ్, శైలజ, విజయేశ్వరి. సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

చరిత్రలో రామోజీకి చిరస్థాయి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తాం. రాజధానిలో ఒక రోడ్డుకు ఆయన పేరు పెడతాం" అని చంద్రబాబు ప్రకటించారు. తెలుగు జాతి ఎన్టీఆర్‌ను, రామోజీని మరవబోదని వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లాలో జన్మించిన వారిద్దరికీ భారత రత్న సాధించడం మనందరి కర్తవ్యమని స్పష్టం చేశారు. విజయవాడలోని కానూరులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన రామోజీ రావు సంస్మరణ సభకు సతీసమేతంగా చంద్రబాబు హాజరయ్యారు. రామోజీ రావు విలువలు, ఆయన సేవ భావి తరాలకు స్ఫూర్తి అని అన్నారు. నీతి నిజాయితీగా వ్యాపారం చేసిన ఆయన ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు 'మార్గదర్శి'పై గత ప్రభుత్వం కుట్ర చేసిందని చంద్రబాబు గుర్తుచేశారు. అయినా, డిపాజిటర్లు మాత్రం ఆయననే నమ్మారన్నారు. రాజధాని ఎంపిక చేసినప్పుడు ఆయన ఎంతో రీసెర్చ్ చేసి అమరావతి పేరు పెట్టారని చంద్రబాబు గుర్తు చేశారు. ఐదేళ్ల పాటు ఆటుపోట్లు ఎదుర్కొన్నా తిరిగి దశ, దిశ మార్చుకొంటూ ప్రగతి పథం వైపు రాజధాని అమరావతి దూసుకెళుతోందని ధీమా వ్యక్తంచేశారు.

ప్రజల పక్షపాతి: పవన్ కల్యాణ్

ప్రజాస్వామ్యానికి పత్రికాస్వేచ్ఛ ఎంత అవసరమో ఈ దేశానికి రామోజీ రావు చాటి చెప్పారని ఉప ముఖ్యమంతి పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆయన ప్రజల పక్షపాతి అని తెలిపారు. జర్నలిస్టు విలువల్ని కాపాడిన ఆయన పత్రికాధిపతిగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఆరోగ్యం క్షీణిస్తున్న సమయంలోనూ... కూటమి విజయంపై ఆరా తీసినట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారన్నారు. "మొదటిసారి 2008లో రామోజీరావును కలిశాను. ఆ తొలి సమావేశంలోనే ఆయనలో ఎన్నో ప్రత్యేకతలను గమనించాను. 'నువ్వు ఏమి చేయాలనుకున్నావో, ఏం నమ్ముతున్నావో అది త్రికరణ శుద్ధిగా చేయి' అని సూచించారు. ప్రజలకు ఏమి చేయాలనే అంశాలపై ఆయనకు స్పష్టత ఉంది. జనం అభిప్రాయాలే ఆయన పత్రికలో కనిపిస్తాయి. ఐదేళ్ల క్రితం లంచ్‌కు ఆహ్వానించినప్పుడు ఆయనలో వేదన కనిపించింది. ఆయనను గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. అయినా, ఒత్తిళ్ల తట్టుకుని నిలబడ్డారు. ఆయన విగ్రహం అమరావతిలో ఏర్పాటు చేయాలి. ఆర్టీఐ ఉద్యమకారుడిగానూ పోరాడిన రామోజీ ఒక పాత్రికేయ నదీ ప్రవాహం. అందులోంచి వీలైనన్ని నీళ్ల (పాత్రికేయ విలువలు) మనం తీసుకుని ఆయన వారసత్వాన్ని కొనసాగిద్దాం" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

పరిశోధనాత్మక జర్నలిజం ఇష్టం: ఎన్.రామ్

పరిశోధనాత్మక జర్నలిజాన్ని ఇష్టపడే రామోజీ రావు నమ్మిన విలువల కోసం కట్టుబడ్డారని హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్. రామ్ కొనియాడారు. "ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పాత్రికేయ హక్కుల కోసం బలంగా పోరాటం చేశారు. పాత్రికేయులే లక్ష్యంగా రాజీవ్ గాంధీ ప్రభుత్వం అప్పట్లో తెచ్చిన పరువు నష్టం బిల్లుకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ బిల్లులోని కఠిన నిబంధనలు ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, సాధించారు" అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రామోజీ రావు కుటుంబ సభ్యులు, మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, సత్య కుమార్, పార్థసారథి, కొల్లు రవీంద్ర, రాజస్థాన్ పత్రిక ఎడిటర్ గులాబ్ కొఠారి, సినీ ప్రముఖులు రాఘవేంద్ర రావు, రాజమౌళి, బోయపాటి శీను, అశ్వనీదత్, శ్యాంప్రసాద్ రెడ్డి, ఎం.ఎం. కీరవాణి, ప్రసాద్ రెడ్డి, జయసుధ, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం కోసం నాన్న పరితపించారు: కిరణ్

ప్రజాస్వామ్య విలువల కోసం రామోజీ రావు ఎప్పుడూ పరితపించే వారని కుమారుడు కిరణ్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా నిలిచే వారంటూ తండ్రి సేవల్ని గుర్తు చేసుకున్నారు. ఎక్కడ విపత్తులు వచ్చినా సహాయం చేయడానికి ముందుండే ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పేరు రామోజీ రావు సూచించారని, దేశంలోనే గొప్ప నగరంగా అది ఎదగాలని ఆకాంక్షించారంటూ కిరణ్ గుర్తు చేసుకున్నారు. తమ కుటుంబం తరఫున రాజధాని నిర్మాణానికి పది కోట్ల రూపాయలు విరాళంగా చెక్కు రూపంలో అందజేశారు.



సంస్మరణ సభలో రామోజీ మనుమలు, మనుమరాళ్లు, సినీ ప్రముఖులు

అమరావతిలో 33వేల ఎకరాల భూమి, అప్పటికే జరిగిన నిర్మాణాలను కాదని... జగన్ విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్కడ... విశాఖ ఉక్కును ఎత్తేసి, ఆ కర్మాగారానికి చెందిన 30వేల ఎకరాల్లో రాజధాని పెట్టేద్దామని అప్పటి సీఎం జగన్ ఒక చిత్ర విచిత్రమైన ఆలోచన చేశారట. జగన్ దగ్గర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, కొన్నాళ్లకే ఆయన ఆగ్రహానికి గురైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యం ఈ విషయం బయటపెట్టారు. - విశాఖపట్నం

హత్యాయత్నం కేసుల్లో నెల్లూరు జైలుకు పిన్నెల్లి

- 14 రోజులు రిమాండ్ విధించిన మాచర్ల కోర్టు
- కోర్టు వద్ద టీడీపీ నేతపై మాజీ ఎమ్మెల్యే దాడి..కేసు నమోదు

మాచర్ల టౌన్, జూన్ 27: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు(మే 13న), మరుసటి రోజు జరిగిన దాడులకు సంబంధించిన కేసుల్లో అరెస్టయిన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈవీఎం ధ్వంసం, టీడీపీ వర్గీయులు, సీఐపై దాడి కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన దాఖలుచేసిన పిటిషన్లను బుధవారం హైకోర్టు కొట్టివేయడంతో పోలీసులు ఆయన్ను అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ని అర్ధరాత్రి 12 గంటల సమయంలో మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కల్యాణ్ ఎదుట హాజరుపరిచారు. 12:30 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు బెయిల్‌పై వాదోపవాదాలు జరిగాయి. పిన్నెల్లి తరఫున న్యాయవాది బాలసత్యనారాయణరెడ్డి వాదనలు వినిపించారు. కారంపూడి సీఐ అలహరి శ్రీనివాసరావు స్వయంగా హాజరయ్యారు. పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం, బయటకు వచ్చాక చెరుకూరి నాగశిరోమణిపై దూషణలు, బెదిరింపు కేసుల్లో మాజీ ఎమ్మెల్యేకు బెయిల్ మంజూరైంది. టీడీపీ ఏజెంటు నంబూరి శేషగిరిరావుపైన, కారంపూడిలో సీఐ నారాయణస్వామిపైన దాడికి సంబంధించి నమోదైన హత్యాయత్నం కేసుల్లో మాత్రం న్యాయాధికారి ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. కాగా, పిన్నెల్లిని మాచర్ల కోర్టులో హాజరుపరుస్తున్నారనే సమాచారం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు బుధవారం అర్ధరాత్రి కోర్టు వద్దకు చేరుకున్నారు. తీవ్ర ఉద్రిక్తత, ఆందోళనల నడుమే ఆయన్ను కోర్టు మెయిన్ గేటు ద్వారా లోపలకు తీసుకెళ్లారు. అంతకుముందు పిన్నెల్లి వాహనం దిగి వైసీపీ కార్యకర్తలతో కరచాలనం చేస్తుండగా అదే సమయంలో అక్కడ తెలుగు యువత జిల్లా కార్యదర్శి కొమెర శివ ఎదుటపడ్డారు. మాజీ ఎమ్మెల్యే ఆగ్రహంతో తన కుడి చేతి పిడికిలి బిగించి శివ కడుపుపై పిడిగుద్దు గుద్దారు. పోలీసులు అప్రమత్తమై హుటాహుటిన పిన్నెల్లిని బలవంతంగా లోపలకు తీసుకెళ్లారు. దాడిపై శివ ఫిర్యాదుతో పోలీసులు పిన్నెల్లిపై కేసు నమోదు చేశారు.


బావోజీపేట్ గ్రామం నుంచి ఎడ్లబండిలో వెళ్తున్న గర్భిణి

రోడ్డు మార్గం లేక గర్భిణి అవస్థలు

- 4 కి.మీలు ఎడ్లబండిపై.. ఆపై ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి..
- వైద్యులు లేక అక్కడి నుంచి మరో ఆస్పత్రికి తరలింపు

ఇచ్చోడ, జూన్, 27: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఆ నిండు చూలాలు ఆస్పత్రికి వెళ్లేందుకే సరైన రోడ్డు మార్గం లేదు. ఎలాగోలా ఆస్పత్రికి చేరుకుంటే అక్కడ వైద్యులు లేరు. దాంతో నొప్పులు భరిస్తూనే మరో ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో జరిగింది. ఇచ్చోడ మండలం బావోజీపేట్ గ్రామానికి చెందిన అనిత నిండు గర్భిణి. గురువారం ఆమెకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. అయితే గ్రామం నుంచి బయటకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడంతో ఎలా అని కుటుంబీకులు ఆందోళన చెందారు. చివరకు గర్భిణిని ఎడ్లబండిలో 4 కి.మీలు తీసుకెళ్లి అక్కడి నుంచి ప్రైవేట్ వాహనం ద్వారా ఇచ్చోడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో 108 వాహనంలో ఆదిలాబాద్‌కు రిమ్స్‌కు తీసుకెళ్లారు. మారుమూల గిరిజన గ్రామాల్లో రహదారులు లేక ఇలాంటి సందర్భాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఇంగ్లండ్‌లో పీహెచ్‌డీ సీటు.. రూ.కోటి స్కాలర్‌షిప్ ప్రయాణానికి డబ్బుల్లేక ఓ విద్యార్థి అవస్థ

- వీసా దరఖాస్తుకు ముంచుకొస్తున్న గడువు
- దాతల సాయం కోసం ఎదురుచూపు


నిఖిల్

హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సామాజిక శాస్త్రవేత్తగా అణగారిన వర్గాలకు ఉపయోగపడే పరిశోధనలు చేయాలనే ఆ విద్యార్థి కలకు పేదరికం ఆటంకంగా మారింది. ఇంగ్లండ్‌లోని విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసే అవకాశం దక్కినా, రూ.కోటి విలువ చేసే ఉపకార వేతనానికి ఎంపికైనా..ప్రయాణ ఖర్చులకు అవసరమైన డబ్బు లేక సాయం కోసం ఎదురు చూస్తున్నాడు ఆ విద్యార్థి. జూలై రెండో వారంలోపు వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా.. ఈ లోగా డబ్బు సమకూరకుంటే పీహెచ్‌డీ అవకాశం, ఉపకార వేతనం వృథా అవుతాయని ఆందోళన చెందుతున్నాడు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) సోషయాలజీ విద్యార్థి పందుల నిఖిల్ కుమార్ పరిస్థితి ఇది. నిఖిల్ తండ్రి వెంకటేశ్వరరావు పెయింటింగ్ లాంటి రోజు వారీ కూలీ పనులు చేస్తుంటారు. ఏ రోజుకు ఆ రోజు తిండి గింజలు వెతుక్కొనే పరిస్థితి ఆ కుటుంబానిది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఉచితంగా విద్య అభ్యసించిన నిఖిల్.. హెచ్‌సీయూలో సోషయాలజీ(ఇంటిగ్రేటెడ్) కోర్సు పూర్తి చేశారు. ఇంగ్లండ్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ బాత్'లో సామాజికశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ సీటు సాధించారు. అలాగే, అంతర్జాతీయ స్థాయిలో గట్టి పోటీ ఎదుర్కొని ప్రతిష్ఠాత్మకమైన 'ఎకనమిక్ అండ్ సోషల్ రీసెర్చ్ కౌన్సిల్'(ఈఎస్ఆర్సీ) ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. దీంతో ఇంగ్లండ్‌లో నాలుగేళ్ల పరిశోధనా కాలానికి అవసరమైన ఖర్చులతోపాటు ప్రతి నెలా స్కాలర్‌షిప్ వస్తుంది. అయితే, నిబంధనల ప్రకారం ప్రయాణ ఖర్చులు, ఇమ్మిగ్రేషన్ హెల్త్ సర్‌చార్జి కలిపి సుమారు రూ.5 లక్షల నిఖిల్ ముందుగా ఖర్చు చేయాల్సి ఉంది. ఈ మొత్తాన్ని భరించే స్తోమత లేకపోవడంతో నిఖిల్ దాతల సాయం కోరుతున్నారు. మరిన్ని వివరాల కోసం 88972 90513 నెంబరులో నిఖిల్‌ను సంప్రదించవచ్చు.

ఆర్‌ఆర్‌ఆర్ భూ పరిహారం.. మార్కెట్ ధర ప్రకారమే?

- అందించాలనే యోచనలో కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణ పనులకు అడుగులు వడివడిగా ముందుకు పడుతున్నాయి. ఈ రహదారి ఉత్తరభాగం నిర్మాణ పనులకు ఆగస్టులో టెండర్లకు వెళ్లి అక్టోబరులో శంకుస్థాపన చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించగా.. ఇందుకవసరమైన తాత్కాలిక జాతీయ రహదారి (ఎన్‌హెచ్) నంబర్ "ఎన్‌హెచ్ 16 1ఏఏ"ను అధికారులు కేటాయించారు. ఇదే సమయంలో ఉత్తర భాగంలోని పలుప్రాంతాల్లో భూసేకరణకు ఆటంకంగా మారిన పరిహారం, ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కూడా కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా.. ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ పరిహారాన్ని ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం అందించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందిస్తే బడ్జెట్ ఎంత పెరుగుతుందనే అంశాన్ని తేల్చాలని ఉన్నతాధికారులకు సూచించినట్టు సమాచారం. అదే విధంగా ఉత్తరభాగానికి పూర్తిస్థాయి జాతీయ రహదారి నంబర్ కేటాయింపు, దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించడం సహా రాష్ట్రానికి మంజూరైన పలు జాతీయ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ జూలై మొదటి లేదా రెండో వారంలో అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నెతన్యాహూ కొత్త ఎత్తు

లెబనాన్‌లో ఉన్న తమ పౌరులను వెంటనే వెనక్కురావాల్సిందిగా జర్మనీ, నెదర్లాండ్స్ తాజాగా హెచ్చరికలు జారీ చేశాయి. ఇప్పటికే కెనడా సహా మరికొన్ని దేశాలు తమవారికి ఇదేతరహా సూచనలు చేసిన విషయం తెలిసిందే. అనేక పాశ్చాత్యదేశాల దౌత్యకార్యాలయాలు తమ పౌరులను ఏయే మార్గాల్లో లెబనాన్‌నుంచి తరలించవచ్చునో ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయట. ఇజ్రాయెలీలను ప్రశాంతంగా ఉంచే ఉద్దేశంలో బెంజమీన్ నెతన్యాహూ లేడు. గాజాని దుంపనాశనం చేసిన ఆయన ఇప్పుడు అక్కడ కాస్తంత తగ్గి, తన బలగాన్ని లెబనాన్ సరిహద్దులకు తరలించి, హిజ్బొల్లాతో పూర్తిస్థాయి యుద్ధం చేయాలని అనుకుంటున్నాడు. నెతన్యాహూకు పటిష్ఠమైన యుద్ధవ్యూహం ఉన్నదని, అది వరుసపెట్టి ఎవరో ఒకరితో యుద్ధాలు చేస్తూండటమేనన్న ఓ సరదా వ్యాఖ్య నూటికి నూరుపాళ్ళూ నిజం. నిరంతర యుద్ధంతోనే తనకు రాజకీయంగా మనుగడ సాధ్యపడుతుందని ఆయనకు తెలుసు.

ఇరాన్ ఎలాగూ ఊరుకోదు. హిజ్బొల్లాతో యుద్ధంలో లెబనాన్‌లోకి నెతన్యాహూ సైన్యాలు చొరబడేందుకు ప్రయత్నించినపక్షంలో ఇరాన్ ప్రవేశంతో ఆ యుద్ధం మరింత తీవ్రమవుతుంది, సరిహద్దులు దాటిపోతుంది. దీనికితోడు, హమాస్‌తో పోల్చితే హిజ్బొల్లా ఆయుధశక్తి, సంఖ్యాబలం మరింత అధికం. ఈ సంస్థ దగ్గర ఉన్న వివిధ రకరకాల క్షిపణులు, రాకెట్లు అధునాతనమైనవి. గాజా యుద్ధం ఆరంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతాల్లో హిజ్బొల్లా జరుపుతున్న దాడులు తీవ్రంగా ఉన్నాయి. సరిహద్దు గ్రామాలు, పట్టణాలను ఇజ్రాయెలీలు వదిలిపోవాల్సివచ్చింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు ఇజ్రాయెల్ తన బలగాలన్నింటినీ కూడగట్టి గట్టిగా యుద్ధం చేసిన పక్షంలో హిజ్బొల్లా తన ఆయుధశక్తినంతటినీ వాడుతుంది, మద్దతుగా ఇరాన్‌ను తెచ్చుకుంటుంది. 2006లో హిజ్బొల్లాతో యుద్ధంలో ఇజ్రాయెల్ పెద్దగా సాధించిందేమీ లేదు.

గాజాలో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన మరుక్షణంనుంచి ఇజ్రాయెల్‌మీద హిజ్బొల్లా దాడులు ఆగిపోతాయి. కానీ, హమాస్ అంతమే తన పంతమని అంటూ నెతన్యాహూ కాల్పుల విరమణను, శాంతి ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నాడు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదించిన ప్రతిపాదనను ఇటీవలే తిరగ్గొట్టిన ఆయన మరో పక్క కొత్త యుద్ధం గురించి మాట్లాడుతున్నాడు. హమాస్ అధీనంలో ఉన్న ఇజ్రాయెలీ బందీలను విడిపించే విషయంలో ఆయన శ్రద్ధ పెట్టడం లేదని సంబంధిత కుటుంబాలవారు ఆగ్రహిస్తున్నారు. ఎన్నటికీ ఆగని యుద్ధంతో విసిగిపోయిన వేలాదిమంది ఇజ్రాయెలీలు రోడ్లమీదకు వచ్చి నెతన్యాహూకు వ్యతిరేకంగా ప్రదర్శనలు, నిరసనలు నిర్వహిస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలని, కొత్తగా ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో చాలా చోట్ల అల్లర్లు, విధ్వంసం జరిగినందువల్ల కాబోలు, కాల్పుల విరమణ విషయంలో ఆయన ఆ తరువాత కాస్తంత మెత్తబడినప్పటికీ, చాలా మెలికలు పెట్టారు. బందీల అప్పగింత పూర్తయ్యేవరకూ కాల్పుల విరమణ అమల్లో ఉంటుంది తప్ప అదేమీ శాశ్వతం కాదన్నట్టుగా ఆయన వ్యాఖ్యానించడంతో హమాస్ దానిని కొట్టిపారేస్తూ తన డిమాండ్లను పునరుద్ఘాటించింది.

యుద్ధం ఆగినపక్షంలో ఎన్నికలు జరిగి, తన కూటమి ప్రభుత్వం పడిపోతుంది, అవినీతి కేసులు వెంటాడతాయి కనుక ఆ పరిస్థితులు రాకుండా నెతన్యాహూ తెలివిగా హిజ్బొల్లాను రెచ్చగొడుతున్నట్టు ఉంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎడతెగని గాజాయుద్ధం బైడెన్‌ను ఇరుకునపెడుతున్న తరుణంలో, నెతన్యాహూ కొత్త ఎత్తు ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి. లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ బలగాలు చొరబడినపక్షంలో ఆ యుద్ధానికి నియమాలు, నిబంధనలు, హద్దులు, అదుపులు ఉండబోవని హిజ్బొల్లా నాయకుడు హసన్ నస్రుల్లా హెచ్చరించారు.

హమాస్‌తో ఇలా ఎంతకాలం యుద్ధం చేసినప్పటికీ, దానిని మహా అయితే తాత్కాలికంగా బలహీనపరచవచ్చునే కానీ, నాశనం చేయడం అసాధ్యమని ఐడీఎఫ్ నెతన్యాహూకు నివేదించినట్టుగా వార్తలు వచ్చాయి. హమాస్‌తో పోల్చితే అనేకరెట్లు శక్తిమంతమైన హిజ్బొల్లాతో యుద్ధానికి దిగి, అటు ఇరాన్‌ను, ఇటు అమెరికా తదితర దేశాలను నెతన్యాహూ ఉచ్చులోకి లాగే ఆలోచన చేస్తున్నారు. ఈ విషయంలో నెతన్యాహూ మెడలు వంచాల్సిన బాధ్యత అమెరికామీద ఉన్నది. ఇజ్రాయెల్–హిజ్బొల్లా యుద్ధాన్ని అమెరికా కోరుకోవడం లేదని, ఆ పరిస్థితి రాకుండా నిలువరించే ప్రయత్నాలు విశేషంగా జరుగుతున్నాయన్న వార్తలు నిజమైన పక్షంలో సంతోషించాల్సిందే.

చెంచు మహిళపై దాడి అమానుషం

నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతపల్లి గ్రామంలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై అత్యాచారం, అత్యంత పాశవికంగా దాడి జరిగింది. జూన్ 21న చైతన్య మహిళా సంఘం సభ్యులు బాధితురాలిని పరామర్శించడానికి వెళ్లినపుడు బాధితులు అనేక విషయాలు తెలిపారు. ఇది కేవలం ఒక మహిళపై జరిగిన హింసగా మాత్రమే కనబడుతున్నది. కానీ కొల్లాపూర్ చుట్టూ ఉన్న నల్లమల అడవిలో 16 చెంచు పెంటలను ప్రభుత్వం పోలీసుల సాయంతో ఖాళీ చేయించింది. మొలచింతలపల్లి గ్రామంలో భ్రమరాంబిక కాలనీ ఏర్పరచి అక్కడ వీరిని వదిలిపెట్టారు. వారికి అక్కడ ఎలాంటి ఆశ్రయం కల్పించలేదు. పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ, ఆహారాన్ని సేకరించుకుంటూ జీవనం గడిపే వీరికి భూమి లేక, ఆహారాన్ని సేకరించుకునే తోవలేక అత్యంత దయనీయ పరిస్థితుల్లో వారు జీవనాన్ని గడుపుతున్నారు. ఉండటానికి ఇల్లు, బతకడానికి సరైన ఉపాధి లేవు. అంతేకాక సరైన వైద్యం, పిల్లలకి చదువుకోడానికి సరైన పాఠశాల సౌకర్యాలు కూడా లేవు. వీరిని అడవి నుంచి గ్రామానికి తరలించడంతో వారి జీవన విధానంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులను వారు తట్టుకోలేకపోయారు.

ప్రభుత్వం 14 ఎకరాలు భూమిని ఒక రెడ్డి దగ్గర కొని, ఎలాంటి పట్టాలు లేకుండా, దానిని సాగు చేసుకోవాలని చెంచులకు ఇచ్చింది. అందులోనే వారు కొన్ని గుడిసెలు వేసుకున్నారు. కొన్నాళ్లకు ప్రభుత్వానికి అమ్మిన భూమిని మళ్ళీ ఆయనే ఆక్రమించి, గుడిసెలు వరకు వదిలేసి మొత్తం భూమిని దున్నుకోవడం మొదలు పెట్టాడు. కనీసం కాలి బాటకు తొవ్వ కూడా ఇవ్వలేదు. చేతిలో పట్టాలు గానీ, ప్రభుత్వం చెంచులకు ఇచ్చినట్లు ఆధారాలు గానీ లేక నిస్సహాయతతో పడుతున్న బాధలను చెప్పుకోలేని పరిస్థితిలో వారంతా మద్యానికి బానిసలయ్యారు. ఉపాధి లేక చుట్టుపక్కల కాంట్రాక్టర్ల దగ్గర, తోటల్లో కాపలాకి పనికి కుదిరి వెట్టిచాకిరి చేస్తున్నారు. తిండి, వైద్యం లేక మద్యానికి బానిసలై సుమారు 100 మంది చెంచులు మరణించారు. చాలామంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు.



మావోయిస్టులకు ఆశ్రయం కల్పిస్తున్నారని, వారికి అన్నం పెడుతున్నారని చెప్పి చెంచు పెంటలను ఖాళీ చేయించిన ప్రభుత్వం... ఉపాధి, భూమి, చదువు, ఆరోగ్యం, భద్రత లేకుండా చెంచుల మరణాలకు కారణం అయింది. ఒక పథకం ప్రకారం భూమిని, ఖనిజ సంపదను దోచుకోవడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలా చేస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో వెంకటేష్, శివుడు అనే ఇసుక కాంట్రాక్టర్ల ట్రాక్టర్లలో ఇసుక వేయడానికి ఈశ్వరమ్మ చిన్న మామ నాగయ్య పనికి కుదిరాడు. నాగయ్యకి నెలకు 5000 రూపాయలు ఇచ్చేవారు. అంటే రోజుకి 150 రూపాయల కూలి. ఇది సరిపోవడం లేదని మరికొంత కూలి పెంచాలని నాగయ్య భార్య అంజమ్మ కోరింది. దానికి కోపంతో ఊగిపోయిన వెంకటేశు, శివుడు ఆమెను అందరి ముందు బాగా కొట్టారు. తన కళ్ళముందే భార్యను కొట్టడాన్ని చూసిన నాగయ్య వారిపై తిరగబడ్డాడు. చివరికి పని మానేసి చేపల వేటకు వెళ్లేవాడు. అలా వెళ్లిన నాగయ్య నాలుగవ రోజే ఒళ్లంతా గాయాలతో మరణించాడు. ఇది హత్య అని, చేసింది వెంకటేశు, శివుడు అని ఊరందరికీ తెలుసు. అయినా డబ్బు, అధికారం బలం కలిగిన వారు చెంచులకు మాయ మాటలు చెప్పి, బెదిరించి త్వరగా అంత్యక్రియలు పూర్తయ్యేటట్లు చేశారు.

ఈశ్వరమ్మ, ఈదన్నలు కూడా వెంకటేష్, శివుడు దగ్గర పొలంలో కూలీలుగా పని చేసేవారు. వీరికి రోజుకి 200 రూపాయలు ఇచ్చేవారు. అంటే మనిషికి 100 రూపాయలు. ఈశ్వరమ్మ కుటుంబం అవసరాల నిమిత్తం 20వేల రూపాయలు వెంకటేష్ దగ్గర అప్పు తీసుకున్నది. ఈ డబ్బులు ఇచ్చేటప్పుడు మధ్యవర్తిగా ఈశ్వరమ్మ అక్క ఉన్నది. ఇచ్చే కూలి డబ్బులు సరిపోవటం లేదని, తన ముగ్గురు పిల్లల పోషణ చాలా కష్టం అవుతోందని, కూలి పెంచాలని వెంకటేష్‌ను ఈశ్వరమ్మ నిలదీస్తుండేది. ఇదే విషయంపై భర్తతో కూడా కొట్లాడేది. కూలి పెంచితేనే పని చేస్తానని లేదా కూలి ఎక్కువ ఇచ్చిన చోటనే పని చేస్తానని చెప్పి, వాళ్ళ అమ్మగారి ఇంటికి వెళ్లింది. తీసుకున్న 20 వేల రూపాయలు అప్పు చెల్లించకపోగా, పని మాని వెళ్లిపోయినందుకు ఈశ్వరమ్మ అక్కను వెంకటేశు, శివుడు ఇద్దరు కలిసి వెంటనే డబ్బులు కట్టాలని కొట్టారు. అంతే కాకుండా ఈశ్వరమ్మ ఎక్కడ ఉన్నా తీసుకురావాలని కుటుంబ సభ్యులపై వత్తిడి పెట్టారు. తల్లి గారి ఇంటికి వెళ్లిన ఈశ్వరమ్మను మంచి మాటలు చెప్పి తీసుకువచ్చి, ఆమెపై అత్యాచారం చేసి, పది రోజులు ఇంట్లో బంధించి ఇష్టం వచ్చిన రీతిలో కొట్టారు. ఆమె ప్రైవేటు భాగంలో పెట్రోల్‌లో ముంచిన గుడ్డ పెట్టి నిప్పు పెట్టారు. కుటుంబ సభ్యుల చేత కూడా కొట్టించారు. పురుషాధిక్యత గల సమాజంలో మహిళను సొంత ఆస్తిగా భావించే భూస్వామ్య భావజాలంలో మహిళే మొదట టార్గెట్ అవుతుంది. ఇది ఒక కుటుంబ సమస్యగా కనబడుతున్నా, దీని వెనుక అనేక చెంచు కుటుంబాల విధ్వంసం ఉంది. మనిషి తమకు ఇష్టం వచ్చినట్లు బతికే హక్కులను కోల్పోయేటట్లు చేసే నిర్లక్ష్యం కనబడుతుంది.

మావోయిస్టులకు ఆశ్రయం కల్పిస్తున్నారని, వారికి అన్నం పెడుతున్నారని చెప్పి చెంచు పెంటలను ఖాళీ చేయించిన ప్రభుత్వం... ఉపాధి, భూమి, చదువు, ఆరోగ్యం, భద్రత లేకుండా చెంచుల మరణాలకు కారణమయింది. మావోయిస్టుల పేరు చెప్పి ఒక పథకం ప్రకారం అడవుల నుంచి చెంచులను ప్రభుత్వాలు ఖాళీ చేయిస్తున్నాయి. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అడవులకు సంరక్షణగా వుండే ఆదివాసీలను, చెంచులనూ ఖాళీ చేయించి భూమిని, ఖనిజ సంపదను దోచుకోవడంలో భాగమే ఈ సంఘటన.

1. అత్యాచారానికి, హింసకు గురి అయిన ఈశ్వరమ్మకు వెంటనే ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా ఆమెకు, భూమి ఇల్లు ఇవ్వాలి. 2. భ్రమరాంబ కాలనీలో ఉన్న చెంచు కుటుంబాలని తక్షణమే వారి చెంచు పెంటలకు చేర్చాలి. 3. చెంచు పెంటలో మూసుకున్న పాఠశాలను తెరిపించి, పిల్లలందరికీ అక్కడ విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలి. 4.చెంచులు పోడు భూములు దున్నుకునే విధంగా వారికి హక్కు కల్పించాలి. 5. ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేసి వారికి తక్షణమే పోషక ఆహారాన్ని అందించాలి. 6. ఒక్కో కుటుంబానికి 15 లక్షలు పరిహారంగా ఇవ్వాలి. 7. ప్రధాన నిందితుడు శివుడును అరెస్ట్ చేయాలి. 8. అరెస్ట్ చేసిన చెంచులను విడుదల చేయాలి. ఇవన్నీ చేసిన రోజే ఈశ్వరమ్మకు న్యాయం జరిగినట్లు. దీనికి వెంకటేష్, శివయ్య మాత్రమే నేరస్తులు కారు. మనుషులు జీవించే హక్కును హరించడం కూడా నేరమేనని చైతన్య మహిళా సంఘం భావిస్తున్నది.

ప్రజాసంఘాల ఒత్తిడి మేరకు నాగన్న శవాన్ని బయటకు తీసి జూన్ 26న పోస్టుమార్టం నిర్వహించారు. నాగన్న మరణానికి కారణమైన వారిని కూడా అరెస్ట్ చేయాలి. మిగిలిన అన్ని డిమాండ్లపై పౌర సమాజం కదలాలని, చెంచు ప్రజలపై జరుగుతున్న విధ్వంసాన్ని గుర్తించి, వారికి న్యాయం జరిగే వరకూ మాట్లాడాలని చైతన్య మహిళా సంఘం ప్రజలను, ప్రజా సంఘాలను పార్టీలను కోరుతున్నది.

▪ కాగుల శ్రీదేవి
చైతన్య మహిళా సంఘం

కలిసి నడవడమంటే ఇదీ కాదు కదా!?

అపూర్వ, అసాధారణ ఇత్యాది విశేషణాలతో అభివర్ణించాల్సిన ప్రజా తీర్పు అది. సందేహం లేదు, దేశ పాలకుల దురహంకారాన్ని; శాసన నిర్మాణంలోను, శాసన పాలనలోను ప్రజాప్రతినిధుల అసమర్థత, అలక్ష్య ధోరణులను నిరసిస్తూ, సమస్త రాజకీయ నాయకులు ప్రజాస్వామిక విలువలను గౌరవిస్తూ, ప్రజలకు జవాబుదారీగా ఉండి తీరాలని నిర్దేశిస్తూ కోట్లాది ఓటర్లు ఉద్దేశించిందే 2024 లోక్‌సభ ఎన్నికల తీర్పు. ప్రజా సంకల్పాలు నెరవేరుతాయా? వాటి చరిత్ర నిరాశాజనకంగా ఉండవచ్చు లేదా ఆశావహంగా పరిణమించవచ్చు. దేశ రాజకీయ నాయకుల వ్యవహారశైలిపై ప్రజాతీర్పు ప్రభావం ఓటర్లు ఆశించిన దానికి పూర్తి విరుద్ధంగా ఉన్నట్టు 18వ లోక్‌సభ సమావేశాల ఆరంభంలోనే వెల్లడయింది. మోదీ ప్రభుత్వం 400 సీట్లకు పైగా గెలుచుకోవాలన్న తన లక్ష్యం నెరవేరిందన్న రీతిలో వ్యవహరిస్తోంది. ఇక కాంగ్రెస్ తాము కనీస మెజారిటీని మించి సీట్లను స్వాయత్తం చేసుకున్నట్టుగా ప్రవర్తిస్తోంది. వాస్తవ పరిస్థితుల పట్ల ఈ ప్రధాన పార్టీల ఉపేక్షాభావం పర్యవసానమే పాత వైరాల పునర్దసనం. దేశ శ్రేయస్సు దృష్ట్యా విభేదాలు, వివాదాలకు విరామం పాటించితీరాల్సిన తరుణంలో ప్రధాన రాజకీయ పక్షాలు పాత ప్రతికూలతలు, పట్టుదలలకు పోతున్నాయి. లోక్‌సభ స్పీకర్ ఎన్నికపై ఘర్షణే ఇందుకొక నిదర్శనం. అది పూర్తిగా నివారణ సాధ్యమైనదే. అయితే పాలక ప్రతిపక్షాల మధ్య రాజీ వైఖరి, ఏకాభిప్రాయాన్ని సాధించే ప్రయత్నం కొరవడడం వల్లనే స్పీకర్ పదవికి ఎన్నిక అనివార్యమయింది. పరస్పర సహనశీలత, సదవగాహన ఏమైనట్టు?



ప్రధాని మోదీ ఇంకెంత మాత్రం దేశ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయలేరన్న వాస్తవాన్ని 2024 లోక్‌సభ ఎన్నికలు రుజువు చేశాయి. కొత్త శక్తిని సంతరించుకున్న ప్రతిపక్షం తన గొంతుకను ప్రభావదాయకంగా విన్పించగలదని, ప్రభుత్వానికి ఎజెండాను నిర్దేశించగలదని స్పష్టమయింది. దశాబ్దం పాటు తిరుగులేని అధికారాలను చెలాయించిన ప్రభుత్వాధినేత ఇప్పుడు ఏర్పడ్డ సరికొత్త పరిస్థితులు చాటుతున్న వాస్తవాలను నిర్లక్ష్యం చేయడం తగదు.

ఇదే కాదు, కలత పెడుతున్న ఇతర పరిణామాలూ ఎన్నో ఉన్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను దర్యాప్తు సంస్థలు ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన ఒక కేసులో కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు రానుండగా సీబీఐ ఆయన్ని అరెస్ట్ చేసింది. రచయిత్రి అరుంధతీరాయ్‌పై పద్నాలుగేళ్ల కేసు నొకదాన్ని తిరగదోడి ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద ఆమెను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతినిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బుల్డోజర్లు ఇంకా గృహాలను కూల్చివేస్తూనే ఉన్నాయి. గోరక్షణ నిఘాకారులు మళ్లీ చెలరేగిపోతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెలారంభంలో ముగ్గురు పశు విక్రేతలను కిరాతకంగా హతమార్చారు.

ఓటర్ల తీర్పును ఘనతవహించిన మన దేశ పాలకులు నిర్లక్ష్యం చేయడం మనకు ఏమీ ఆశ్చర్యం కలిగించదు. రాజకీయ దుర్బలత్వాన్ని ఏ మాత్రం, కనీసం బహిరంగంగా వెల్లడించకుండా ఉండడమనేది నరేంద్ర మోదీ చాణక్య వ్యూహాలలో ఒక ప్రధాన అంతర్భాగం. గాంధీనగర్‌లోను, న్యూ ఢిల్లీలోను 23 సంవత్సరాల పాటు నిరంతరాయంగా అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ తన పాలనా బలహీనతలను, నిర్ణయాలలో పొరపాట్లను ఒక్కసారి కూడా అంగీకరించలేదు. లోక్‌సభలో తమ పార్టీ సంఖ్యా బలాన్ని గణనీయంగా తగ్గించివేసిన జూన్ 4 తీర్పు ఒక పరాజయమే అయినప్పటికీ ఆ వైఫల్య ప్రభావాన్ని మోదీ పూర్తిగా కప్పిపుచ్చుతున్నారు. పాలనా రంగంలోను, రాజకీయ పరిస్థితులలోను నిజంగా ఏమీ మారలేదన్న భావాన్ని భారత ప్రజలకు, విశాల ప్రపంచానికి స్ఫురింప చేస్తున్నారు! పాత కేబినెట్ మంత్రులే కొత్త కేబినెట్ మంత్రులుగా కొనసాగుతున్నారు. తగ్గిన మెజారిటీతో మూడోసారి అధికారంలోకి వచ్చి, సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నప్పటికీ ఎంతమాత్రం తగ్గేదే లేదని మోదీ తన హావభావాలు, ప్రవర్తనా రీతులతో స్పష్టంగా చాటుతున్నారు.

నీట్–యుజి, యుజిసి–నెట్ పరీక్షల వివాదాన్నే తీసుకోండి. బాధితులైన విద్యార్థులు వేల సంఖ్యలో వీధుల్లోకి వచ్చి హాహాకారాలు చేశారు. మరి మోదీ ఒక్క సానుభూతి మాట అయినా పలికారా? ఒక మౌనిలా ఉండిపోయారు! జరిగిన అవకతవకలకు ప్రభుత్వం తరఫున విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ముందుకు తోశారు. ప్రధాన్ విద్యాశాఖను నిర్వహించడం ఇదే మొదటి సారి కాదు. మునుపటి మోదీ సర్కార్‌లోనూ ఆయన విద్యామంత్రిగా ఉన్నారు. మరి నీట్ అక్రమాలు వెల్లడయిన ప్రస్తుత సందర్భంలో తనకు విద్యాశాఖ బాధ్యతలు కొత్తవి అని ఆయన ఎలా అనగలరు? పాపం, ప్రధాన్! గత ఏడు సంవత్సరాలలో జాతీయ, రాష్ట్ర స్థాయి వృత్తి విద్యా కోర్సుల ప్రవేశ పరీక్షలలో 70కి పైగా ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి. ఆ అక్రమాలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం చేసిందేమిటి? చిత్తశుద్ధితో చర్యలు చేపట్టలేదు కనుకనే ఈ ఏడాది ఆ అవినీతి మరింత తీవ్రంగా చోటు చేసుకున్నది. ప్రధాన్ మహాశయుడు నీట్ క్వశ్చన్ పేపర్స్ లీక్‌ను తొలుత తిరస్కరించారు. అటువంటిదేమీ జరగలేదని ఖండితంగా చెప్పారు. ఆ తరువాత నిరసన తెలుపుతున్న విద్యార్థులను సైతం ఆయన తప్పు పట్టారు. ఈ లీకేజీ అనేది ఏదో చిన్నపాటి వైపరీత్యం మాత్రమేనని సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. పాపం ప్రధాన్! ఒడిషాకు తొలి బీజేపీ ముఖ్యమంత్రి కావాలని ఆయన ప్రగాఢంగా కోరుకున్నారు. అయితే నీట్ ప్రవేశ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీ పాపాలను మోయవలసిన దుస్థితిలో పడ్డారు.



▪ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

నీట్ విషయంలోనే మళ్లీ ప్రధానమంత్రి వద్దకు వద్దాం. ఆయన ఏటా ఒకసారి 'పరీక్షా పె చర్చ' నిర్వహిస్తుంటారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవాలన్న విషయమై అసేతు హిమాచలంలోని విద్యార్థులను ఉద్దేశించి ఆ కార్యక్రమంలో ప్రసంగిస్తుంటారు. ఈ వార్షిక కార్యక్రమం తనకు గర్వకారణమని ఆయన తరచు చెప్పుతుంటారు. ఒక సద్గురు మాదిరిగా ఆయన వ్యవహరిస్తారు. మరి అదే విద్యార్థులు తమ భవిష్యత్తు ఏమిటో తెలియక ఇప్పుడు కొట్టుమిట్టాడుతుంటే వారికి సహానుభూతిగా మోదీ ఒక మాట అయినా మాట్లాడారా?

మోదీ సర్కార్ వాస్తవాలను చూడడానికి నిరాకరిస్తున్న మరో దృష్టాంతం మణిపూర్ విషాదం. 13 నెలలుగా మణిపూర్‌లో జాతుల మధ్య హింసాకాండ చెలరేగుతోంది. తన రాజకీయ పలుకుబడితో ఆ ఈశాన్య రాష్ట్రంలో శాంతి సామరస్యాల పునరుద్ధరణకు ప్రధానమంత్రి పూనుకున్నారా? మణిపూర్ ప్రజలను ఆదుకోవడానికి అసలు ఆయన ప్రయత్నించనే లేదు. ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా ఆ రాష్ట్రాన్ని సందర్శించనే లేదు. సుదీర్ఘ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి ఎన్నో ఇంటర్వ్యూలు ఇచ్చారు. అయితే ఏ ఒక్క ఇంటర్వ్యూలోను మణిపూర్ సంక్షోభాన్ని ప్రస్తావించనే లేదు. విధేయ పాత్రికేయులు ఆయన్ని మణిపూర్ విషయమై ప్రశ్నిస్తే కదా. ఆ ఈశాన్య రాష్ట్రంలో హింసాకాండను నిలిపివేసే బాధ్యతను హోం మంత్రికి వదిలివేశారు. సరే, అమిత్ షా ఉన్నతస్థాయి అధికారులతో సమావేశమై మణిపూర్‌లో పరిస్థితులను సమీక్షించారు. ఇది బాగానే ఉంది కానీ రాజకీయంగా మణిపురీలకు సన్నిహితమవ్వాల్సిన అవసరాన్ని ఎందుకు విస్మరిస్తున్నారు? ఇలా అయితే మణిపూర్‌కు ఎడతెగని సంక్షోభం నుంచి ఉపశమనం లభించేదెప్పుడు?

మోదీ ప్రభుత్వం సగర్వంగా చెప్పుకునే ఒక రంగం–రైల్వే మౌలిక సదుపాయాలు – గురించి చూద్దాం. ఇటీవల కాంచన జంగ ఎక్స్‌ప్రెస్, ఒక గూడ్స్ రైలు ఎదురెదురుగ ఢీకొన్న ఘటననే తీసుకోండి. రైల్వే భద్రతా వ్యవస్థలోని లోటుపాట్లను అది పూర్తిగా బహిర్గతం చేసింది. ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుతున్న 'కవచ్' రక్షణ వ్యవస్థ ఈ సువిశాల దేశంలోని చాలా కొద్ది ప్రాంతాలలోని రైల్వే వ్యవస్థలకు మాత్రమే అందుబాటులో ఉన్నది. విద్యామంత్రి వలే రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా పాలనలో నిరంతరాయతకు ప్రతీకగా ఉన్నారు. రైల్వే శాఖతో పాటు సమాచార ప్రసార మంత్రిత్వశాఖ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల బాధ్యతలు కూడా వైష్ణవే నిర్వహిస్తున్నారు. ప్రస్తావిత ప్రమాదం జరిగిన రోజున ఈ మంత్రిత్వ శాఖలకు అదనంగా ఆయనకు మరో బాధ్యతను కూడా అప్పగించారు. అది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ బాధ్యతల నిర్వహణ. రైల్వే శాఖకు ఒక పూర్తిస్థాయి మంత్రి అవసరం లేదా?

నిజమేమిటంటే పాలనలో తీవ్ర లోటుపాట్లు ప్రభుత్వాన్ని ప్రజల్లో చులకన చేస్తున్నాయి. పాలన పూర్తిగా కొద్ది మంది నేతల నియంత్రణలో నడుస్తున్న ఫలితంగా ప్రభుత్వం, పార్టీ మధ్య విభజన రేఖలు చెరిగిపోయాయి. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో జవాబుదారీ తనానికి ఆస్కారం లేకుండా పోయింది. లోక్‌సభలో సంఖ్యాబలం భారీగా ఉండడంతో మోదీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోసాగింది. విపక్షాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అంతేకాదు వాటిని ఏవగించుకుంది. ప్రభుత్వాన్ని విమర్శించిన వారినందరినీ 'జాతి –వ్యతిరేకులు'గా పరిగణించింది. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంకెంత మాత్రం దేశ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయలేరన్న వాస్తవాన్ని 2024 లోక్‌సభ ఎన్నికలు రుజువు చేశాయి. కొత్త శక్తిని సంతరించుకున్న ప్రతిపక్షం తన గొంతుకను ప్రభావదాయకంగా విన్పించగలదని, ప్రభుత్వానికి ఎజెండాను కూడా నిర్దేశించగలదని కూడా ఆ ఎన్నికలు స్పష్టం చేశాయి. నిరంకుశ పాలకుడుగా పేరు పొందిన ప్రభుత్వాధినేత తన పాలనకు వాటిల్లే కళంకాలను అంత త్వరగా తొలగించుకోలేడు. అధికార భ్రమల నుంచి బయటపడి వాస్తవ పరిస్థితులను ఎదుర్కోవలసి రావడం అనివార్యమవుతుంది. దశాబ్దం పాటు తిరుగులేని అధికారాలను చెలాయించిన ప్రభుత్వాధినేత ఇప్పుడు ఏర్పడ్డ సరికొత్త వాస్తవ పరిస్థితులు చాటుతున్న వాస్తవాలను నిర్లక్ష్యం చేయడమనేది వివేకవంతమైన నిర్ణయం, విజ్ఞతాపూర్వక ప్రవర్తన కావు, కాబోవు.

తాజా కలం: ఈ వారాంతంలో ప్రధానమంత్రి తన నెలవారీ రేడియో ప్రసంగ కార్యక్రమం 'మన్ కి బాత్'ను పునః ప్రారంభించనున్నారు. ప్రజలకు సందేశాలను ఇవ్వడంలోనూ తన శైలిలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేసేందుకే, బహుశా, ఆయన తన 'మనసులోని మాట'ను మళ్లీ విన్పించనున్నారు. మరి ఈ కాలమ్‌లో నేను లేవనెత్తిన ప్రశ్నలు ఎంత ఇబ్బందికరమైనవి అయినప్పటికీ, నరేంద్ర మోదీ తన రేడియో ప్రసంగంలో వాటికి సమాధానాలు ఇవ్వగలరని ఆశిస్తున్నాను.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఆధునికం.. ఆలయం.. రాజకీయం!

భారత్ అంటే ఆత్మజ్ఞాన అవలోకన.. ఇహలోక విముఖత.. మోక్షమార్గ అన్వేషణ.. ధర్మాధర్మ వివేచన.. ఈ భావనలు ఒకప్పుడు బాగా వినిపించేవి. ధనార్జనకు, శారీరక కోరికలకు భారత సంస్కృతిలో సముచిత స్థానం లేదని, వీటిని అదుపులో ఉంచటమే మన గొప్పతనమని ప్రచారం జరిగేది. ప్రజలందరూ ఇవే భావాలతో ఉండేవారా? లేక కొద్దిమందికే అవి పరిమితమా? అని ప్రశ్నించుకుంటే జవాబులు స్పష్టంగానే కనపడతాయి. మన సమాజమంతా ఎప్పుడూ ఆధ్యాత్మిక చింతనలో మునిగిపోలేదు. సంపదలకు, సుఖాలకు, అధికార దాహాలకు దూరంగా లేదు. గతంలో జరిగిన యుద్ధాలే అందుకు నిదర్శనం. అద్వైత చింతనతో పాటూ కౌటిల్య నీతి పుష్కలంగా ఉండేది. కొద్దిమంది పాటించే విలువలను, నమ్మకాలను అందరివిగా పరిగణించటంతో మనలో విచిత్ర భావనలు ఏర్పడ్డాయి. వాటికి కారణాలను శోధిస్తే చాలా సంగతులు తెలుస్తాయి. బ్రిటిషు పాలనను సవాల్ చేయటానికి స్ఫూర్తినిచ్చే భావజాలం ఆనాడు కావాల్సి వచ్చింది. ఆత్మన్యూనతతో బలమైన శక్తులను ఎదుర్కోలేం. జాతీయోద్యమ కాలంలో గతానికి సంబంధించి ఘనమైన ఉదాత్త చిత్రాన్ని అందుకోసమే సృష్టించుకున్నాం. ఆధ్యాత్మిక ఔన్నత్యానికి భారత్ ప్రతీక అన్న భావన అలా ఏర్పడిందే! మన గతమంతా గొప్పదనే ఆలోచనకు మూలమూ అదే. ఆత్మజ్ఞానంలో మనమే మేటి అన్న అతిశయోక్తులు ఆ దారిలోనే వచ్చాయి. పాశ్చాత్య దేశాలకు భౌతిక సంపద దండిగా ఉండొచ్చు! బాహ్యలోక విజ్ఞానం మెండుగానూ ఉండొచ్చు! కానీ ఆత్మసంతృప్తిని అందించే తత్వం కోసం భారత్ వైపే చూడాలన్న వాదన ఆ ధోరణిలో భాగమే!

రాజకీయ అవసరాల కోసం ప్రచారమైన ఈ భావాలను వాస్తవాలుగా అంగీకరిస్తే నిజస్వభావాలు మరుగున పడిపోతాయి. కాలక్రమంలో వాటిని వెలికితీయటం కష్టంగా మారుతుంది. వెలికి తీసినా నమ్మటం తేలిక కాదు. ఇప్పటికీ ఈ సమస్య తీవ్రంగానే ఉంది. అయినాసరే వాస్తవాల లోతుల్లోకి వెళ్లే చరిత్రకారులు ఎప్పుడూ ఉంటారు. దక్షిణ భారతం అంటేనే ఆలయాలకు నిలయం. వాటి చుట్టూ తిరిగిన రాజకీయాలనూ, ఆధిపత్యాల పట్టువిడుపులనూ పరిశీలించిన వారిలో చరిత్రకారుడు క్రిస్టఫర్ బేకర్ ఒకరు. దక్షిణ భారత రాజకీయాలపై బేకర్ లోతైన విశ్లేషణలు చేశారు. అందులో భాగంగా ఆలయాలు రాజకీయాల పరస్పర ప్రభావాల గురించి ఎన్నో విశేషాలను వెల్లడించారు.

ఆలయాలు ఆధ్యాత్మిక, శిల్ప కళా కేంద్రాలే కాదు.. సామాజికార్థిక జీవనంలోనూ వాటిది కీలక పాత్రే. కిందటి శతాబ్దం ఆరంభం నాటికి మద్రాసు రాష్ట్రంలోనే 75,000 ఆలయాలు ఉండేవి. వీటిల్లో కొన్ని చాలా పెద్దవి. మదురై, రామనాథపురం, తిరుచిరాపల్లి, తంజావూరు, తిరునెల్వేలి జిల్లాలు ఆలయాలకు చాలా ప్రసిద్ధి. మదుర మీనాక్షి, బృహదీశ్వరాలయం, రామేశ్వరం, రంగనాథస్వామి ఆలయాలు ఇక్కడే ఉన్నాయి. మన తిరుపతి గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. భక్తుల సందర్శనలో, ఆదాయంలో దానితో పోల్చదగిన ఆలయం మరొకటి లేదు. రాజులు, సామంతులు, సేనానాయకులు, వ్యాపారులతో పాటు సాధారణ భక్తులు కూడా భూములు, నగలు, నగదును దానాలుగా ఇవ్వటంతో పెద్ద దేవాలయాలు ఆర్థికంగా పరిపుష్టంగా ఉండేవి. వివిధ రూపాల్లో పోగుపడిన సంపదతో ఆర్థికంగా దేవాలయాల పాత్ర పెరిగిపోయింది. వందేళ్ల క్రితం ఏదైనా గుడికి ఏటా లక్ష రూపాయల ఆదాయం వస్తే చాలా ఎక్కువ. ఒక్క తిరునెల్వేలి జిల్లాలోని అయిదు శైవ మఠాల్లో ఒక్కోదానికి దాదాపు ఆనాడు లక్ష ఆదాయం ఉండేది. తిరుపతి ఆదాయం 19వ శతాబ్దం చివరిలోనే ఏటా 5 లక్షలు ఉండేది. 1950ల నాటికి రోజుకు లక్ష దాటేసింది. ఇక దానంగా వచ్చిన భూములు వేలవేల ఎకరాల్లో ఉండేవి.

చరిత్రను నిశితంగా చూస్తే తెలిసేది ఒకటే! ఆలయాలు రాజకీయాలకు ఎప్పుడూ దూరంగా లేవు. రాజులు తమ పాలనను సమర్థించుకోటానికి, పాలితులను విధేయులుగా మార్చుకోటానికి, తాము దైవాంశ సంభూతులం అన్న భావనను పెంచుకోటానికి ఆలయాలను ఉపయోగించుకున్నారు. వలసపాలన నాటి రాజకీయాలు ఆలయాలపై ఆధిపత్య పోరును పెంచాయే తప్ప తగ్గించలేదు. స్వతంత్ర పాలనలో బహిరంగపోరు తగ్గినా ఆశ్రితులకు, అనర్హులకు ఆలయ పదవులను కట్టబెట్టటం అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంది.



తమిళనాడులో తంజావూరు చాలా ధనిక జిల్లా. 1950ల్లో కూడా అక్కడ మూడోవంతు భూములు గుడులతో ముడివడి ఉండేవి. భూసంపద, నగదు నిల్వలు భారీగా ఉన్న దేవాలయాలు ఉద్యోగ, ఉపాధులనూ ఎక్కువే కల్పించేవి. పూజారులు, సహాయకులు, వాయిద్యకారులు, నాట్యకత్తెలు, ఆదాయ గణకులు, వృత్తి పనివారు, భూముల పర్యవేక్షకులు, పంటల పరిశీలకులు, శిల్పులు, మరమ్మతుదారులు, కాంట్రాక్టర్లు, సామగ్రి సరఫరాదారులు.. ఇలా ఎంతోమంది ఆలయాలపై ఆధారపడేవారు. పెద్ద విపణులు, దుకాణాల సముదాయాలు కూడా ఆలయాల నియంత్రణలో ఉండేవి. వడ్డీలకు ఆలయాలు అప్పులు ఇచ్చేవి.

ఒక కులం సామాజిక స్థాయిని నిర్దేశించటంలో కూడా ఆలయాల పాత్ర ఉండేది. ఆలయాల్లో ఏ కులం వారిని ఎంత మేరకు అనుమతించాలి.. ఎవరికి ఏ పూజలో పాల్గొనే అవకాశమివ్వాలి.. అన్నవి చాలా కీలకంగా ఉండేవి. వీటిని బట్టి కూడా కులాల హోదాలు నిర్ణయమయ్యేవి. ఏదైనా వ్యాపారంలో బాగా లాభాలు గడించిన వారు ఆలయాల గుర్తింపు పొందటానికి తహతహలాడేవారు. నట్టుకొట్టై చెట్టియార్లకు ఒకప్పుడు సామాజికంగా ప్రముఖస్థానం ఉండేది కాదు. ఆలయాలకు విరాళాలు ఇచ్చి మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. సారాయి వ్యాపారంలో బలపడిన నాడార్లు అలాంటి స్థానాన్నే పొందారు.



▪ రాహుల్ కుమార్

ఆలయాలతో పాటు మఠాలు కూడా ప్రముఖపాత్రను పోషించేవి. కొత్త పార్లమెంటు భవనంలో ఉంచిన రాజదండంపై (సెంగోల్) పెద్ద వివాదం చెలరేగిన సంగతి గుర్తుండే ఉంటుంది. దాన్ని నెహ్రూకు అందించింది తిరువాదుతురై మఠం. ఈ మఠానికి తిరునెల్వేలి, మదురై, తంజావూరు జిల్లాల్లో 38,000 ఎకరాల భూములుండేవి. మరో 130 మఠాలపై కూడా తిరువాదుతురైకు నియంత్రణ ఉండేది. నాంగునేరి వైష్ణవ మఠానికి కూడా పెద్దఎత్తున ఆస్తులు ఉండేవి. 200 వైష్ణవ మఠాలు దాని ఆధీనంలో ఉండేవి. ఇలా పెద్ద ఆలయాలు, మఠాల సంపదలు, ఆస్తులు, నియంత్రణల గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. సంపదలు, ఆస్తులు ఉన్నచోట ఆధిపత్య పోరు ఉంటుంది. ఆలయాలు అందుకు అతీతం కాలేదు. గుడులపై ఆధిపత్యం రాజకీయ జీవితానికి సోపానంగా భావించటం 19వ శతాబ్దంలో మొదలైంది. బ్రిటిషు పాలకులు ఏర్పాటుచేసిన స్థానిక సంస్థల పదవుల కోసం పోటీచేయటానికి ఆలయ కమిటీల్లో సభ్యులుగా, ట్రస్టీలుగా ఉండటాన్ని మొదటిమెట్టుగా భావించేవారు.

1923లో రెండు వర్గాలు మదుర మీనాక్షి ఆలయ ఆధిపత్యం కోసం పెద్దపోరాటాలే చేశాయి. గెలిచిన వర్గం నేతృత్వంలో కుంభాభిషేకం జరిపితే దాన్ని అడ్డుకోటానికి వైరివర్గం ప్రయత్నించింది. ఆలయ మేనేజరు పోస్టుపై వివాదం మొదలై సమ్మెచేసే వరకూ పరిస్థితి వెళ్లింది. ధర్నాలు, ఆందోళనలతో ఆలయం అట్టుడికిపోయింది. వివాదం కోర్టులకు ఎక్కింది. తిరువాదుతురై మఠాధిపతి 1920లో చనిపోతే వారసత్వ వివాదం మొదలై 15 ఏళ్లపాటు కేసులు కొనసాగాయి.

ఆలయాలపై నియంత్రణ ఒక్కోచోట ఒక్కోరీతిలో ఉండేది. కొన్నిచోట్ల ఆలయాన్ని స్థాపించిన జమిందారీ కుటుంబాలే వాటిపై అధికారాన్ని చలాయించాయి. ఉత్తర సర్కారు (కోస్తాంధ్ర) జిల్లాల్లో ఈ పరిస్థితి ఉండేది. కులాల అజమాయిషీలో కూడా కొన్ని ఆలయాలు ఉండేవి. కోమటి వర్గం చేతుల్లోని కన్యకాపరమేశ్వరి ఆలయాలను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కొన్ని చోట్ల మఠాల నియంత్రణ ఉండేది. మరికొన్ని చోట్ల ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే వ్యక్తులు సర్వం తమ చేతుల్లోకి తీసుకుని చక్రం తిప్పేవారు. స్థానికుల నుంచి ఎంపికైన కమిటీల చేతుల్లో కొన్నిచోట్ల ఆలయాల నిర్వహణ ఉండేది. బ్రిటిషు పాలనకు ముందు స్థానిక రాజులు ఆలయాల కార్యకలాపాలను నియంత్రించేవారు. ఆలయ నిధులపై పన్ను కూడా విధించేవారు. కొన్నిచోట్ల ఆలయ అధికారులకే శిస్తువసూలు బాధ్యతను అప్పగించేవారు. ఆలయాలపై పట్టు నిలుపుకోవటం తమ పాలనకు కీలకంగా భావించేవారు. బ్రిటిషు పాలకులు కొంతకాలం ఆ పాత్రను నిర్వహించి 1857 తర్వాత దాన్ని పూర్తిగా వదిలేశారు. కొన్నిచోట్ల మఠాధిపతులు, జమిందార్లనే నిర్వహణను చూసుకోమన్నారు. మరికొన్ని చోట్ల కొన్ని కుటుంబాలకు వాటిని కట్టబెట్టారు. అట్లా వీలుకాని చోట్ల కమిటీలను ఏర్పరచారు. 1920ల నాటికి ఆలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఆలయాల వ్యవహారాలపై ప్రభుత్వం జరిపిన పరిశీలనల్లో ఎన్నో అవకతవకలు బయటపడ్డాయి. 1863–1910 మధ్య తిరుమల వ్యవహారాలను అయిదుగురు మహంతులు నియంత్రించారు. వారు లక్షల్లో నిధులను దుర్వినియోగం చేశారు. రామనాథపురం జమిందారు రామేశ్వరం ఆలయానికి చెందిన ఆరు లక్షలను తన బ్యాంకు ఖాతాకు మళ్లించుకున్నారు. కావాల్సిన వారికి ఆలయ భూములను కట్టబెట్టటం విపరీతంగా నడిచేది. ఆధిపత్యం కోసం కొన్ని చోట్ల హత్యలూ జరిగాయి. 1905లో తిరుమల మహంతును అక్కడి పూజారే హత్యచేశాడు.


మున్సిపల్ కౌన్సిళ్లు, పట్టణపాలన బోర్డుల్లో పట్టుకోసం ఆలయాలపై అజమాయిషీకి ప్రయత్నించే వ్యక్తులు క్రమేపీ పెరిగిపోయారు. వైరివర్గాల మధ్య పోరు అధికమైంది. ఈ నేపథ్యంలో 1878–1915 మధ్య ఆలయాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసురావటానికి చట్టసభలో 12 బిల్లులను ప్రవేశపెట్టారు. వీటిని పెట్టిన వాళ్లందరూ స్వదేశీ ప్రతినిధులే. అందరూ హిందువులే! అవేమీ ఆమోదం పొందలేదు. 1920ల్లో అధికారంలోకి వచ్చిన జస్టిస్ పార్టీ ఆలయాల నియంత్రణకు చట్టం తీసుకువచ్చింది. అంతకుముందు 1908లో సివిల్ ప్రొసిజర్ కోడ్‌కు ఒక సవరణ తీసుకొచ్చి ఆలయాల పాలనలో కోర్టులు జోక్యం చేసుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో వందల ఆలయాల వ్యవహారాలు కోర్టులకు ఎక్కాయి. జస్టిస్ పార్టీ ప్రభుత్వం తమకు కావాల్సిన వాళ్లతో ఆలయాల కమిటీలను నింపివేసింది. కొత్త చట్టం కింద ఆస్తుల వివరాలను తెలపమని 13,669 దేవాలయాలను అడిగితే 229కి సంబంధించి మాత్రమే సమాచారం వచ్చింది. కాంగ్రెస్ పార్టీ కూడా 1924 తర్వాత ఆలయాలపై పట్టుసాధించే పనిలో పడింది.

చరిత్రను నిశితంగా చూస్తే తెలిసేది ఒకటే! ఆలయాలు రాజకీయాలకు ఎప్పుడూ దూరంగా లేవు. రాజులు తమ పాలనను సమర్థించుకోటానికి, పాలితులను విధేయులుగా మార్చుకోటానికి, తాము దైవాంశ సంభూతులం అన్న భావనను పెంచుకోటానికి ఆలయాలను ఉపయోగించుకున్నారు. వలసపాలన నాటి రాజకీయాలు ఆలయాలపై ఆధిపత్య పోరును పెంచాయే తప్ప తగ్గించలేదు. స్వతంత్ర పాలనలో బహిరంగ పోరుతగ్గినా ఆశ్రితులకు, అనర్హులకు ఆలయ పదవులను కట్టబెట్టటం అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంది.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

అంతా ఆన్‌లైన్‌లోనే..

ఎంపీ ల్యాడ్స్ నిధుల విడుదలకు అమల్లోకి కొత్త విధానం



- ఈ సాక్షి పోర్టల్ ద్వారానే వ్యయ ప్రక్రియ నిర్వహణ
- కాంట్రాక్టర్‌కు ఢిల్లీ నుంచి నేరుగా డబ్బులు జమ
- పనులు పూర్తయిన తర్వాత ఖాతాలకు నిధులు
- పథకంలో పారదర్శకతకు పెద్దపీట
- గతంలో వరంగల్, మానుకోటల్లో రూ.4కోట్లు వెనక్కి

హనుమకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీం (ఎంపీ ల్యాడ్స్) కింద ఏటా ఇచ్చే రూ.5కోట్ల నిధుల వినియోగమంతా ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారానే జరగనుంది. ప్రస్తుతం అమలులో ఉన్న మ్యాన్యువల్ విధానానికి స్వస్తి పలికిన కేంద్ర ప్రభుత్వం ఈ నిధుల వినియోగంలో పారదర్శకతకు పెద్దపీట వేసింది. ఈ నిధులు ఆయా ఎంపీల ఖాతాల్లోనే మగ్గిపోకుండా కేంద్రం తన వద్దనే పెట్టుకుని.. పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించే వీలుగా కొత్తవిధానాన్ని అమలులోకి తేబోతోంది. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు మంజూరైన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు, పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించడానికి ఈ కొత్త విధానం దోహదం చేస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు విడుదలవుతున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు ఎంత కాలమైనా వారి ఆధీనంలోనే ఉంటున్నాయి. పనులు పూర్తయిన తర్వాతే బిల్లుల చెల్లింపు జరుగుతోంది. అయితే ఎంపీలు, రాజ్యసభ సభ్యుల్లో చాలా మంది తమ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి ప నులకు వీటిని ఖర్చు చేయడానికి సకాలంలో ప్రతిపాదనలు పంపడం లేదు. పంపినా వివిధ కారణాల వల్ల కార్యరూపం దాల్చడం లేదు. ఎంపీలు, రాజ్యసభ సభ్యులు ఈ నిధులను తమ ఐదేళ్ల కాలపరిమితిలో ఎప్పుడైనా ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంది. అంతేకాకుండా వారి కాలపరిమితి ముగిసిన తర్వాత మరో 36 నెలల కాలంలో కూడా వినియోగించుకునే అవకాశం ఉంది. ఇందు వల్ల చాలా మంది ఎంపీలు, రాజ్యసభ సభ్యులు అభివృద్ధి పనులకు మంజూరులు ఇచ్చినా ఎంపీ ల్యాడ్స్ నిధులు వారి కాలపరిమితి ముగిసేలోపు ఖర్చు చేయకపోతుండటంతో అవి మురిగిపోతున్నాయి. ఇలా వీరికి విడుదల చేసిన నిధులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. దేశంలోని ఇతర లోకసభ నియోజకర్గాల్లో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడానికి నిధులను వాడుకోవడానికి కేంద్రానికి అవకాశం లేకుండా పోతోంది. దీనితో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి కేంద్రం ఎపీల్యాడ్స్ నిధుల వ్యయానికి కొత్త విధానాన్ని అమలులోకి తెస్తోంది.

ప్రస్తుతం ఇలా..

ప్రజావసరాల దృష్ట్యా గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతీ లోకసభ, రాజ్యసభ్యుడికి ఎంపీ ల్యాడ్స్ కింద ఏటా రూ.5 కోట్లు కేంద్రం కేటాయిస్తోంది. వీరి కాలపరిమితి ముగిసేలోగా అంటే ఐదేళ్లలో మొత్తంగా రూ.25కోట్ల వరకు అందుతాయి. గతంలో ఈ నిధులు ఏటా రూ.3కోట్ల వరకే ఉండగా.. తర్వాత కాలంలో ఈ మొత్తాన్ని రూ. 5కోట్లకు పెంచారు. కరోనా సమయంలో రెండు సంవత్సరాలకు సంబంధించిన నిధులు విడుదల కాలేదు. ఎక్కడ ఏ పని చేపట్టాలన్నా వివరాలను ఎంపీ సంబంధిత జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయానికి పంపుతారు. పని ఎవరు చేపట్టాలనే ఎగ్జిగ్యూటివ్ ఏజెన్సీ పేరును సైతం ఎంపీ సూచించే వీలుంటుంది. ఒక వేళ ఎంపీ సూచించకుంటే జిల్లా కలెక్టర్ ఎగ్జిగ్యూటివ్ ఏజెన్సీని ఎంపిక చేస్తారు. సీపీవో కార్యాలయం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో ఎంపీ ల్యాడ్స్ పేరు మీద తెరిచిన ఖాతాలో ఢిల్లీ నుంచి నిధులు జమవుతుంటాయి. ఎంపీ పంపిన జాబితా ఆధారంగా తొలుత పని చేపట్టేందుకు సీపీవో కార్యాలయం నుంచి సంబంధిత ఎగ్జిగ్యూటివ్ ఏజెన్సీకి పని మంజూరు లేఖ పంపిస్తారు. పని పూర్తయి ఎంబీ రికార్డు చేశాక బిల్లు బిల్లు మంజూరు కోసం ఆఎగ్జిగ్యూటివ్ ఏజెన్సీ తన బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఆ తర్వాత కాంట్రాక్టర్‌కు చెక్కు రూపంలో బిల్లు మంజూరు చేస్తుంది. కాంట్రాక్టర్ బ్యాంకుకు వెళ్లి చెక్కు జమ చేసుకోవలసి ఉంటుంది. ఇదంతా జరగడానికి ఎంతో సమయం పట్టేది. ఇక ఎంపీ తన నియోజకరవ్గంలో ఏవైనా పనులు అమలు చేయడానికి సంబంధిత పనుల వివరాల జాబితాతో ఏ లేఖను సంబంధిత

మిగతా 6వ పేజీలో..

పోర్టల్ ద్వారా చెల్లింపులు

పని చేసిన కాంట్రాక్టర్‌కు నేరుగా ఈ సాక్షి పోర్టల్‌తోనే ఢిల్లీ నుంచి చెల్లింపులు జరుగుతాయి. ఇది అమలులోకి వచ్చి ఏడాదవుతున్నా ఇప్పటి వరకు పాత, కొత్త పద్ధతిలో కొనసాగుతోంది. తాజాగా మొత్తం కొత్త పద్ధతిని అమలు చేసేందుకు పాత ఖాతాలన్నిటిని స్తంభింపచేసి అందులోని నిధులన్నిటిని వెనక్కి తీసుకున్నారు. మహబూబా బాద్, వరంగల్ లోకసభ నియోజకవర్గాల పరిధిలోనే 2014-19, 2019-2024 సంవత్సరాలకు సంబంధించి గత ఎంపీలు, రాజ్యసభ సభ్యులకు సంబంధించి సుమారు రూ. 4కోట్ల నిధులు ఇలాగే మురిగిపోయాయి. వీటిని ఇటీవల కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నది.

మధ్యవర్తుల ప్రమేయానికి చెక్..

ఆయా లోకసభ నియోజకవర్గాల పరిధిలో పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చేసేందుకు కేంద్రం ఈ-సాక్షి పోర్టల్‌ను ఏడాది కిందటే అమల్లోకి తెచ్చింది. దీని కోసం ఎంపీ, రాజ్యసభ సభ్యులు ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో లాగిన్ కావలసి ఉంటుంది. దీనికి ప్రత్యేక పాస్‌వర్డు ఇస్తారు. నిధులు ఎన్ని అందుబాటులో ఉన్నాయనే వివరాలు అందులోనే తెలుస్తాయి. ఆన్‌లైన్‌లోనే పనుల జాబితా వివరాలు ఎంపీ, క్రోడీకరించి సీపీవో కార్యాలయానికి పంపిస్తారు. సీపీవో నుంచి ఎగ్జిగ్యూటివ్ ఏజెన్సీకి పని మంజూరు చేస్తూ వివరాలు పంపిస్తారు. పని చేపట్టాక కాంట్రాక్టర్ వివరాలను ఎగ్జిగ్యూటివ్ ఏజెన్సీయే ఆన్‌లైన్‌లో పొందుపరుస్తుంది. అనంతరం ఎంపీ ల్యాడ్స్ వివరాలు పర్యవేక్షించే ఢిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ (ఎంవోఎస్‌పీఐ) కార్యాలయం నుంచే డబ్బులు నేరుగా జమవుతాయి. 2024 మార్చిలో ఎస్‌బీఐలో ఉన్న పాత ఖాతాలను ఢిల్లీ అధికారులు స్తంభింపజేశారు. ఇక ఈ-సాక్షి పోర్టల్‌తోనే చెల్లింపులన్నీ జరుగనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్, మహబూబాబాద్ లోకసభ పరిధిలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి ఎంపీల పనుల ప్రతిపాదలన లేఖలను ఇక సంబంధిత కలెక్టర్లకు లేదంటే సీపీవో కార్యాలయాలకు తీసుకువెళ్లే దూరాభారం తప్పనుంది. గతంలో ఓ రాజ్యసభ సభ్యుడు వరంగల్‌కు నిధులిస్తే హైదరాబాద్‌లో ఉన్న ఆయన లేఖను వరంగల్‌కు తీసుకువచ్చి ఇవ్వాల్సి ఉండేది. ఇక మీదట ఇలాంటి సమస్యలేమీ ఉండవు.

ఇకపై అంతా ఢిల్లీ నుంచే....

సత్యనారాయణ రెడ్డి, ముఖ్య ప్రణాళికాధికారి, హనుమకొండ

ఎపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలులోకి తెస్తోంది. దీని వల్ల నిధులు వినియోగం మరింత పారదర్శకంగా ఉంటుంది. నిధుల విడుదల, పనుల ప్రగతి పరిశీలన,అంతా ఆన్‌లైన్‌లోనే సాగుతుంది. కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు అంతా ఢిల్లీ నుంచే జరుగుతుంది. పనులు పూర్తయిన వెంటనే ఆ వివరాలను సమర్పించినవెంటనే ఢిల్లీలో ఎంపీ ల్యాడ్స్ నిధులు చూసే యంత్రాంగం బిల్లులను సంబంధిత కాంట్రాక్టర్లకు వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తుంది.

సీఎం పర్యటన రేపటికి వాయిదా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)



వరంగల్, హనుమకొండ జిల్లాల్లో శుక్రవారం జరగాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఒకరోజు వాయిదా పడింది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నానికి వరంగల్ చేరుకుంటారని, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని గురువారం అధికారిక షెడ్యూల్ విడుదలైంది. కానీ శుక్రవారం కూడా రేవంత్ ఢిల్లీలోనే ఉండాల్సి రావడంతో ఆయన తన వరంగల్ పర్యటనను శనివారానికి వాయిదా వేసుకున్నారు. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి బయలుదేరనున్న సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా సంగెం మండలంలో ఉన్న టెక్స్‌టైల్ పార్కుకు చేరుకుంటారని, అక్కడ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. అనంతరం వరంగల్ భద్రకాళి దేవాలయం సమీపంలోని పూర్వ సెంట్రల్ జైలు ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పరిశీలించి నిర్మాణ పనుల గురించి తెలుసుకోనున్నారు. అక్కడి నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తి తదితర అంశాలపై మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. కలెక్టరేట్‌లో మొక్కలు నాటి వనమహోత్సవానికి వరంగల్ నుంచే శ్రీకారం చుట్టనున్నారు.

ముఖ్యమంత్రి రాక కోసం పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

సన్నాహక సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క



సన్నాహక సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క తదితరులు

హనుమకొండ కలెక్టరేట్, జూన్27: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జిల్లా అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో వారు.. ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు, భూగర్భ డ్రెయినేజీ, రింగ్ రోడ్డు, కాళోజీ కళాక్షేత్రం, మామునూరు ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తదితర అభివృద్ధి పనులపై చర్చించారు. సీఎం పర్యటన నేపథ్యంలో ప్రోటోకాల్ నిర్వహణతో పాటు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని వారు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదా దేవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ సమగ్రాభివృద్ధికి చర్యలు

- సీఎం నేతృత్వంలో ట్రైసిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- సవరణలతో మాస్టర్ ప్లాన్ అమలుకు కృషి
- వచ్చే కాళోజీ జయంతి నాటికి కళాక్షేత్రాన్ని పూర్తి చేస్తాం
- విలేకరుల సమావేశంలో మంత్రి కొండా సురేఖ

వివరాలు 6లో..

రూ.125కోట్లతో కాజీపేట బైపాస్ లైన్ పనులు

దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



బైపాస్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రైల్వే జీఎం, బై పాస్ మ్యాప్ పరిశీలిస్తున్న జీఎం

కాజీపేట, జూన్ 27: కాజీపేట బైపాస్ లైన్ పనులు రూ.125కోట్లతో 21.4 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులకు చేపడుతున్నామని, ఈ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో 3 ప్రధాన బ్రిడ్జిలు, 31 చిన్న బ్రిడ్జిల నిర్మాణం చేస్తున్నామన్నారు. గురువారం కాజీపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను జీఎం అరుణ్‌కుమార్ డీఆర్ఎం భరతేష్‌కుమార్‌తో పాటు ఇతర రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. దక్షిణమధ్య రైల్వేలో కాజీపేట రైల్వే స్టేషన్ ప్రధానమైందన్నారు. ఈ బైపాస్ నిర్మాణంతో సికింద్రాబాద్ - న్యూఢిల్లీ- చెన్నై - హౌరా మధ్య రైళ్ల మార్గాన్ని కలుపుతుందన్నారు. రైళ్ల రాకపోకల ట్రాఫిక్‌ను నివా రించేందుకు ఈ నిర్మాణ పనులు తోడ్పడుతాయన్నారు.

ఈ బైప్ లైన్ నిర్మాణం పూర్తయితే హసన్‌పర్తి- వరంగల్- కాజీపేట రైల్వే స్టేషన్‌ల రాకపోకలు సులభం అవుతాయన్నారు. అనంతరం ఇదే పనుల విషయమై ఓవర్‌లోడ్ పరికరాల సిబ్బంది, సిగ్నల్, టెలీ కమ్యూనికేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షించారు.అంతకుముందు కాజీపేట రైల్వే స్టేషన్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులను తనిఖీ చేశారు. లోకోపైలెట్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. లోకోపైలెట్ సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. లోకోపైలెట్‌లు అప్రమత్తంగా విధులు నిర్వహించి రైల్వే అభివృద్ధితో పాటు ప్రయాణికులకు మేలు జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైల్వే జీఎం వెంట స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ రెడ్డి, సీసీఐ సజన్‌లాల్, సీటీఐ విజయ్‌కుమార్ తోపాటు అన్ని డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీలు ఉన్నారు.

జోరుగా వానలు

- చల్లబడిన వాతావరణం
- అన్నదాతల్లో ఆనందం
- హనుమకొండలో 16.4 మి.మీ., వరంగల్ జిల్లాలో 20.7 మి.మీ. వర్షపాతం

హనుమకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల్లో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. హనుమకొండ జిల్లా పరిధిలో పరకాల, శాయంపేట, ఆత్మకూరు, దామెర, హసన్‌పర్తి, హనుమకొండ, కాజీపేట, ధర్మసాగర్, వేలేరు మండలాల్లో ఒక మోస్తరు భారీ వర్షం కురిసింది. వరంగల్ జిల్లాలో వరంగల్, ఖిలా వరంగల్, సంగెం, గీసుకొండ తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. గత 24 గంటల్లో హనుమకొండ జిల్లాలో సరాసరి 16.4 మిమీ వర్షం కురిసింది. హనుమకొండ మండలంలో అత్యధికంగా 39.3 మిమీ వర్షం పడింది. కాజీపేటలో 34.6 మి.మీ., హసన్‌పర్తిలో 21,8 మి.మీ., వేలేరులో 29.8 మి.మీ., భీమదేవరపల్లిలో 25.2 మి.మీ., ఎల్కతుర్తిలో 26.5 మి.మీ., ధర్మసాగర్‌లో 15.2 మి.మీ., ఐనవోలులో 13.3 మి.మీ., పరకాలలో 1.1 మి.మీ., దామెరలో 6 మి.మీ., ఆత్మకూరులో 4.6 మి.మీ., శాయంపేటలో 11.8 మి.మీ. వర్షపాతం



నమోదైంది. నడికూడలో అతి తక్కువంగా 0.4 మి.మీ. పడింది. కమలాపూర్ వర్షం జాడలేదు.

వరంగల్ జిల్లాలో సరాసరి 20.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. గీసుకొండ మండలంలో అత్యధికంగా 49.8 మి.మీ. వర్షం కురిసింది. వరంగల్ మండలంలో 40 మి.మీ., ఖిలా వరంగల్‌లో 30.4 మి.మీ., దుగ్గొండిలో 15.2 మి.మీ., నర్సంపేటలో 22.8 మి.మీ., ఖానాపురంలో 21.8 మి.మీ., చెన్నారావుపేటలో 16.4 మి.మీ., సంగెంలో 22.4 మి.మీ., వర్ధన్నపేటలో 13.4 మి.మీ., రాయపర్తిలో 8.8 మి.మీ., పర్వతగిరిలో 12.4 మి.మీ., నెక్కొండలో 12.2 మి.మీ., వర్షపాతం రికార్డయింది. నల్లబెల్లిలో అతితక్కువగా 3.6 మి.మీ. వర్షం కురిసింది. వరంగల్ జిల్లాలో ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మరో ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. వర్షాల వల్ల రెండు జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో పలుచోట్ల వర్షపు నీరు నిలిచింది. సాయంత్రం సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి ప్రధాన రోడ్లపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

మునిసిపల్ కార్మికులకు కనీస వేతనాలను ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్

సుబేదారి, జూన్ 27: మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ.. పదేళ్ల నుంచి కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి పాలక ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పి ఐదేళ్ల గడుస్తున్నా ఇప్పటి వరకు దాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో మునిసిపల్ కార్మికులకు నెలకు రూ. 21 వేలు ఇస్తున్నారని, తెలంగాణలో మాత్రం రూ.16వేలు ఇచ్చి అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, మునిసిపల్ యూనియన్ నాయకులు వేల్పుల ధర్మరాజు, రజిత, బరుపట్ల మహేష్, రఘు, ఎల్లస్వామి, నవనీత, వ్యాస బాబు, రాజేంద్రప్రసాద్, సుధాకర్‌రెడ్డిలతో పాటు మునిసిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

దళితబంధు ఇప్పిస్తానని డబ్బుల వసూలు

శాయంపేట ఎంపీపీ తిరుపతి రెడ్డి అరెస్టు



శాయంపేట, జూన్ 27: దళిత బంధు ఇప్పిస్తానని, అలాగే గురుకులాల్లో సీట్లు ఇప్పిస్తానని మోసం చేసినందుకు శాయంపేట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ఆయన అనుచరుడిని పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు శాయంపేట ఎస్ఐ ప్రమోద్‌కుమార్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన ముక్కెర రమేష్. 2022 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళితబంధు పథకం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఇది తెలుసుకున్న ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, ఆయన అనుచరుడు పంగ ఇంద్రయ్య.. ప్రభుత్వం నుంచి దళిత బంధు పథకం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఇందుకు రూ.2 లక్షలు ఇవ్వాలని రమేష్‌ను కోరారు. దీంతో రమేష్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఇంద్రయ్యకు నగదు, ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష ఇచ్చాడు. అలాగే గురుకులంలో సీట్లు ఇప్పిస్తామని రమేష్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తుల వద్ద ఎంపీపీ తిరుపతి రెడ్డి, ఇంద్రయ్య రూ.50వేలు వసూలు చేశారు. అయితే దళిత బంధు పథకం రాకపోవడమే కాకుండా గురుకులం సీట్లు కూడా ఇప్పించలేదు. దీంతో తమ డబ్బులు తమకు ఇవ్వాలని బాధితులు ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఇంద్రయ్యలను ప్రాధేయపడ్డారు. వారు ఇవ్వకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. గురువారం ఎంపీపీ తిరుపతి రెడ్డి, ఇంద్రయ్యలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదలకు అందుబాటులో దహన సంస్కార చార్జీలు

ఇన్‌చార్జ్ సీడీఎంఏ వీపీ గౌతమ్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 27: పేద ప్రజలకు అందుబాటులో దహన సంస్కార ప్రక్రియ చార్జీలు ఉండాలని ఇన్‌చార్జి సీడీఎంఏ వీపీ గౌతమ్ అధికారులకు సూచించారు. గురువారం బల్దియా పరిధిలోని పలు ప్రాంతాలలో ఆయన పర్యటించారు. రాంపూర్ డంప్‌యార్డ్‌లో జరుగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బయోమైనింగ్ పూర్తి చేసిన ప్రాంతాన్ని రెమిడేషన్ చేయాలన్నాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా చేస్తున్నారా? లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. 57వ డివిజన్‌లోని మోడల్ వైకుంఠ ధామాన్ని ఎస్‌హెచ్‌జీలకు కేటాయించిన తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. దహన సంస్కారాలకు ఎంత చార్జీలు వసూలు చేస్తున్నారు? ఫోన్ పే, గూగుల్ పే వాడుతున్నారా? అని అడిగారు. ఇంటి వద్ద నుంచే జీడబ్ల్యూఎంసీ యాప్ ద్వారా దహన సంస్కార కార్యక్రమాలకు బుక్ చేసుకునే వీలు ప్రజలకు కల్పించాలని సూచించారు. అనంతరం హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలో బల్దియా నిర్వహిస్తున్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, హెచ్‌వో రమేష్, టీపీఆర్‌వో కోల రాజేశ్, ఈఈలు సంజయ్‌కుమార్, శ్రీనివాస్, డీఈ రవికుమార్ పాల్గొన్నారు.



రాంపూర్‌లోని బయోమైనింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాంగ్రెస్ అధికార దాహానికి నిదర్శనం ఎమర్జెన్సీ

- రాజ్యాంగానికి తూట్లు పొడిచిన ఘనత కాంగ్రెస్ పార్టీది..
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి

హనుమకొండ టౌన్, జూన్ 27: కాంగ్రెస్ అధికార దాహానికి నిదర్శనం దేశంలో విధించిన ఎమర్జెన్సీ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి అన్నారు. దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి 50యేళ్లు అవుతున్న సందర్భంగా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో హంటర్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాణి రుద్రమదేవి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీని విధించి కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. ప్రజల హక్కులను కాలరాస్తూ భారత రాజ్యాంగాన్ని 90సార్లు సవరణ చేసిందన్నారు. ప్రభుత్వాలను కూల్చడానికి 67 సార్లు రాజ్యాంగ సవరణకు పాల్పడిందన్నారు. కొందరి మెప్పు కోసం మతాల ఆధారంగా రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని చూస్తున్నదన్నారు. ఎన్నికల యంత్రాంగంపై నిరాధారమైన ఆరోపణలు చేయడం, ఎన్నికల్లో హింసను ప్రేరేపించడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, రాజ్యాంగ సూత్రాలపై గౌరవం లేకపోవడం, మైనారిటీలను బుజ్జగించడంలాంటిని కాంగ్రెస్ పార్టీకి వెన్నతోపెట్టిన విద్య అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో మీడియాను వేధింపులకు గురిచేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాయకుండా చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. దేశంలో చీకటి రోజులు తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రాజ్యాంగం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎమర్జెన్సీపై పోరాటం చేసినందుకు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, మొరార్జీ దేశాయ్, అరుణ్‌జైట్లీ, ఎల్.కె.అద్వానీ లాంటి నాయకులను జైలుకు పంపించారని గుర్తు చేశారు.

అనంతరం ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి జైలు శిక్ష అనుభవించిన డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, నాగపూరి రాజమౌళి గౌడ్, కన్నబోయిన రాజయ్య యాదవ్, భారత సురక్ష సమితి నాయకులు శ్యామ్‌జీ, డాక్టర్ సమ్మిరెడ్డిలతో పాటు మరి కొంతమందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.విజయ్‌చందర్‌రెడ్డి, గురుమూర్తి శివకుమార్, గుజ్జ సత్యనారాయణ, రావుల కిషన్, సిరంగి సంతోష్, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, ఆర్.పి. జయంత్‌లాల్, కొండి జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు రావుల కోమల, భైరి లక్ష్మీ, గుజ్జుల వసంత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి





వరంగల్ సమగ్రాభివృద్ధికి చర్యలు

సీఎం నేతృత్వంలో ట్రైసిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక : రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

హనుమకొండ కలెక్టరేట్, జూన్27: వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆమె మేయర్, ఎమ్మెల్యేలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఎంపీ ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడిందని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ప్రజాప్రతినిధులందరం కలిసికట్టుగా ఉండి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం సంవత్సరాలుగా నిర్మాణ దశలోనే ఉందని, గత ప్రభుత్వ తప్పిదం వల్ల ఈ సమస్య వచ్చిందని, వచ్చే కాళోజీ జయంతి నాటికి కళాక్షేత్ర నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని రెండో రాజధానిగా చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని.. దీనికి ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసి స్మార్ట్‌సిటీగా, అదేవిధంగా ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. మహిళలకు ఉపాధి కల్పించేలా సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, మహిళా శక్తి పథకానికి రూ.20కోట్లు కేటాయించి మహిళలు స్వయం కృషితో ఎదిగేందుకు కృషి చేస్తామని, వారికి మహిళా రుణాలు ఇస్తామన్నారు. వరంగల్ తుది మాస్టర్ ప్లాన్‌పై సీఎంతో చర్చిస్తామని, స్మార్ట్‌సిటీ పథకం నిధులతో నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గతంలో స్మార్ట్‌సిటీ కింద కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం వల్ల నిధుల లేమి ఏర్పడిందన్నారు. మామునూరులో త్వరలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

● అయితే తొలుత శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఖరారవగా ఆయన ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్న నేపథ్యంలో శనివారానికి వాయిదా పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటి షెడ్యూల్ ప్రకారమే శనివారం సీఎం పర్యటన ఉంటుందని, అంటే శనివారాం మధ్యాహ్నం 12గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరనున్న సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా సంగెం మండలంలో ఉన్న టెక్స్‌టై ల్ పార్కుకు చేరుకుంటారని, అక్కడ ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారని సీఎం కార్యాలయ వర్గాలు గురువారం రాత్రి వెల్లడించాయి. టెక్స్‌టైల్ పార్కు సందర్శన అనంతరం వరంగల్ భద్రకాళి దేవాలయం సమీపంలోని పూర్వ సెంట్రల్ జైలు ప్రాంతంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పరిశీలిస్తారని, అక్కడి నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా అభివృద్ధిపై మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్షిస్తారన్నారు.

కామర్స్‌లో ఝాన్సీరాణికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, జూన్ 27: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు జానపాటి ఎస్.ఝాన్సీ రాణికి డాక్టరేట్ లభించింది. ఈ మేరకు గురువారం ఎఎన్‌యూ పరీక్షల నియంత్రణాధికారి జానపాటి ఎస్. ఝాన్సీరాణికి డాక్టరేట్ ప్రకటించినట్లు వెల్లడించారు. 'ఏ స్టడీ ఆన్ ప్రాబ్లమ్స్ ఇన్ మార్కెటింగ్ ఆఫ్ కాటన్ అండ్ ది రోల్ ఆఫ్ డిఫరెంట్ మార్కెటింగ్ ఏజెన్సీస్- ఏ స్పెషల్ రిఫరెన్స్ టూ వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ డిస్ట్రిక్టు ఇన్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధనకు గ్రంథాన్ని రూపొందించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి. రమాదేవి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఖమ్మం జిల్లా పేరువంచకు చెందిన జానపాటి ఎస్.ఝాన్సీరాణి హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ సాధించినందుకుగాను జానపాటి ఎస్. ఝాన్సీరాణిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వినోద్‌రావు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు బల్దియా ఇండోర్ క్రీడాకారులు


ఎంపికైన క్రీడాకారులతో కోచ్ శ్రీధర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 27: ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో ఈనెల 27 నుంచి 30 వరకు జరిగే యోనెక్స్ పదో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వరంగల్ బల్దియా ఇండోర్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంపికయ్యారు. మహిళలు, పరుషుల విభాగంలో సింగిల్స్, డబుల్స్ విభాగంలో వేరువేరుగా ఈ పోటీలు జరుగుతాయని బ్యాడ్మింటన్ కోచ్ శ్రీధర్‌రావు గురువారం వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో సాయిఅరవింద్, అబూబకర్, మోహన్‌దాస్, రూపక్ రామన్, పూజ, సుకృతి ఉన్నారు. వీరిని బల్దియా స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్‌లింగం, కోచ్ శ్రీధర్‌రావు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం


ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డు అందిస్తున్న ఆర్ఎం విజయ్‌భాను

బాలసముద్రం, జూన్ 27: విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు గురువారం ప్రగతి చక్రం అవార్డులను వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ్‌భాను చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరంసింగ్ , డిప్యూటీ ఆర్ఎం కె.భానుకిరణ్, హనుమకొండ ట్రాఫిక్ డిపో సూపర్‌వైజర్ నజియా సుల్తానా, మెకానికల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..

(5వ పేజీ తరువాయి)

జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీవో) కార్యాలయానికి పంపేవారు. అక్కడ అప్పటి వరకు ఖర్చు కాగా మిగిలిన నిధులను వివరాలను సరిచూసుకొని ఆమోదం తెలిపా రు. అట్లా ఎంపీలు ప్రతిపాదించిన పనులు మొదల య్యేవి. బిల్లుల చెల్లింపులు సీపీవో, సంబంధిత శాఖలకు... అక్కడి నుంచి సంబంధిత జిల్లా కలెక్టర్ల ఆమోదంతో కాంట్రాక్టర్లకు చెల్లించేవారు. ఈ ప్రక్రియ అంతా మ్యాన్యువల్‌గా జరిగేది.

సీపీవో, ఎస్‌వోలకు శిక్షణ

ఎంపీల్యాడ్స్ నిధుల వినియోగంలో త్వరలో అమలు చేయబోతున్న కొత్త విధానంపై ఎంపిక చేసిన రాష్ట్రాల నుంచి కొందరు సీపీవోలు, స్టాటిస్టికల్ అధికారులకు ఢిల్లీలో ఈనెల 20, 21 తేదీల్లో శిక్షణనిచ్చారు. తెలంగాణ నుంచి ముగ్గురు సీపీవోలు, మరో ముగ్గురు డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారులు శిక్షణ పూర్తి చేసుకొని వచ్చారు. వారు రాష్ట్రంలోని మిగతా జిల్లాల సీపీవోలు, ఎస్‌వోలు, డీఎస్‌వోలకు శిక్షణ ఇస్తారు. కొత్త పద్ధతిని పూర్తి స్థాయిలో అమలులోకి తీసుకురావడానికి మరో నెల రోజుల సమయం పట్టవచ్చునని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 27: ములుగురోడ్‌లోని వరంగల్ జిల్లా ఉపాధి కార్యాల యంలో శనివారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎన్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ వరంగల్, హనుమకొండలో పనిచేయుటకు 50 మంది డెలివరీ బాయ్స్ ఎంపిక కోసం జాబ్ మేళాను నిర్వహిస్తు న్నట్లు ఆమె పేర్కొన్నారు. 18, నుంచి 40 సంవత్సరాల లోపు 10వ తరగతి పాసై డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు శనివారం ఉదయం 11 గంటల వరకు ములుగురోడ్‌లోని ఉపాధి కార్యాల యంలో హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9177097456 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఎన్‌జీసీ ఎకో క్లబ్ పోటీలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 27: ఎన్‌జీసీ ఎకో క్లబ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అన్ని యాజమాన్య పాఠశాలల్లో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీలకు గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఈవో ఎం.డి. అబ్దుల్ హై ఒక ప్రకటనలో కోరారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొం డలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో ఈ నెల 29న కవిత్వం, పోస్టర్ మేకింగ్ అంశా ల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితిస్థాపకత అనే అంశంపై పోటీలు ఉంటాయని శుక్రవారం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస స్వామిని సంప్ర దించాలని ఆయన సూచించారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 27: పత్తి పంటతో పాటు గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిపై నేరం రుజువైనందున 10 యేళ్ల కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2017 డిసెంబరు 14న అప్పటి పోలీసుస్టేషన్ ఎస్సై ఎన్.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పరకాల పోలీసులు పోచారం గ్రామ శివారులో కామారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొట్టి కుమారస్వామి వ్యవసాయ భూమిలో గంజా యి సాగుచేస్తున్నారని తెలియడంతో అక్కడికి వెళ్లారు. ఆ భూమిలో పత్తి పంటతో పా టు గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు గుర్తించి నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువైనం దున పదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరిం చారు. కోర్టు పీసీ ఎం.సుధాకర్ సాక్షులను ప్రవేశపెట్టగా సీఐ జె.నర్సింహులు కేసు దర్యాప్తు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

ప్రభుత్వ ఐటీఐలో రేపు అప్రెంటీస్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 27: ములుగు రోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం అప్రెంటిస్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్. జుమ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు మేళాలో పాల్గొనాలని ఆయన కోరారు. అప్రెంటీస్ కాలంలో అభ్యర్థులకు స్టయిఫండ్ ఇస్తారని తెలిపారు. ఈ మేళాలో హైదరాబాద్‌కు చెందిన రేన్ బ్రేక్ లైనింగ్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్ కంపె నీలు పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనలో ఒకరిపై కేసు

కాజీపేట, జూన్ 27: ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జన గామ జిల్లా రాజవరం గ్రామానికి చెందిన కొలిపాక రవి అనే ఆర్టీసీ డ్రైవర్ వరంగల్- 1 డిపోలో పనిచేస్తున్నాడు. ఈనెల 25న విధుల్లో భాగంగా ఉప్పల్ నుంచి హనుమకొం డకు బస్సులో ప్రయాణికులను తీసుకుని వస్తుండగా కాజీపేట డీజిల్‌కాలనీ వద్దకు రాగానే మడికొండకు చెందిన ఎన్.రాకేశ్ తన కారుతో బస్సు వెనకాల ఢీకొట్టాడు. వెం టనే బస్సు ముందుకు కారు పెట్టి బస్సు ఆపి డ్రైవర్‌పై దాడిచేసి గాయపరిచినట్లు ఆర్టీసీ డ్రైవర్ కొలిపాక రవి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు గురువారం దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బాలికలను వేధించిన కేసులో ఇద్దరికి జైలు

వరంగల్ లీగల్, జూన్ 27: ఇద్దరు బాలికలను ప్రేమించమని బెదిరించి దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ హనుమ కొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి. అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ బొక్కలగడ్డ ప్రాంతానికి చెందిన సోను సింగ్ బాటియా, ఎం.డి. సమీర్‌లు ఇద్దరు అక్కా చెల్లెలను తమను ప్రేమించాలని వేధిస్తుండేవారు. 2019 జనవరి 1 సాయంత్రం 6గంటలకు ఇద్దరు బాలికలు ఫొటో దిగడానికి ఫొటో స్టూడియోకు వెళ్లారు. ఇది గమనించిన ఇద్దరు నిందితులు అక్కడి నుంచి వారిని బలవంతంగా ఆటోలో ఎక్కించుకొని ప్రేమిస్తారా లేదా అంటూ బెదిరించి చేతు లతో కొడుతూ పిడిగుద్దులు గుద్దారు. దీంతో వారిలో ఒక బాలిక స్పృహతప్పి పడిపోవ డంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. జరిగిన విషయం వారి తల్లిదండ్రులకు తెలుపగా నిందితులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరి నిందితులపై ఫోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితు లు సోనుసింగ్ బాటియా, ఎం.డి. సమీర్‌లకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు సీడీవో కె.రాజేందర్ సాక్షులను ప్రవేశపెట్టగా ఏసీపీ డి.చంద్రయ్య, బి.సంజీవ దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసి క్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

ఎస్సీ గురుకులాల్లో కాంట్రాక్టు లెక్చరర్లు, టీచర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 27: హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల, కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో టీచర్లు, లెక్చరర్లుగా పనిచేయుటకు దరఖాస్తు లు చేసుకోవాల్సిందిగా ఆర్‌సీవో ఎస్.విద్యారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, ఎకనామిక్స్, సోషల్, బయోసైన్స్, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూలై 3వ తేదీ లోపు హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ ఎదురుగా ఉన్న ఆర్‌సీవో కార్యాలయంలో అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 4వ తేదీన ఇంటర్వ్యూతో పాటు డెమో ఉంటుందని తెలిపారు.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!



న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొంది 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్‌యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్ట్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటినేమ్ ప్లేట్‌పై సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు.. మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోద ముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ ధైర్ఘ్యం (హై రెజుల్యూషన్) కలిగిన 23 మెగా పిక్సల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్లు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం భరన్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ.. ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్‌ఎంపీ సహాయంతో భార్యకు మామిడితోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం

» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన



సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు



సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్‌ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలుపడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్‌ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్ట విరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్‌ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య

» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల

» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు

» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యునివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నాళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో క్యాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృ భాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

కేయూ క్యాంపస్, జూన్ 27: వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజులను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘంనేతలు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, ఆర్డీ ప్రసాద్, మధుకర్‌రావు, శ్రీధర్ రావు, సాయి చరణ్, వెంకటేశ్వర్లు, చీకటి శ్రీనివాస్, కరుణాకర్‌రావు, ప్రవీణ్, చిర్ర రాజు, రవీందర్, ఫిరోజ్ పాషా, గజ్జల మల్లేశ్, జితేందర్, సాధు రాజేశ్, కనుకయ్య, అరూరి సూర్యం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగరాజుకు శాలువా కప్పుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కనకదుర్గా కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న కాలనీ అభివృద్ధి కమిటీ

జూలైవాడ, జూన్ 27 : గ్రేటర్ వరంగల్ 59వ డివిజన్ కనకదుర్గా కాలనీ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కనకదుర్గ కాలనీలోని కమ్యూనిటీ హాలులో ఎన్నికల అధి కారి కె.సోమిరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్.సుధాకర్‌రావు, ఉపాధ్యక్షుడిగా బి.మల్లారెడ్డి, కార్యదర్శిగా ఆర్.నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా టి.సుధాకర్, కోశాధికారిగా వి.వెంకటేశ్వర్‌రావు, కోఆప్షన్ సభ్యులుగా రామనాథం, సాంబశివరావు, మురళీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రాజ్‌కుమార్, తిరుపతి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీచే ఎన్నికల అధికారి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్.శ్రీనివాస రావు, డి.నారాయణరావు, గోపాలకిషన్‌రావు, సత్యనారాయణరెడ్డి, దామోదర్, మహేందర్‌రెడ్డి, సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల రుణమాఫీ సాహసోపేత నిర్ణయం

▸▸ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గోపు జైపాల్‌రెడ్డి

జూలైవాడ, జూన్ 27: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని రైతాంగానికి రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం సాహసోపేత, చారిత్రాత్మక నిర్ణయమని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ పోస్టల్ కాలనీలోని సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మేరకు రైతాంగానికి సీఎం వెన్నుదన్నుగా నిలుస్తున్నారని అన్నారు. రుణమాఫీ ప్రకటించడంపై రెడ్డి సంఘం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు అర్శుల కిషన్‌రెడ్డి, నల్ల రాజిరెడ్డి, రావుల నరసింహారెడ్డి, గంకిడి ప్రభాకర్‌రెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, కోరల్ల విద్యాసాగర్‌రెడ్డి, సంకు యాకూబ్‌రెడ్డి, ముదిగంటి వెంకటరెడ్డి, హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రాకకు కలెక్టరేట్ ముస్తాబు



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ, కలెక్టర్



కలెక్టరేట్ ఆవరణలో వనమహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

▸▸ వనమహోత్సవానికి శ్రీకారం చుట్టనున్న రేవంత్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, జూన్27: హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటనున్నారు. అలాగే మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను కూడా ప్రారంభించనున్నారు. అనంతరం కుడా పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కలెక్టరేట్ గోడలకు రంగులు వేయించారు. కలెక్టరేట్ ఆవరణలో సీఎం మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

వరంగల్ క్రైం: పదిరోజుల పాటు సెలవుపై వెళ్లిన వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం విధుల్లో చేరారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగరానికి రానున్న నేపథ్యంలో సీపీ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పర్యటనలో భాగంగా సీఎం హైదరాబా ద్ నుంచి టెక్స్‌టైల్స్ పార్క్‌కు చేరుకోనున్న క్రమంలో గురువారం సీపీ అంబర్ కిషోర్ ఝా, వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవితో కలిసి టెక్స్‌టైల్స్‌ను సందర్శించారు. ముఖ్యమంత్రి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఇదిలా వుండగా, ఇటీవల సెంట్రల్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన షేక్ సలీమా సీపీ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం

▸▸ కేయూ బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

రాంనగర్, జూన్ 27: రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశాడని, జిల్లాకు వస్తున్న ఆయనను అడ్డుకుంటామని కేయూ బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ తెలిపారు. గురువారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలు గడుస్తున్నా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలన్నారు. యూనివర్సిటీ పరిశోధన విద్యార్థులకు ప్రతీ నెల రూ.15 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని ఆయన ఆరోపించారు. యూనివర్సిటీల్లో వీసీల నియామకం లేక పరిపాలన భ్రష్టు పట్టిందన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, రూ.10లక్షల హామీ ఏమైందన్నారు. ముఖ్యమంత్రికి విద్యార్థుల సమస్యలపై చిత్తశుద్ధి లేదని ప్రశాంత్ ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో బీఆర్ ఎస్వీ నేతలు మాచర్ల శరత్ చంద్ర, కంజర్ల మనోజ్‌కుమార్, లంక రాజుగోపాల్, సుమ న్, వీరస్వామి, టోనీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

మందకృష్ణ మాదిగను కలిసిన నాయకులు

హనుమకొండ టౌన్, జూన్ 27 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను 53వ డివిజన్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జిల్లాలోని ఎమ్మార్పీఎస్ దిమ్మెగద్దెలు, జెండావిష్కరణ, నూతన కమిటీలు, దేశవ్యాప్తంగా మాదిగల ఆత్మగౌరవ కవాతు, ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్, జూలై 7న జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేసే తదితర అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. మందకృష్ణను కలిసిన వారిలో కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎర్ర వరదరాజు, జిల్లా కమిటీ సభ్యులు అల్వాల ఎల్లేశ్, డివిజన్ అధ్యక్షుడు ఎర్ర రాము, ఉపాధ్యక్షుడు బొక్క రాజేశ్, ప్రధాన కార్యదర్శి సిల్వర్ బిక్షపతి, వర లక్ష్మణ్, ఎర్ర వినయ్, మునిగాల గోపాల్, ఎనగల నితిన్‌లు ఉన్నారు.

జూపార్కుకు కొండచిలువ తరలింపు



కొండచిలువతో ఫారెస్టు అధికారులు

న్యూశాయంపేట, జూన్ 27: కాజీపేటలోని అంబేద్కర్ నగర్‌లో స్థానిక ప్రజలకు గురువారం కొండ చిలువ కనిపించింది. వెంటనే స్థానిక కార్పొరేటర్ రజాలీ, స్థానిక నాయకులు హంటర్‌రోడ్‌లోని జూపార్కు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మయూరి, సెక్షన్ ఆఫీసర్ రాందాస్, బీట్ ఆఫీసర్ సురేష్‌లు కొండ చిలువను జూపార్కుకు తర లించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మయూరి మాట్లాడుతూ.. డాక్టర్ల పర్యవేక్షణలో కొండ చిలువను పరిశీలించిన అనంతరం ఆరోగ్యంగా ఉందా, లేదా అని తెలుసుకుని అడవిలో వదిలిపెడతామన్నారు.

ఎంపీ కడియం కావ్యకు సన్మానం

హనుమకొండ సిటీ, జూన్ 27: వరంగల్ ఎంపీ కడియం కావ్యను గురువారం ఢిల్లీలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో పాటు జాతీయ సఫాయి కర్మ చారీ సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని కావ్యకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ కాంగ్రెస్ నాయకులు సంజీత్‌శర్మ, జోగిందర్‌సింగ్ జోగీ, ఆకాశ్, అనిల్‌కుమార్‌తోపాటు సఫాయి కర్మ చారీ సంఘం జాతీయ అధ్యక్షుడు అమిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కబ్జాపై పట్టింపులేదు

▸▸ దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినియోగదారుల మండలి ఫిర్యాదు

హనుమకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ భూముల పరిరక్షణలో దేవాదాయ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, ఆలయ భూములు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వరంగల్ నగరంలోని పద్మాక్షి, సిద్ధేశ్వర, వీరపిచ్చమాంబ, రంగనాయక, వేణుగోపాలస్వామి ఆలయాలకు సంబంధించి 20.39 ఎకరాల భూమి కబ్జా అయిందని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంత్‌రావు 2022 జనవరి 5న లోకాయుక్తకు స్వయంగా తెలిపినప్పటికీ ఇప్పటి వరకు ఆ భూములను కబ్జాచెర నుంచి విముక్తి చేయలేదన్నారు. అందులో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగింపు చేయలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమకబ్జాదారులను గుర్తించి కూడా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా నగరంలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన పలు దేవాలయాల కింది కోట్లాది రూపాయాల భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని, ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను చక్రపాణి, రాజు అభ్యర్థించారు.

నేడు డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, జూన్ 27 : హనుమకొండ ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ భూక్య ధరంసింగ్ గురువారం తెలిపారు.హనుమకొండ, వరంగల్, కాజీపేట, ఖిలా వరంగల్, ధర్మసాగర్, వేలేరు, జమ్మికుంట, కమలాపూర్, సంగెం, ఐనవోలు, జఫర్‌గఢ్, వర్ధన్నపేట మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు సూచన లను ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సెల్ నంబర్ 9959226049లో సంప్రదించాలని అన్నారు.

హంటర్‌రోడ్‌లో పగిలిన వాటర్ పైపులైన్



పైపులైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

న్యూశాయంపేట, జూన్ 27: హంటర్ రోడ్‌లో సీఎం పర్యటనను పురస్కరించుకుని కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణలో రోడ్డుకు ఇరువైపులా గురువారం మొక్కలు పెడుతున్నారు. ఈ క్రమంలో హంటర్‌రోడ్‌లోని అల్లూరి కళాశాల ఆర్చి పక్కన ఉన్న పెట్రోల్ బంక్ ఎదుట ఎక్స్‌కవేటర్‌తో గుంత తీస్తున్న క్రమంలో తాగునీటి పైపులైన్ పగిలింది. దీంతో సుమారు గంటపాటు తాగునీరు వృథాగా పోయింది. కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే పైపులైన్ పగిలి నీరు వృథాగా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

బొజ్జతారకం ఆశయాలను కొనసాగించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న జన్ను సాంబయ్య

వడ్డెపల్లి, జూన్ 27 : ప్రజా హక్కుల నేత సీనియర్ న్యాయవాది బొజ్జ తారకం ఆశయాలను సమాజంలోని ప్రతీ ఒక్కరు కొనసాగించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జతారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య పిలుపు నిచ్చారు. గురువారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా హక్కుల నేత, సీనియర్ న్యాయవాది బొజ్జతారకం జయంతిని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బండి మొగిలి, శ్రీరాముల పైడి, అంకేశ్వరపు రమేష్, పీసరి రజిత, ఎండి. హసీనా, ఎండి.షాహిదాబేగం, గునిగంటి రమేష్, దాసరి రాజు, తాడిశెట్టి క్రాంతి కుమార్, తరాల శంకర్, అంకేశ్వరపు రాంచందర్, సింగారపు రవిప్రసాద్, తరాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల రిజర్వేషన్ అంశాన్ని పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 27: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ముదిరాజ్‌ల రిజర్వేషన్ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిష్కరించాలని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని మెపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. బీసీ డినుంచి బీసీ ఏలోకి ముదిరాజ్‌లను మార్చాలనే ముదిరాజ్‌ల చిరకాల కోరికను ముఖ్యమంత్రి పరిష్కరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందుగానే ఈ సమస్యను పరిష్కరించి ముదిరాజ్‌ల అభిమానాన్ని చూరగొనాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. త్వరలో చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో రాష్ట్రంలోనే ఓటు బ్యాంకులో నెంబర్‌వన్‌గా ఉన్న ముదిరాజ్‌లకు మంత్రి పదవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శులు రాజు ముదిరాజ్, చిరంజీవి ముదిరాజ్, కిషన్ ముదిరాజ్, సాయిశివ ముదిరాజ్, రాణాప్రతాప్ ముదిరాజ్, రామకృష్ణ ముదిరాజ్, రాజేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో నిందితులపై కేసు

వేలేరు(ధర్మసాగర్), జూన్ 27: యువకుడిపై దాడి, ఆత్మహత్యాయత్నానికి కారకులైన నిందితులపై కేసు నమోదు చేయాలని జిల్లా కోర్టు ఆదేశించింది. ఈ సంఘటన అలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన మేదాబోన సురేష్ 2023 మే నెలలో తన స్నేహితులతో కలిసి గ్రామంలోని బెల్ట్‌షాపు వద్దకు వెళ్లి మద్యం తాగాడు. సిగరేట్‌ను కోసం పీచర గ్రామంలోని మరో బెల్ట్‌షాపు వద్ద ఉన్న డబ్బా దుకాణం వద్దకు సురేష్ వెళ్లాడు. అక్కడ ఆ బెల్టు షాపునకు సంబంధించిన వ్యక్తులైన బొల్లి రాజు, బొల్లి మీనా, ఇడపల్లి శ్రీకాంత్, ప్రశాంత్, సిద్ధులు అనే ఐదుగురు వ్యక్తులు.. అక్కడ మందు తాగి సిగరెట్ కోసం ఇక్కడికి వస్తావా? అని సురేష్‌ను తీవ్రంగా కొట్టి దాడి చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌ను వేలేరు పీహెచ్‌సీకి కుటుంబ సభ్యులు తరలించి, చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

గాయాల నుంచి కొలుకుని బాధితుడు సురేష్. తనపై దాడి చేసిన విషయాన్ని తెలుసుకోవడానికి వేలేరు పీఎస్‌కు వచ్చాడు. అప్పటికే సురేష్‌పై మీనా అనే మహిళ తనను కొట్టాడని కేసు పెట్టింది. దీంతో సురేష్ తీవ్ర మనస్థాపం చెంది బావి వద్దకు వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సురేష్‌ను ఎంజీఎంకు తరలించగా ఇరవై రోజుల పాటు చికిత్స పొందాడు. తర్వాత కోర్టును ఆశ్రయించడంతో ఐదుగురు నిందితులతో పాటు, వేలేరు ఎస్సై దొడ్డుకూరి హరితతో పాటు మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేయాలని జిల్లా కోర్టు నాలుగు రోజుల కిందట వేలేరు పోలీసులను ఆదేశించింది. దీంతో వీరిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం నిలిపివేయాలి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 27: గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భీమారంలోని సదానంద కాలనీలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు జరిపి ప్రారంభానికి సిద్ధం చేసిన అతి పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీకి వినతిపత్రం సమర్పించారు. ఒకే కాంప్లెక్‌లో సూపర్‌మార్కెట్, రెస్టారెంట్, లాడ్జి, బంక్వెట్ హాల్ నిర్మాణం జరిపినట్లు పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్ నుంచి డ్రైనేజీ నీరు బయటకు ప్రవహించడానికి ఏ మాత్రం ఆస్కారం లేదని, వర్షం నీరు రోడ్లపై ప్రవహించి ఇండ్లలోనికి వస్తాయని వినతిలో తెలిపారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం నిర్మాణం చేయలేదని, డ్రైనేజీ నీరు బయటకు వెళ్లే మార్గాన్ని చూపించిన తర్వాత కాంప్లెక్స్ ఓపెనింగ్‌కు బల్దియా అధికారులు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ దృష్టి సారించి కాంప్లెక్స్ నిర్వాహకులపై తగు చర్యలు చేపట్టాలని రజిత వెంకటేశ్వర్లు తెలిపారు.

అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

వడ్డెపల్లి, జూన్ 27: నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ ప్రాంతంలో చెంచు మహిళపై అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని విముక్త చిరుతల కక్షి(వీసీకే) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెంచు మహిళపై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల జాక్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిలుకర శ్రీనివాస్‌తో పాటు ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్‌లు మాట్లాడుతూ.. సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా మహిళను వివస్త్రను చేసి, ఆమెపై పెట్రోల్ పోసి కాల్చిన ఘటన మానవ జాతికే కళంకమని అన్నారు. ఆమెకు న్యాయం జరిగే వరకు సమాజంలోని ప్రతీ ఒక్కరు పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మానవీయ సమాజ నిర్మాణం కోసం ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. ఈ ధర్నాలో ప్రజా సంఘాల జాక్ నేతలు సోమ రామమూర్తి, తాడిశెట్టి క్రాంతి కుమార్, చిల్లా రాజేంద్రప్రసాద్, కన్నం సునిల్, సోమిడి శ్రీనివాస్, కేడెల ప్రసాద్, కూనూరు రంజిత్‌గౌడ్, రాచకొండ ప్రవీణ్ కుమార్, దూడల సాంబయ్య, పోరిక ఉదయ్‌సింగ్, చెరుపెల్లి ఆనంద్, వల్లాల జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్ కలెక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ టౌన్, జూన్ 27: విద్యుత్ సంస్థల ద్వారా పనిచేస్తున్న బిల్ కలెక్షన్ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హనుమకొండ వడ్డెపల్లిలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో జరిగిన కలెక్షన్ ఏజెంట్ల సమావేశానికి ముఖ్య అతిధిగా శ్రీధర్ హాజరై మాట్లాడుతూ.. 30 యేళ్లుగా పని చేస్తున్న కలెక్షన్ ఏజెంట్ల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం, మరో పక్క ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపుల ద్వారా ఏజెంట్ల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న వీరికి బిల్లుకు రూ.2మాత్రమే చెల్లిస్తుందని, గృహజ్యోతి ద్వారా బిల్లుల చెల్లింపులు తగ్గిపోవడంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే కల్పించుకొని కనీస వేతనాలు చెల్లించి, పని భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాకర్, సోమేశ్, సైదిరెడ్డి, కృష్ణాచారి, దేవేందర్, రాజశ్రీ, శ్రీదేవి, మల్లేశ్, ఎం.డి. పాషా పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్ఐ విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి



హెచ్‌సీయూలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు

కేయూ క్యాంపస్, జూన్ 27 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నేతలు శాంతియుతంగా నిరసనకు దిగడాన్ని జీర్ణించుకోని వీసీ తీరును నిరసిస్తూ కేయూ రెండో గేటు ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ నేతృత్వంలో వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ స్టూడెంట్ ఫెస్టివల్ సుకున్ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని వీసీ లాడ్జ్ ఎదుట శాంతియుతంగా నిరసనకు దిగిన ఎస్ఎఫ్ఐ విద్యార్థులను అక్రమంగా అప్రజాస్వామికంగా సస్పెండ్ చేయడమే కాక.. కేసులు పెట్టారని ఆరోపించారు. ఫెస్టివల్‌కు అనుమతిలేదనే సాకుతో ప్రజాస్వామ్యబద్ధంగా విద్యార్థులచేత ఎన్నుకోబడిన స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడితో పాటు మరో ఐదుగురు విద్యార్థులకు రూ.10వేలు జరిమానా విధించారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే విద్యార్థులపై చర్యలు విరమించుకుని, కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ జాయింట్ సెక్రటరీ జస్వంత్, సందీప్, రాజ్‌కుమార్, వైష్ణవి, అనూష, శిరీష, ప్రవళిక, సుమన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలి



అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నేతలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 27: నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం హనుమకొండలోని అంబేద్కర్ సర్కిల్‌లో విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ.. నీట్ పరీక్షను అభాసుపాలుచేసిన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం, పరీక్ష విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. జాతీయ స్థాయి పరీక్షల్లో లోపభూయిష్టంగా నిర్వహించే ఏజెన్సీలను సత్వరమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.తిరుపతి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, కె.భోగేశ్వర్, రామ్మూర్తి, శ్రీనివాస్, సత్యనారాయణ, రఘుపతి, భారతి, గోవిందరావు, యాకయ్య, మనోజ్, అశోక్, సంజీవరెడ్డి, దేవదాసు, సుమ, మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రకాశ్‌బాబు, చంద్రమౌళి, ఉదయ్‌సింగ్, సత్యవతి, వేణు, ఆనందచారి, రాజ్‌కుమార్, గోవర్ధన్, రవి, రమేష్, అన్నారెడ్డి, శ్రీనివాస్, సమ్మిరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

మడికొండ, జూన్ 27: మడికొండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బోయినపల్లి రాధాకృపాకర్‌రావు దంపతులు నోటు పుస్తకాలు, పలకలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త, లెక్చరర్ ఎస్.రాధాక్రిష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కమ్యూనిటీ మొబిలిటీ ఆఫీసర్ రాధ జిల్లా విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ విద్యార్థులకు సహాయం అందించడం విద్యార్థులపై ఆమెకు ఉన్నశ్రద్ధ, అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, రమేష్, మన్నె చంద్రయ్య, హైమావతి, కమల, సరిత, సిబ్బంది చందు, భాగ్యమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు డీసీసీ బ్యాంకు మహాజన సభ

హనుమకొండ సిటీ, జూన్ 27 : వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంకు మహాజన సభ శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాం కు ప్రధాన కార్యాలయంలో ఉదయం 11గంటలకు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన జరగనుంది. శనివారం సీఎం పర్యటన ఉన్నప్పటికీ మహాజనసభ యథాతథంగా జరగనుందని వెల్లడించారు.

గుట్కా పట్టుకున్న పోలీసులు


వరంగల్ క్రైం, జూన్ 27: వరంగల్ ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ నగర్‌లో రూ.6950 విలువ కలిగిన గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వరంగల్ గణేష్ నగర్‌లో వి.అరుణ్ అనేవ్యక్తి పాన్ షాపులో గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులుచేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధ్రువీకరించారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

నివేదన

శుక్రవారం • 28 జూన్ 2024



గీతాసారం

సమగ్రమైన బుద్ధి

యోగం అంటే మన లోపలి, వెలుపలి భాగాల కలయిక. కర్మ, భక్తి, సాంఖ్య, బుద్ధి తదితర అనేక మార్గాల ద్వారా దీన్ని పొందవచ్చు. వ్యక్తులు తమతమ స్వభావాన్ని బట్టి... తమకు తగిన మార్గాల ద్వారా యోగాన్ని పొందుతారు. ఈ సమత్వ బుద్ధి యోగం కన్నా సకామకర్మ చాలా తక్కువ స్థాయికి చెందినది. కాబట్టి... "నీవు సమత్వ బుద్ధి యోగాన్ని ఆశ్రయించు. ఎందుకంటే ఫలాసక్తితో కర్మలు చేసేవారు అత్యంత దీనులు" అని అర్జునుడితో శ్రీకృష్ణుడు చెప్పాడు. అంతకుముందు కర్మయోగంలో ఉన్నవారి బుద్ధి పొందికగా ఉంటుందనీ, అస్థిరమైన వారి బుద్ధి నిలకడ లేకుండా ఉంటుందనీ కూడా అన్నాడు. ఒకసారి బుద్ధి సమగ్రత సాధిస్తే... భూతద్దం కాంతిని కేంద్రీకృతం చేసినట్టు... అది జ్ఞానోపాసనలో కేంద్రీకృతమై సమర్థతను పొందుతుంది. సరైన దిశ, గమనం కలిగి ఉంటుంది.

ఇక్కడ శ్రీకృష్ణుడు ప్రస్తావించింది... అంతరంగం వైపు ప్రయాణం గురించి. సాధారణంగా మనం బాహ్య (భౌతిక) ప్రపంచంలో కోరికలను నెరవేర్చుకోవడానికి తెలివిని ఉపయోగిస్తాం. అయితే మనం అంతరంగం వైపు ప్రయాణాన్ని కొనసాగించడానికి దాన్ని ఉపయోగించాలని భగవద్గీత బోధిస్తోంది.

మనలో పాతుకుపోయిన నమ్మకాలు, భావోద్వేగాలు, ఊహలు, ఆలోచనలు, చర్యలు, మనం మాట్లాడే పదాలు... ఇలా ప్రతిదాన్నీ ప్రశ్నించాలి. అంతర్గత ప్రయాణం కోసం పొందికైన మేధస్సును ఉపయోగించడంలో అదే మొదటి అడుగు. జ్ఞానం సరిహద్దులను దాటడానికి ప్రశ్నించడాన్ని విజ్ఞానశాస్త్రం ఉపయోగించినట్టు... మనం కూడా ఇటువంటి ప్రశ్నలను మనలోని పరమ సత్యాన్ని వెలికి తీయడానికి ఉపయోగించవచ్చు. చేసిన కర్మ తాలూకు ఫలాలను పొందాలనే ఆలోచనతో ఉన్నవారు దుఃఖితులని శ్రీకృష్ణుడు చెప్పాడు. కొన్నిసార్లు కర్మ ఫలాలు మనకు సుఖాన్ని ఇస్తాయి. కాబట్టి మనం ఈ ధోరణిని పెంపొందించుకుంటాం.

కానీ ధ్రువీకృత ప్రపంచంలో ప్రతి సుఖం కాలక్రమేణా బాధగా మారుతుంది. అది మన జీవితాలను నరకం చేస్తుంది అనే నిజాన్ని గుర్తుపెట్టుకోవాలి. శ్రీకృష్ణుడు మనలోని వైరుధ్యాల నుంచి మనల్ని రక్షిస్తానని వాగ్దానం చేయలేదు. కానీ ఆత్మతత్త్వాన్ని గ్రహించి వాటిని అధిగమించమని చెప్పాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సుభాషితం



మూర్ఖత్వానికి మందు లేదు

శక్యో వారయితుం జలేన హుతభుక్ఛత్రేణ సూర్యాతపో
నాగేంద్రో నిశితాంకుశేన సమదో దండేన గోగర్దభః
వ్యాధిర్భేషజ సంగ్రహైశ్చ వివిధైర్మంత్ర ప్రయోగైర్విషం
సర్వస్యౌషధమస్తి శాస్త్రవిహితం మూర్ఖస్య నాస్త్యౌషధమ్...


మూర్ఖుల ధోరణిని తన నీతిశతకంలోని ఈ శ్లోకంలో భర్తృహరి వివరించాడు. దాన్ని...

జలముల నగ్ని ఛత్రమున జండమయూఖుని దండతాడనం
బుల వృషగార్దభంబులను బొల్పగు మత్తకరీంద్రమున్ సృణిం
జెలగెడు రోగమౌషధముచే విషముందగు మంత్రయుక్తిని
మ్ములు దగజక్కజేయనగు మూర్ఖుని మూర్ఖత మాన్పవచ్చునే?... అంటూ పద్యరూపంలో తెలుగువారికి ఏనుగు లక్ష్మణకవి సమర్పించాడు.

భావం: నీటితో నిప్పును, మంటలను ఆర్పవచ్చు. ఎండ తీవ్రతను గొడుగుతో అడ్డుకోవచ్చు. పాము విషానికి విరుగుడుగా మంత్రం వెయ్యొచ్చు. మదించిన ఏనుగును అంకుశంతో అదుపు చెయ్యవచ్చు. ఎద్దులు, గాడిదలు లాంటి జంతువులను కర్రను ఉపయోగించి నిలువరించవచ్చు. ఔషధాలతో వ్యాధులను నివారించవచ్చు. కానీ మూర్ఖత్వాన్ని నిరోధించే, నివారించే మందు మాత్రం ఏ శాస్త్రంలోనూ చెప్పలేదు. అంటే మూర్ఖత్వాన్ని మాన్పే మందు ఎక్కడా లేదు.

కేన్సర్ చికిత్సలో ఆయనది అంతర్జాతీయ ఖ్యాతి. దేశ విదేశాలకు చెందిన ఎందరో ప్రముఖులకు ప్రాణదాత. ప్రపంచంలో ఆరోగ్య సంపదను పెంచడానికి నిరంతర కృషి చేస్తూనే... ఆధ్యాత్మిక సంపదను కూడా అపారంగా సంపాదించుకున్న డాక్టర్ నోరి దత్తాత్రేయుడు 'నివేదన'తో పంచుకున్న అనుభవాలివి.

చేయించేది ఆ సర్వాంతర్యామే



స్వానుభవం

దేవుడు, భక్తి... వీటిని ఎలా నిర్వచిస్తారు?

భక్తి మనలో వ్యక్తిగతంగా మొదలవుతుంది. "సూపర్ పవర్ ఒకటి ఉన్నది, అదే మనల్ని నడిపిస్తోంది. మనం నిమిత్తమాత్రులం" అని మనం నమ్మాలి. అప్పుడు మనం ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తాం. ఆ తరువాత అది సామాజికంగా మారుతుంది. ఇక దైవారాధన విషయానికి వస్తే... భారతదేశం, మన హిందూ సంస్కృతి... ఒక ఆధ్యాత్మిక సూపర్‌మార్కెట్. ఇక్కడ ఎందరో దేవుళ్ళు ఉన్నారు. ఎన్నో భక్తి మార్గాలు ఉన్నాయి. మనకు కావలసిన దైవాన్ని మనం పూజించుకొనే వెసులుబాటు ఉంది. ఇది మన హిందూమతానికి మాత్రమే ఉన్న ఒక ప్రత్యేకత. "మీకు ఇందరు దేవుళ్ళు ఎందుకున్నారు? ఇన్ని విగ్రహాలు ఏమిటి?" అని విదేశీ మిత్రులు నన్ను అడుగుతూ ఉంటారు. మాకు ఆధ్యాత్మికంగా, భక్తిపరంగా అంత వైవిధ్యం ఉందని నేను సమాధానం ఇస్తూ ఉంటాను. మనకు చదువులో అనేక స్థాయిలు ఉంటాయి. టెన్త్ తరువాత ఇంటర్ చదవాలి. ఆ తరువాత డిగ్రీ చేశాక పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యాలి. ఆ తరువాత పిహెచ్‌డి చెయ్యాలి. అలాగే భక్తిలోనూ ఒక్కొక్క స్థాయినీ దాటుకుంటూ వెళ్ళాలి. పిహెచ్‌డి తరువాత మళ్ళీ వెనక్కి వెళ్ళక్కర్లేదు. అలాగే ఆధ్యాత్మికతలో... అత్యున్నత స్థాయికి చేరుకొని, 'దేవుళ్ళందరూ ఒక్కటే' అని అర్థమయిన తరువాత... విగిలినవాటితో పని లేదు.

మీకు దైవ చింతన ఏ వయసులో బలపడింది?

మా తల్లితండ్రులకు దైవభక్తి ఎక్కువ. దైవ చింతన నాకు బాల్యం నుంచీ బలంగానే ఉంది. పిల్లలకు భక్తి, పూజా పునస్కారాలు నేర్పారు. నాకు అయిదారేళ్ళ వయసులో మా నాన్నగారు గతించారు. అప్పుడు నేను దేవుడి గదిలోకి వెళ్ళి, తలుపులు వేసుకొని... "మా నాన్నను నాకు తిరిగి ఇస్తావా? లేదా?" అని ఏడుస్తూ దేవుణ్ణి ప్రార్థించాను. దేవుణ్ణి ఇష్టపడే ధోరణి నాకు చిన్నప్పటినుంచీ ఉంది. ఏనాడూ ఆ విషయంలో నాకు రెండో ఆలోచన లేదు. ఆ పునాదులు కుటుంబంలోనే పడ్డాయి. క్రమేపీ భక్తి పెరిగింది.

'ఇది దైవసంకల్పం వల్ల జరిగింది' అనే సంఘటనలు ఏవైనా ఉన్నాయా?

మన జీవితంలో ప్రతిదీ దేవుడి ప్రమేయంతోనే జరుగుతుందనేది నా విశ్వాసం. అందులో మరో ఆలోచన లేదు. అయితే... 'ఆధ్యాత్మికత గొప్పదా? వైద్యం గొప్పదా?' అనే మీమాంస ఒకప్పుడు నాలో కలిగింది. ఎందుకంటే నాది సైన్స్ నేపథ్యం. సైన్స్ ప్రధానంగా వైద్యం... రుజువులను బట్టి ఫలితాన్ని నిర్ధారణ చేస్తాయి. 'ఒక అత్యున్నతమైన శక్తి అంటే సుప్రీమ్ పవర్ ఉంది, అన్నిటినీ అదే నడిపిస్తోంది' అనేది నా నమ్మకం. నేను వైద్యుణ్ణి అయ్యాక... దాన్ని మరింతగా నిర్ధారించుకున్నాను. వైద్యం, ఆధ్యాత్మికత అనేవి పరస్పర వ్యతిరేకమైనవి కావనీ, నిజానికి అవి పరస్పర దోహదకారులనీ అర్థమయింది. నేను ఎవరికైనా మంచి మందు ఇవ్వాలన్నా, ఆపరేషన్ చెయ్యాలన్నా... నా మనసు నిర్మలంగా ఉండడం, బుద్ధి పదునుగా ఉండడం ప్రధానం. దానికి ఆధ్యాత్మికత దోహదం చేస్తోంది. అది కాంప్లిమెంటరీ.

అమెరికాలో షిరిడీ బాబా ఆలయాలు కట్టించారు. ఆయన మీద గురి ఎలా కుదిరింది?

నేను కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్న రోజులవి. అప్పట్లో రాష్ట్రంలోనే అతి పెద్ద షిరిడీ సాయిబాబా ఆలయాన్ని... తుంగభద్ర తీరంలో నిర్మించారు. నేను సాయంత్రం ఆ ప్రాంతానికి వెళ్లేవాణ్ణి. ఆ ఆలయంలో కూర్చున్నప్పుడు ప్రశాంతంగా అనిపించేది. ఆ తరువాత షిరిడీబాబా గురించి తెలుసుకోవాలని... 'సాయి సచ్చరిత్ర' లాంటి పుస్తకాలు చదివాను. ఆయన సిద్ధాంతాలు చాలా సరళంగా, ప్రభావం కలిగించేలా, సులువుగా అనుసరించేలా ఉన్నాయనిపించింది. ఆయన మీద భక్తి పెరిగింది. షిరిడీబాబాకు మనం సన్నిహితంగా వెళ్ళేకొద్దీ ఆయన అనేక అనుభవాలు కూడా కలిగిస్తూ ఉంటారు. అవి చమత్కారంగా ఉంటాయి.

మీ దృష్టిలో... ఇలాంటివి భక్తులందరికీ కలుగుతూ ఉంటాయా?

ఆయన మీద భక్తి పెరిగే కొద్దీ చమత్కారాలు ఎక్కువ చూపిస్తూ ఉంటారు. నిస్వార్థంగా, పరిపూర్ణమైన భక్తిభావం ఉన్నప్పుడు... మీ జీవితంలో ఇలాంటి అనుభవాలు కలుగుతూనే ఉంటాయి. మీరు చేయాల్సిందల్లా... వాటిని గమనించడం, అనుభూతి చెందడం మాత్రమే. అలాంటి మరో అద్భుతమైన సంఘటన ఏమిటంటే... అమెరికాలో వాణి అని షిరిడీబాబా భక్తురాలు ఒకామె ఉండేవారు. ఆమె భారతదేశం నుంచి అక్కడికి వచ్చారు. ఆసుపత్రిలో నా పని పూర్తి చేసుకున్నాక... ఆమెను కలుసుకొని... ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుతూ ఉండేవాణ్ణి. బాబా గురించి ఎన్నో విషయాలు ఆమె చెబుతూ ఉండేవారు. ఒకసారి ఆమె ఏదో కథ చెబుతూ... "బాబాకు మాధవరావ్ దేశ్‌ముఖ్ అనే శిష్యుడు ఉండేవాడు..." అంటూ... "ఆ పేరు నాకెందుకో సరిగ్గా గుర్తుకు రావడం లేదు..." అని ఆపేశారు. అప్పటికే రాత్రి పదకొండయింది. "నాయనా! ఇప్పటికే ఆలస్యమైంది. నువ్వు ఇంటికి వెళ్ళు" అన్నారు. నేను ఇంటికి వచ్చాను. పదకొండున్నర అయింది. టిఫిన్ తింటూ... టీవీ ఆన్ చేశాను. అప్పుడొక ఇండియన్ ఛానెల్ వస్తోంది. మా వాళ్ళు ఇండియన్ ఛానెల్స్ కూడా పెట్టించారని నాకు తెలీదు. ఆ ఛానెల్‌లో షిరిడీ గురించిన కథ నడుస్తోంది... వాణిగారు తను చెబుతున్న కథ ఎక్కడైతే ఆపేశారో... నేను చూసేటప్పటికి అక్కడినుంచే టీవీలో కథ మళ్ళీ మొదలైంది. అందులో ఒక పాత్రధారి "మేరా నామ్ మాధవరావ్ దేశ్‌ముఖ్ నహీహై... దేశ్‌పాండే" అని చెబుతున్నాడు. దీన్ని యాదృచ్ఛికం అందామా? దేవుడి ఉనికికి నిదర్శనం అందామా? బాబా మిమ్మల్ని ఎప్పుడూ గమనిస్తూనే ఉంటారు. ఇలాంటి సంఘటనల వల్ల భక్తి ఇంకా పెరుగుతుంది. భక్తి పెరిగినకొద్దీ దేవుడు మీకు స్నేహితుడవుతాడు. మీరతణ్ణి ఆజ్ఞాపించవచ్చు. డిమాండ్ చెయ్యవచ్చు. అయితే అది మీ సొంత ప్రయోజనాలకోసం మాత్రం కాకూడదు. నాలోనూ ఆ విధంగానే భక్తి పెరిగి... ఇంకేదైనా చేయాలనే ఆలోచనతో న్యూయార్క్‌లో గుడి కట్టాను. అమెరికాలో మొదటి షిరిడీ సాయి గుడి అదే. మిగిలిన రాష్ట్రాల వాళ్ళు కూడా అక్కడికి రావడం మొదలుపెట్టారు. వాళ్ళకు చాలా దూరం అవుతోందనే ఆలోచనతో... న్యూజెర్సీలో మరో గుడి కట్టాను.



మీకు అలాంటి అనుభవాలేవైనా కలిగాయా?

ఒకటీ రెండూ కాదు... ఎన్నో. నేను న్యూయార్క్‌లో బాబా ఆలయాన్ని కట్టాలనుకున్నాను. విగ్రహం సిద్ధమైంది. దాన్ని స్థాపించడానికి సరైన స్థలం దొరకలేదు. అక్కడ అనుమతులు చాలా కఠినంగా ఉంటాయి. భవనానికి స్థలం దొరికితే జోనింగ్ కావాలి. జోనింగ్ దొరికితే దానికి పార్కింగ్ కావాలి. అన్నీ ఉంటే తప్ప అనుమతులు ఇవ్వరు. అనువైన స్థలం కోసం దాదాపు ఆరేళ్ళపాటు వెతికాను. ఎక్కడా దొరకలేదు. షిరిడీబాబాకు గురువారం ప్రియమైన రోజు. అలాంటి ఒక గురువారం నాడు... నేను పొద్దున్న పూజ చేసుకొనేటప్పుడు "బాబా! స్థలం వెతకడం ఇక నా వల్ల కాదు. ఆ ప్రయత్నం నేను వదిలేస్తున్నాను. మీ విగ్రహావిష్కరణ కోసం ఎవరో ఒకరిని మీరే వెతుక్కోండి" అని దాదాపు సవాల్ చేశాను. తరువాత క్లినిక్‌కు వచ్చాను. పేషెంట్స్‌ను పరీక్షిస్తున్నాను. ఉదయం బాబాకు చేసిన సవాలే నాకు మనసులో మెదులుతూ ఉంది. అప్పుడు ఒకామె వచ్చింది. అప్పటికి పదేళ్ళ ముందు ఆమెకు నేను కేన్సర్ నయం చేశాను. ఆమె ఫాలోఅప్ చెకప్ కోసం వచ్చింది. ఒకప్పుడు రోగులతో కుటుంబ సభ్యులతో ఉండేటంత చనువు ఉండేది. ఆ చనువుతోనే "అమ్మా! ఇప్పుడు మీరు ఏ ప్రొఫెషన్‌లో ఉన్నారు?" అని అడిగాను. "నేను రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో ఉన్నాను" అని ఆమె చెప్పింది. "నాకు నా అవసరానికి తగిన జోనింగ్, పార్కింగ్ ఉన్న స్థలం ఏదైనా చూపిస్తారా? ఎంత వెతికినా దొరకడం లేదు. వెతికి వెతికి విసుగుపుట్టింది" అని అడిగాను. "నేను ఆఫీసుకి వెళ్ళి, కంప్యూటర్లో చెక్ చేసి చెప్తాను" అంది. వెళ్ళిన కొంతసేపటికే ఆమె ఫోన్ చేసింది. "ఒకటి దొరికిందండీ! వాళ్ళ అపాయింట్‌మెంట్ తీసుకోనా?" అని అడిగింది. "అపాయింట్‌మెంట్ అక్కర్లేదమ్మా! నేను ఇప్పుడే వచ్చేస్తున్నాను" అని చెప్పాను. వెళ్ళాను, స్థలాన్ని చూశాను, సంతకాలు పెట్టి, ఆ స్థలాన్ని తీసుకున్నాను. అప్పుడు నాకు 'గజేంద్రమోక్షం'లో 'నీవేతప్ప నితఃపరంబెరుగ...' అనే పద్యం గుర్తుకువచ్చింది. 'నాపని అయిపోయింది. ఆ పని మీరే చేసుకోవాలి' అని నేను అన్న తరువాత... ఆయన వెంటనే మార్గాన్ని చూపించారు. 2001లో ఆలయ నిర్మాణం జరిగింది. ఇలాంటి చమత్కారాలు ఎన్నో జరిగాయి.

మీరే దేవుడని మీ పేషెంట్లు చాలామంది చెబుతూ ఉంటారు. వారికి మీరేం చెబుతారు?

"నాలో ఆధ్యాత్మిక దృక్పథం, నా వృత్తిని ప్రేమించే తత్త్వం ఉన్నాయి కాబట్టి నా ద్వారా భగవంతుడు మీకు సాయం చేశాడు. ఆయన నన్ను ఒక సాధనంగా ఎంచుకున్నాడు" అని చెబుతాను. అలా చెప్పడంవల్ల వాళ్ళలోనూ భక్తి భావన పెరుగుతుంది. అంతా నేనే చేస్తున్నాననే అహంకారం మీలో ఏర్పడితే... అక్కడితో మీ అధ్యాయం పూర్తయినట్టే. కాబట్టి ఇవన్నీ నా ద్వారా ఆ సర్వాంతర్యామి చేయిస్తున్నాడనే నేను అనుకుంటాను.

సంభాషణ: కృష్ణశర్మ

కాళింగ నర్తన పెరుమాళ్ ఆలయం

ఆలయదర్శనం





ఏ ఆలయమైనా... గర్భగుడిలో ఉన్న మూలవిరాట్ పేరిట ప్రాచుర్యం పొందడం సర్వసాధారణం. కానీ ఉత్సవమూర్తి పేరుతో ప్రసిద్ధి చెందిన ఆలయం ఒకటుంది. అదే శ్రీకాళింగ నర్తన పెరుమాళ్ ఆలయం. తమిళనాడులోని ఊతుక్కాడులోని ఈ ఆలయానికి వెయ్యేళ్ళకు పైగా చరిత్ర ఉంది. ఇక్కడి ప్రధాన దైవం... శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ వేదనారాయణ పెరుమాళ్. ఈ కోవెలను శ్రీకాళింగ నర్తన పెరుమాళ్ సన్నిధిగా వ్యవహరించడానికి కారణాన్ని స్థలపురాణం వివరిస్తోంది.

పూర్వం ఊతుక్కాడ్‌లో అతి పురాతనమైన వేదనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకోవడానికి నారద మహర్షి వచ్చాడు. ఆలయంలోకి వెళ్ళే ముందు... కళింగమాడు అనే పేరుతో అక్కడ ఉన్న చిన్న కొలనులో స్నానం చేశాడు. అప్పుడు ఆయనకు... కాళీయ మర్దన భంగిమలో ఉన్న కృష్ణుడి విగ్రహం దొరికింది. దాన్ని ఆయన ఆలయంలోకి తీసుకువెళ్ళి... వేదనారాయణుడి సన్నిధిలో ఉంచాడు. తమిళంలో కాళీయుణ్ణి కాళింగుడిగా వ్యవహరిస్తారు. కాళీయుడి (కాళింగుడి) పడగల మీద నర్తిస్తున్నట్టున్న ఆ విగ్రహం... శ్రీకాళింగ నర్తన పెరుమాళ్‌గా... రుక్మిణీ, సత్యభామా సమేతంగా పూజలు అందుకుంటోంది. కాగా, కాళీయ మర్దన నృత్య దృశ్యాన్ని... కామధేనువు పిల్లలైన నందిని, పట్టి అనే దివ్యమైన గోవుల ముందు, నారదుడి ముందు శ్రీకృష్ణుడు ప్రదర్శించాడనే మరో కథ ఉంది. దానికి గుర్తుగా... తాండవ కృష్ణుడి సమీపంలో ఆ రెండు గోవులు కూడా కనిపిస్తాయి. పడగ మధ్యలో మానవరూపం కలిగిన అయిదు తలల సర్పం మీద ఎడమపాదాన్ని ఉంచి, కుడి పాదాన్ని పైకి లేపి నర్తించే కృష్ణుడు... ఒక చేత్తో పాము తోకను తాకుతూ, మరో చేత్తో భక్తులకు అభయం ఇస్తూ ఉంటాడు. సాక్షాత్తూ నారదుడి అవతారంగా పేరుపొందిన శ్రీ వెంకట సుబ్బ అయ్యర్ (వెంకటకవి) ... ఈ స్వామిని స్తుతిస్తూ అనేక గీతాలను రాశారు.

ఈ ఆలయ ప్రధాన గోపురం ఆదిశేషుణ్ణి పోలి ఉంటుంది. ఈ ప్రాంగణంలో మహాలక్ష్మి ఆలయం ఉంది. ప్రధానద్వారానికి ఎడమవైపు నర్తించే వినాయకుడి విగ్రహం కనిపిస్తుంది. ఆలయం లోపల పంచముఖ ఆంజనేయుడు, ఆండాళ్, వరదరాజస్వామి, ఊతుక్కాడు వెంకటకవి మందిరాలు ఉన్నాయి. రోహిణీ నక్షత్రం రోజున ఈ ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తారు. మే, జూన్ నెలల మధ్యలో వసంతోత్సవం, శ్రావణమాసంలో కృష్ణాష్టమి ఉత్సవం జరుగుతాయి.

ఎలా వెళ్ళాలి?: తమిళనాడులోని కుంభకోణానికి సుమారు పద్నాలుగు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. కుంభకోణం నుంచి బస్సులు, ప్రైవేటు వాహనాల్లో చేరుకోవచ్చు.

అదే వసుధైక కుటుంబం



ప్రపంచం ఒక పువ్వు లాంటిది. ప్రతి దేశం ఆ పువ్వులో ఒక రెక్క. ఒక రెక్కకు చీడపీడలు సోకితే... మిగిలిన రెక్కలన్నిటికీ వ్యాపిస్తాయి. ఆ పువ్వు జీవితం, సౌందర్యం ఆ వ్యాధి వల్ల నాశనమైపోతాయి. కాబట్టి పుష్పంలాంటి ఈ ప్రపంచం తాలూకు అందం, పరిమళం నాశనం కాకుండా పరిరక్షించే బాధ్యత మనలో ప్రతి ఒక్కరిపైనా ఉంది. మనదైన ఈ ప్రపంచం చాలా పెద్దది. ఇది అనేక రేకులతో అలరాలే అద్భుతమైన పుష్పం. ఈ విషయాన్ని మనం సమగ్రంగా అర్థం చేసుకొని, మనసు లోతుల్లో స్థిరపరుచుకున్నప్పుడు... నిజమైన శాంతి, ఐక్యత నెలకొంటాయి. దేశాల మధ్య యుద్ధాలనేవి పూరేకుల మధ్య ఘర్షణల్లాంటివి. పూరేకుల మధ్య పోటీ.... చివరికి అన్ని రేకులూ రాలిపోవడానికి దారి తీస్తుంది. మొత్తం పుష్పం నాశనమైపోతుంది. విడివిడిగా ఉండడం, వైషమ్యం మన శక్తినీ, సామర్థ్యాన్నీ తగ్గిస్తాయి. అసలైన శక్తి కలిసి ఉండడంలో ఉంది, విడిపోవడంలో కాదు.

'మనమంతా ఒకటే' అని గ్రహిస్తే మొత్తం లోకం మన కుటుంబంగా... వసుధైక కుటుంబంగా మారుతుంది. ఈ జ్ఞానం మనలో ఉదయించినప్పుడు... కేవలం కొందరు వ్యక్తులకో, ఒక సమాజానికో, ఒక దేశానికో మనం పరిమితం కాము. ఈ సత్యాన్ని తెలుసుకుంటే మొత్తం విశ్వం మన సొంత ఇల్లు అవుతుంది. మొత్తం సృష్టి మనదే అవుతుంది. అత్యున్నతమైన దివ్య శక్తితో పరమాత్మ చైతన్యం సర్వత్రా వ్యాపించి ఉందనీ, ఆ దివ్య శక్తే ప్రతి చోటా భిన్నమైన పేర్లతో, భిన్నమైన రూపాలతో ఉందనీ మనం తెలుసుకున్నప్పుడు... ఎలాంటి విభజనలకూ ఆస్కారం ఉండదు. మనం సమగ్రమైన వ్యక్తులుగా రూపాంతరం చెందుతాం. నిరాడంబరత, నిష్కల్మషమైన, నిరాపేక్షమైన ప్రేమ మనలో నెలకొంటాయి. మన మాటల్లో, చేతల్లో దివ్యమైన ప్రేమ వ్యక్తమవుతుంది. అది ఇతరులను ప్రభావితం చేస్తుంది. వారి జీవితాలను రూపాంతరీకరిస్తుంది.

> అత్యున్నతమైన దివ్య శక్తితో పరమాత్మ చైతన్యం సర్వత్రా వ్యాపించి ఉందనీ, ఆ దివ్య శక్తే ప్రతి చోటా భిన్నమైన పేర్లతో, భిన్నమైన రూపాలతో ఉందనీ మనం తెలుసుకున్నప్పుడు... ఎలాంటి విభజనలకూ ఆస్కారం ఉండదు.

లోకంలో ఉన్న మనమందరం ఒక అజేయమైన శక్తి. మనమందరం పరస్పర ప్రేమాభిమానాలతో చేయీ చేయీ కలిపి పని చేసినప్పుడు... ఆ శక్తి అద్భుతాలు చేస్తుంది. నిరంతరమైన ఐక్యతతోనే నిజమైన ప్రగతి, శాంతి సాధ్యం అవుతాయి. ఒక చుక్క నీరు నదిగా మారదు... ఎన్నో చుక్కల నీరు కలిస్తేనే అది సాధ్యమవుతుంది. అసంఖ్యాకమైన నీటి చుక్కలు కలిసి చిన్న ప్రవాహం అవుతాయి. జీవితం అనే ప్రవాహం కదలాలంటే... ఎందరో వ్యక్తుల సహాయ సహకారాలు కావాలి. జీవితం సజావుగా సాగాలంటే ఐక్యత, ప్రేమ అవసరం.

కలిసి ప్రార్థన, ధ్యానం చేస్తే... మనలోని ప్రాణ శక్తి ఒకే ప్రవాహంలా... సామరస్యంగా ప్రవహిస్తుంది. ప్రేమ మాధుర్యంతో నిండిన దివ్య సుగంధాన్ని వ్యాప్తి చేస్తుంది. వాతావరణంలో శాంతి, ఐక్యతల ప్రకంపనలను సృష్టిస్తుంది. అత్యున్నత శక్తి ఒకటేనే భావనను మనలో కలిగించి, విభజన భావాలన్నిటినీ తొలగిస్తుంది. అప్పుడు మన హృదయాలు వికసిస్తాయి. 'లోకస్సమస్తా సుఖినో భవంతు' అని ప్రార్థించడానికే కాదు.... లోకుల సుఖ సంతోషాల కోసం పాటుపడడానికి ప్రేరణ కలిగిస్తాయి. విశ్వశాంతికి సోపానాలవుతాయి.

శ్రీ మాతా అమృతానందమయి

చింతన

తెలివైనవారు ఎవరు?

ప్రస్తుతం ప్రతి మనిషి ఏదో ఒకదానికోసం పాకులాడుతున్నాడు. అయితే మనం దేనికోసం పాకులాడాలి? మన హృదయంలో కొలువైన, మనలో ఉన్న భగవంతుడితో అనుబంధం పెంచుకోవడం కోసం పాకులాడాలి. అప్పుడు మనకు దుఃఖం, బాధ కలిగించేవి ఎన్ని ఎదురైనా... వాటి ప్రభావం మనమీద ఉండదు.

సాధారణంగా ఈ ప్రపంచం తీరు ఎలా ఉంటుందంటే... మిమ్మల్ని ఏవైతే దుఃఖానికీ, బాధకూ గురి చేస్తాయో... వాటిని అడ్డుకోవడానికి మీరు ప్రయత్నిస్తారు. మీ సమయాన్నంతా దానికోసం వృథా చేస్తూ ఉంటారు. దానికి బదులు మీలోని భగవంతుడితో అనుబంధం ఏర్పరచుకుంటే... అనవసరమైన విషయాల్లో మీ సమయం వృథా కాదు. సుఖాన్నీ, దుఃఖాన్నీ సమాన దృష్టితో చూసేవారే ఈ లోకంలో తెలివైనవారు. ఎందుకంటే... దుఃఖం శాశ్వతంగా ఉండదనీ, సుఖం కూడా శాశ్వతం కాదనీ వారికి తెలుసు. దుఃఖం ఎదురైనప్పుడు... కొంతకాలం ఓపికగా నిరీక్షిస్తే... సుఖం వస్తుంది. అలాగే సుఖంగా ఉన్నప్పుడు... కొంతకాలం గడిచాక దుఃఖం వస్తుంది. అవి అలా మారుతూనే ఉంటాయి.

నేను ఒకసారి నా ప్రసంగాన్ని వినిపించడం కోసం ఒక జైలుకు వెళ్ళాను. జైళ్ళలో పరిస్థితులన్నీ చాలా దారుణంగా ఉంటాయని ఎవరో చెప్పారు. అయితే, అందుకు కారణం ఏమిటి? జైల్లోని వాతావరణం పాడైపోవడానికి కారణం జైలు కాదు... అందులో ఉండే వ్యక్తులు. అక్కడ ఉన్నవారి దృష్టిని మంచి విషయాలమీదకు మళ్ళిస్తే... అక్కడ కూడా చక్కని వాతావరణం ఏర్పడుతుంది. జైలుకు వెళ్ళిన ప్రతిఒక్కరూ పోలీసులను, న్యాయవ్యవస్థను, ప్రభుత్వాన్నీ, కుటుంబ సభ్యులను, తమ ప్రత్యర్థులను దూషించడం ప్రారంభిస్తారు తప్ప తమలోని తప్పులను గమనించరు. కానీ క్రమక్రమంగా వారు దృష్టిని తమమీద కేంద్రీకృతం చేసుకున్నట్టయితే... రెండు విషయాలు అర్థమవుతాయి. ఒకటి... తాము ఆ తప్పు చేయకుండా ఉండాల్సిందని. ఈ ఆలోచన రావడం గొప్ప విషయమేం కాదు. రెండోదే చాలా ముఖ్యమైనది... తాము వ్యవస్థలను మార్చలేమనీ, కానీ తమను తాము మార్చుకోగలవనీ గ్రహించడం. అప్పుడు తమను తాము తెలుసుకుంటారు. అలా తెలుసుకున్నాక జీవితంలోని ప్రతి రోజునూ ఆస్వాదిస్తారు. అది అసాధ్యమేం కాదు. మనం ఏమిటో మనకు తెలియకపోవడం వల్లనే... దుఃఖాలు, బాధలతో సతమతమవుతున్నాం. మనం ఎవరో తెలుసుకుంటే... ఆనందంగా ఉంటాం. ఎన్నో ఏళ్ళ క్రితం సోక్రటీస్, కబీర్ దాస్ లాంటి ఎందరో మహాత్ములు ఇదే మాట చెప్పారు... "నిన్ను నువ్వు తెలుసుకో" అని.


మనిషిలో కోపం ఉంటుందని అందరూ అంటారు. కానీ ఆ మనిషిలోనే శాంతం కూడా నిక్షిప్తమై ఉందని అనుకోరు. కోపం ఉందని మీకు తెలుసు. ఎందుకంటే దాన్ని మీరు అనుభూతి చెందారు కాబట్టి. కానీ శాంతి ఉందని మీకు తెలియకపోవడానికి కారణం... ఆ అనుభూతిని మీరు పొందకపోవడం. అదేవిధంగా... మీలోనే భగవంతుడు కొలువై ఉన్నాడని చెబితే... అంగీకరించేవారు తక్కువ. ఇవన్నీ అనుభవపూర్వకంగా తెలుసుకోవలసిన విషయాలు. మీలో అపారమైన శక్తి సామర్థ్యాలు ఉన్నాయని కూడా మీరు అనుభూతి పొందనంతవరకూ తెలీదు. ఏది ఏమైనప్పటికీ ధైర్యాన్ని కోల్పోకపోవడం ప్రధానం. ఎన్ని సమస్యలు ఎదురైనా... ఆ సమస్యలకన్నా మీరు ఉన్నతమైనవారనేది గుర్తుంచుకోండి. ఈ విషయంలో చిన్న చీమను చూసి కూడా నేర్చుకోవచ్చు. కనుక... విమ్మల్ని మీరు తెలుసుకోండి. మీ హృదయంలో ఉన్న శాంతిని స్వయంగా అనుభూతి చెందండి.





ప్రేమ్ రావత్
9246275220
www.premrawat.com

పది రోజుల వర్కే బ్యాలెన్స్



ఒక సినిమా తర్వాతే మరో సినిమా చేయడం తమిళ దర్శకుడు శంకర్‌కు అలవాటు. అయితే అనుకోని పరిస్థితుల వల్ల ఆయన ఒకేసారి రెండు సినిమాలు.. 'భారతీయుడు 2', 'గేమ్‌ఛేంజర్' చేయాల్సి వస్తోంది. విశిష్ట నటుడు కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుండడంతో కాస్త ఊపిరి తీసుకున్న శంకర్ ఒకపక్క 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో పాల్గొంటూనే రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్‌ఛేంజర్ మీద కూడా దృష్టి పెట్టారు. ఈ సినిమా గురించి అప్‌డేట్ వచ్చి చాలా కాలం అవుతోంది. 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా దర్శకుడు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గేమ్‌ఛేంజర్' గురించి అప్‌డేట్ ఇచ్చారు. 'సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయింది. ఇంకో పది రోజుల వర్క్ మాత్రమే మిగిలి ఉంది. 'భారతీయుడు 2' విడుదల కాగానే ఆ వర్క్ మొదలుపెడతాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభిస్తా. అవన్నీ పూర్తయ్యాక విడుదల ఎప్పుడనేది నిర్ణయిస్తా. సాధ్యమైనంత వరకూ తొందరగానే 'గేమ్‌ఛేంజర్' రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా' అని శంకర్ వెల్లడించారు. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే ఓ పవర్‌ఫుల్ కథాంశంతో రూపుదిద్దుకుంటున్న 'గేమ్‌ఛేంజర్' లో కియారా అద్వాణీ కథానాయిక. శ్రీకాంత్, అంజలి, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్ తదితరులు చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.


సంక్రాంతి బరిలో అజిత్ చిత్రం



తమిళ అగ్రకథానాయకుడు అజిత్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు, తమిళ భాషల్లో పూర్తి వినోదభరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అదిక్ రవిచంద్రన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం సెకండ్ లుక్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. అజిత్ బ్లాక్ షేడ్స్ ధరించి , ఖైదీ డ్రస్‌లో కనిపించారు, ఆయన చేతి మీద ఉన్న టాటూ, బ్యాక్ గ్రౌండ్‌లో మ్యాసివ్ గన్ ఫైరింగ్ స్టన్నింగ్‌గా ఉన్నాయి. ఈ పోస్టర్‌లోనే వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. దీంతో సంక్రాంతి బరిలో మరో చిత్రం చేరనట్లయింది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఫొటోగ్రఫీ: అభినందన్ రామానుజం, ఎడిటింగ్: విజయ్ వేలుకుట్టి. ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దినేశ్ నరసింహన్, నిర్మాతలు: నవీన్ యర్నేని, రవిశంకర్.

హిట్ జోడీ... మరోసారి


చిత్ర సీమలో హిట్ జోడీకి ఉండే క్రేజే వేరు. ఒక సినిమాలో నటించిన హీరో, హీరోయిన్ జంట ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటే.. ఆ మ్యాజిక్ మరోసారి కచ్చితంగా రిపీట్ అవుతుందనేది దర్శకనిర్మాతల నమ్మకం. అందుకనే అలాంటి హిట్ కాంబోను మరోసారి తెరపై తీసుకురావడానికి మేకర్స్.. ఆదరించడానికి ప్రేక్షకులు ఎప్పుడూ రెడీగా ఉంటారు. అలా తెలుగుతెరపై క్లిక్ అయి.. ప్రేక్షకుల్ని మరోసారి పలకరించడానికి సిద్ధమవుతున్న జోడీలివే.











'ధమాకా' కాంబో

రవితేజ, శ్రీలీల కలసి నటించిన చిత్రం 'ధమాకా'. ఈ సినిమా వింటేజ్ రవితేజ స్టైల్ యాక్టింగ్‌ని ప్రేక్షకులకి మరోసారి గుర్తుచేయగా.. యంగ్‌బ్యూటీ శ్రీలీలను ఓవర్‌నైట్ స్టార్‌ని చేసి మరిన్ని చిత్రాల్లో అవకాశాలను తెచ్చిపెట్టింది. రవితేజ మార్క్ మాస్ కామెడీ టైమింగ్, శ్రీలీల క్యూట్ పెర్ఫార్మెన్స్ బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించి.. దాదాపు రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టింది. ఈ పెయిర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడటంతో మరోసారి వీరి కలయికలో ఓ చిత్రం రూపొందుతోంది. సితార ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మాణంలో భాను బోగవరపు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'ఆర్‌టీ75' సినిమా వర్కింగ్ టైటిల్.





'ఎక్స్‌ట్రార్డినరీ' జంట

నితిన్, శ్రీలీల కలయికలో వచ్చిన చిత్రం 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్'. వక్కంతం వంశీ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్టైనర్ బాక్సాఫీస్ వద్ద అంచనాలను అందుకోకపోయినా.. నితిన్, శ్రీలీల కాంబోకు మంచి మార్కులే పడ్డాయి. ఇందులో వీరిద్దరి మధ్య ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ బాగా కుదరడంతో వీరి కలయికలో మరో సినిమా తెరకెక్కుతోంది. నితిన్‌తో 'భీష్మ' సినిమా తెరకెక్కించి హిట్ అందుకున్న వెంకీ కుడుముల ఈ సినిమాకు దర్శకుడు. 'రాబిన్‌హుడ్' పేరుతో వస్తోన్న ఈ సినిమాను నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'రాబిన్‌హుడ్' సినిమాతో నితిన్, శ్రీలీల జంట తెరపై ఈ సారి ఎలాంటి మ్యాజిక్ రిపీట్ చేస్తారో చూడాలంటే డిసెంబరు 20 వరకు వెయిట్ చేయక తప్పదు.

మూడోసారి ప్రేక్షకుల మది దోచడానికి

అర్జున్ రెడ్డి వంటి సంచలన విజయం తర్వాత విజయ్ దేవరకొండ నటించిన చిత్రం 'గీతా గోవిందం'. ఈ సినిమాలో విజయ్ సరసన రష్మిక మందన్న మొదటిసారి నటించారు. 2018లో పరశురామ్ దర్శకత్వంలో విడుదలైన ఈ రొమాంటిక్ ఎంటర్టైనర్ ఆ ఏటి మేటి చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. తెరమీద 'గీత' పాత్రలో రష్మిక, 'గోవిందం' పాత్రలో విజయ్ కాంబో ప్రేక్షకుల్ని అంతగా అలరించింది మరి. ఆ తరువాత వారిద్దరూ మరోసారి తెరపై ప్రేమికులుగా కనిపించిన చిత్రం 'డియర్ కామ్రేడ్'. 2019లో విడుదలైన ఈ సినిమా కమర్షియల్‌గా వర్కౌట్ కాకపోయినా.. కల్ట్ హిట్‌గా అభిమానుల మనసుల్లో నిలిచిపోయింది. ఇందులో 'బాబీ'గా విజయ్, 'లిల్లీ'గా రష్మిక ప్రేమికులంటే ఇలానే ఉండాలనేలా మెప్పించారు. ఈ సినిమా తర్వాత వారిద్దరూ రియల్ లైఫ్‌లోనూ ప్రేమలో పడ్డారని కొన్నాళ్లు జోరుగా ప్రచారం సాగింది. 'డియర్ కామ్రేడ్' తరువాత మరోసారి వీళ్లని ఎప్పుడెప్పుడు చూస్తామా అని ప్రేక్షకులు ఎదురుచూశారంటే ఈ కాంబోకున్న క్రేజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రేజీ కాంబో ముచ్చటగా మూడోసారి ప్రేక్షకులను పలకరించను సిద్ధమైంది. విజయ్ దేవరకొండ నటించిన 'టాక్సీవాలా' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాహుల్ సంక్రిత్యాన్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'వీడీ 14'. త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనున్న ఈ చిత్రంతో విజయ్, రష్మిక జోడీ తెరపై ఎలాంటి హంగామా సృష్టిస్తుందో చూడాలని ప్రతీ ఒక్కరూ ఎదురుచూస్తున్నారు.





సూపర్‌హిట్ కొట్టేందుకు మరోసారి...

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య నటించిన 'బేబీ' చిత్రం సూపర్ సక్సెస్‌ను సాధించింది. ఈ ట్రయాంగులర్ లవ్‌స్టోరీని సాయిరాజేశ్ నీలమ్ తెరకెక్కించగా, ఎస్.కే.ఎన్ నిర్మించారు. 2023 జూలైలో విడుదలైన ఈ చిత్రం దాదాపు రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టింది. ఈ న్యూ ఏజ్ లవ్ డ్రామాలో అమాయకుడిగా.. సిన్సియర్ లవర్‌గా ఆనంద్, మొదట బస్తీ అమ్మాయిగా ఉండి.. హఠాత్తుగా మోడరన్ అమ్మాయిగా మారిన వైష్ణవి చైతన్య నటన అందర్నీ మెప్పించింది. నిజం చెప్పాలంటే వీరి పాత్రల్ని మలిచిన తీరే సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. ఈ సూపర్ హిట్ పెయిర్ ఇప్పుడు మరోసారి తెరపై కనువిందు చేయనుంది. రవి నంబూరి తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ స్టేజిలో ఉంది.

'సరిపోదా'తో మరోసారి





నాని నటించిన 'గ్యాంగ్‌లీడర్' చిత్రంతో వెండితెరపైకి ఎంట్రీ ఇచ్చారు ప్రియాంక అరుల్ మోహన్. 2018లో విడుదలైన ఈ సినిమాలో చలాకీ రైటర్‌గా నాని, పక్కింటి అమ్మాయి పాత్రలో ప్రియాంక చక్కగా నటించి ప్రేక్షకులని విశేషంగా ఆకట్టుకున్నారు. విక్రమ్.కె.కుమార్ దర్శకత్వం వహించిన ఈ రివెంజ్ కామెడీ డ్రామా యావరేజ్‌గా నిలిచినప్పటికీ ఈ చిత్రంలో నాని, ప్రియాంక మధ్య వచ్చే సన్నివేశాలు యువతరాన్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. 'హోయ్‌నా హోయ్‌నా', 'నిను చూసే ఆనందంలో' పాటల్లోని వీరి లవ్‌ట్రాక్ ఎంతో చూడముచ్చటగా ఉండి.. ఈ కాంబోని మరోసారి చూడాలని ఎదురుచూసేలా చేశాయి. దాదాపు ఆరేళ్ల తర్వాత నాని, ప్రియాంక మోహన్ వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో వస్తున్న 'సరిపోదా శనివారం'లో మరోసారి తెరపై తళుక్కుమంటున్నారు. ఆగస్టు 29న చిత్రం విడుదలవుతోంది.

ముచ్చటగొలిపేందుకు సిద్ధం

నాగచైతన్య, సాయిపల్లవి 2021లో విడుదలైన 'లవ్‌స్టోరీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలోని చైతన్య, సాయిపల్లవి జోడీ అందరినీ ముచ్చటగొలిపింది. సినిమాలో వీరి ప్రేమకథను చూసినవారందరూ ఈ జంటకు 'ఫిదా' అయిపోయారు. తెరపై లవర్స్‌గా సక్సెస్ కొట్టేసిన వీరిద్దరూ మూడేళ్ల తర్వాత మరోసారి నటించడానికి సిద్ధమయ్యారు. చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'తండేల్' మూవీలో నాగచైతన్య జాలరి పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్ర టీజర్.. ముఖ్యంగా అందులోని బుజ్జి తల్లి వచ్చేస్తున్నా కదే.. కాస్త నవ్వే అనే డైలాగ్ సినిమాలో వీరిద్దరి మధ్య అద్భుతమైన లవ్‌స్టోరీ ఉండబోతోందంటూ ప్రేక్షకులకు హింటిచ్చింది.

ఇక్కడే నా జీవితం మొదలైంది

- రష్మిక భావోద్వేగం



ఒక పక్క అల్లు అర్జున్, ఇంకో పక్క ధనుష్, ఆ పక్క సల్మాన్‌ఖాన్. ఇవీ కాకుండా జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ చిత్రంలోనూ, ప్రభాస్ 'స్పిరిట్' సినిమాలోనూ ఆమె హీరోయిన్ అంటున్నారు. అలాగే 'గర్ల్‌ఫ్రెండ్' పేరుతో చేస్తున్న లేడీ ఓరియంటెట్ సినిమా ఉండే ఉంది. ఇలా వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో రష్మిక హవా మాములుగా లేదు. ఇంత బిజీగా ఉన్న ఆమె తీరిక చేసుకుని చిన్ననాటి స్నేహితురాలు వివాహానికి తను పుట్టి పెరిగిన ఊరు 'కొడగు' వెళ్లింది. కర్నాటక రాష్ట్రంలోని ఆ ప్రాంతానికి వెళ్లగానే బాల్య స్మృతులు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో భావోద్వేగానికి లోనయ్యారు. 'కొడగు.. నా హృదయం, నా చరిత్ర. జీవితం ఇక్కడే మొదలైంది' అంటూ ఈ సందర్భంగా దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. చిన్ననాటి స్నేహితురాళ్లను కలుసుకొని ఆ నాటి ముచ్చట్లను గుర్తు చేసుకుని మురిసిపోయింది.

చిత్ర పరిశ్రమకు మంచి రోజులు

- ఎన్వీ ప్రసాద్



గడ్డుపరిస్థితుల్లో ఉన్న చిత్రపరిశ్రమకు మంచి రోజులు వచ్చాయని ప్రముఖ నిర్మాత, ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు ఎన్వీ ప్రసాద్ అన్నారు. గురువారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ ప్రపంచంలోనే ఉన్నతస్థితికి చేరిందన్నారు. గతంలో రాజకీయ హింసలకు గురై దినదినగండంగా ఉండేదని గుర్తుచేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్‌లతో చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. 'కల్కి' సినిమా సంచలన విజయం సాధించడం శుభపరిణామమన్నారు. కూటమి విజయంవలే సినీ పరిశ్రమ కూడా 'కల్కి'తో మంచి విజయాన్ని అందుకుందన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలను కలిసి సినీ పరిశ్రమకు ఒకేరకమైన విధివిధానాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్టు చెప్పారు. ఏపీలో కూడా సినీ పరిశ్రమ వికసిస్తుందన్నారు. ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుగు పరిశ్రమ అందిపుచ్చుకుందని, రాష్ట్రంలో కూడా తెలుగు సినిమాల షూటింగులు విరివిగా జరుపుకోనున్నాయన్నారు. ఇక్కడ స్టూడియోలు లేకపోయినా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో తాత్కాలిక సెట్లు వేసుకుని షూటింగులు చేసుకోవచ్చని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

- తిరుపతి (ఆంధ్రజ్యోతి)



రిలీజ్ డేట్ వచ్చేసింది



తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను గురువారం మేకర్స్ ప్రకటించారు. దసరా కానుకగా అక్టోబర్ 10న చిత్రం దాదాపు పది భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. దిశాపటాని, యోగిబాబు, బాబీడియోల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కంగువ' సినిమాను భారీ బడ్జెట్‌తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. అలాగే రజనీకాంత్ నటించిన 'వేట్టయాన్' చిత్రం కూడా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఈ విషయాన్ని రజనీకాంత్ స్వయంగా ప్రకటించారు. ఇలా అగ్ర హీరోలు ఇద్దరు నటించిన రెండు భారీ చిత్రాలు ఒకే రోజు విడుదల కానుండటంతో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

'కల్కి' టీమ్‌కు థ్యాంక్స్



దర్శకుడిగా ఎన్నో సంచలన చిత్రాలను తెరకెక్కించి ఎంతో మంది నూతన దర్శకులకు ఆదర్శంగా నిలిచిన రామ్‌గోపాల్‌వర్మ.. 'కల్కి 2898 ఏ.డీ' సినిమాతో కొత్త అవతారం ఎత్తారు. గురువారం విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకున్న ఈ చిత్రంలో ఆయన ఓ అతిధి పాత్రలో మెరిశారు. ఇన్నేళ్ల సినీరంగంలో ఉన్న ఆయన.. ఓ సినిమాలో నటించడం మాత్రం ఇదే ప్రధమం. ఇందులో ఆయన పాత్ర చిన్నదైనా ఎంతో వినోదాత్మకంగా ఉందని సినిమా చూసిన వారంతా అనడం విశేషం. ఈ సందర్భంగా చిత్రబృందానికి, డైరెక్టర్‌కి థ్యాంక్స్ చెప్పి.. ఇందులో నటించిన వారందరినీ ప్రశంసించారు. ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్టుకు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీ దత్ నిర్మించిన ఈ చిత్ర కథ మహాభారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగేలా తెరకెక్కింది.

అఫ్ఘాన్ కల చెదిరె..


కోచ్ ట్రాట్‌తో అఫ్ఘాన్ కెప్టెన్ రషీద్

సఫారీలు ఫైనల్ చేరె!



విజృంభించిన పేస్ త్రయం

9 వికెట్లతో దక్షిణాఫ్రికా జయభేరి

టరోబా (ట్రినిడాడ్): దక్షిణాఫ్రికా.. ఎట్టకేలకు ఐసీసీ టోర్నీలో సెమీస్ గండాన్ని దాటింది. చోకర్స్‌గా ముద్రపడిన సఫారీ బృందం తొలిసారి టీ20 వరల్డ్‌కప్ తుది పోరుకు దూసుకెళ్లింది. పేసర్లు నిప్పులు చెరగడంతో.. గురువారం జరిగిన సెమీఫైనల్-1లో దక్షిణాఫ్రికా 9 వికెట్లతో అఫ్ఘానిస్థాన్‌పై ఘనవిజయం సాధించింది. టోర్నీలో సంచలన ప్రదర్శనతో నాకౌట్‌కు చేరిన అఫ్ఘాన్ ఈ మ్యాచ్‌లో ఓడినా.. సగర్వంగా స్వదేశానికి తిరిగి వెళ్లనుంది. పేసర్లు మార్కో జెన్సన్ (3/16), రబాడ (2/14), నోకియా (2/7) టాప్ లేపడంతో.. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘాన్ 11.5 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. టీ20ల్లో తమ అత్యల్ప స్కోరు నమోదు చేసింది. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (10) టాప్ స్కోరర్ అంటే అఫ్ఘాన్ బ్యాటింగ్ ఎంత ఘోరంగా సాగిందో అర్థమవుతోంది. స్పిన్నర్ షంసీ 3 వికెట్లు తీశాడు. స్వల్ప లక్ష్యాన్ని సౌతాఫ్రికా 8.5 ఓవర్లలో 60/1 స్కోరు చేసి సునాయాసంగా నెగ్గింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ డికాక్ (5)ను ఫరూఖీ బౌల్డ్ చేసి షాకిచ్చాడు. కానీ, మరో ఓపెనర్ హెండ్రిక్స్ (29 నాటౌట్), కెప్టెన్ మార్‌క్రమ్ (23 నాటౌట్) అభేద్యంగా 43 బంతుల్లో 55 పరుగులు జోడించారు. దీంతో దక్షిణాఫ్రికా మరో 67 బంతులు మిగిలుండగానే అలవోకగా విజయాన్ని అందుకొంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా జెన్సన్ నిలిచాడు.


జెన్సన్

పెవిలియన్‌కు క్యూ..: సెమీస్ చేరేందుకు సర్వశక్తులూ ఒడ్డిన అఫ్ఘాన్.. కీలక మ్యాచ్‌లో కనీస పోరాటం కూడా చేయకుండా చేతులెత్తేసింది. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడంలో అఫ్ఘాన్ బ్యాటర్ల అనుభవలేమి బహిర్గతమైంది. సఫారీ బౌలర్ల దెబ్బకు టపటపా వికెట్లు రాలుతుంటే.. ఎలా అడ్డుకట్టవేయాలో కూడా వారికి బోధపడలేదు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న అఫ్ఘాన్ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ (0)ను ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే క్యాచవుట్ చేసిన జెన్సన్.. ప్రత్యర్థి పతనానికి నాంది పలికాడు. గుల్బదిన్ నైబ్ (9), జద్రాన్ (2), నబీ (0), ఖరోట్ (2) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో.. పవర్ ప్లేలో 28 పరుగులకు 5 కీలక వికెట్లను చేజార్చుకొన్న అఫ్ఘాన్ ఏదశలోనూ కోలుకోలేదు. ఒమర్‌జాయ్‌ను నోకియా క్యాచవుట్ చేయగా.. జనత్ (8)ను షంసీ ఎల్బీ చేశాడు. ఆదుకొంటాడనుకొన్న కెప్టెన్ రషీద్ (8)ను నోకియా పెవిలియన్ చేర్చడంతో అఫ్ఘాన్ పోరాటం ముగిసింది. నూర్ అహ్మద్ (0), నవీనుల్ (2)ను అవుట్ చేసిన షంసీ అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

స్కోరుబోర్డు

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్ (సి) హెండ్రిక్స్ (బి) జెన్సన్ 0, ఇబ్రహీం జద్రాన్ (బి) రబాడ 2, నైబ్ (బి) జెన్సన్ 9, ఒమర్‌జాయ్ (సి) స్టబ్స్ (బి) నోకియా 10, నబీ (బి) రబాడ 0, ఖరోట్ (సి) డికాక్ (బి) జెన్సన్ 2, జనత్ (ఎల్బీ) షంసీ 8, రషీద్ (బి) నోకియా 8, నూర్ అహ్మద్ (ఎల్బీ) షంసీ 0, నవీనుల్ (ఎల్బీ) షంసీ 2, ఫరూఖీ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 11.5 ఓవర్లలో 56 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-4, 2-16, 3-20, 4-20, 5-23, 6-28, 7-50, 8-50, 9-50; **బౌలింగ్:** జెన్సన్ 3-0-16-3, కేశవ్ మహరాజ్ 1-0-6-0, రబాడ 3-1-14-2, నోకియా 3-0-7-2, షంసీ 1.5-0-6-3.

సౌతాఫ్రికా: డికాక్ (బి) ఫరూఖీ 5, హెండ్రిక్స్ (నాటౌట్) 29, మార్‌క్రమ్ (నాటౌట్) 23; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 8.5 ఓవర్లలో 60/1; వికెట్ పతనం:** 1-5; **బౌలింగ్:** నవీనుల్ 3-0-15-0, ఫరూఖీ 2-0-11-1, రషీద్ ఖాన్ 1-0-8-0, ఒమర్‌జాయ్ 1.5-0-18-0, నైబ్ 1-0-8-0.

ఐసీసీ వరల్డ్‌కప్‌ల్లో ఆడిన 8 సెమీ ఫైనల్ మ్యాచ్‌ల్లో సౌతాఫ్రికా నెగ్గడం ఇదే తొలిసారి. ఆరుసార్లు ఓడగా.. 1999లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ టైగా ముగిసింది.

1 మిగిలి ఉన్న బంతుల పరంగా (67) టీ20ల్లో దక్షిణాఫ్రికాకు ఇదే అతిపెద్ద విజయం. 2007లో పాకిస్థాన్‌పై 51 బంతులు మిగిలుండగా గెలిచింది.

అఫ్ఘాన్ చేసిన 56 పరుగులు.. టీ20 వరల్డ్‌కప్ సెమీస్ మ్యాచ్‌ల్లో అత్యల్పం.

టీ20 వరల్డ్‌కప్‌లో అత్యల్ప స్కోర్లు

55- 2021	లో ఇంగ్లండ్‌పై వెస్టిండీస్
56- 2024	లో సౌతాఫ్రికాపై అఫ్ఘానిస్థాన్
60-2014	లో శ్రీలంకపై న్యూజిలాండ్
70- 2016	లో న్యూజిలాండ్‌పై బంగ్లాదేశ్

ఎప్పటికీ గుర్తుంచుకొంటాం: కెప్టెన్ రషీద్

ఈ వరల్డ్‌కప్‌ను ఎప్పటికీ గుర్తుంచుకొంటాం. జట్టులోని ప్రతి ఒక్కరూ ఎంతో శ్రమించారు. ఎంతటి జట్టునైనా ఓడించగలమన్న ఆత్మవిశ్వాసం కలిగింది. మా టీమ్‌ను చూసి ఎంతో గర్విస్తున్నా. తర్వాతి మెగా ఈవెంట్‌కు మరింత బలంగా బరిలోకి దిగుతాం.

ఇదేంపిచ్ అఫ్ఘాన్ కోచ్ ట్రాట్

పిచ్‌పై అఫ్ఘాన్ కోచ్ జొనాథన్ ట్రాట్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. సెమీస్ మ్యాచ్‌కు ఇలాంటి వికెట్‌ను ఎంపిక చేయడం సరికాదని అభిప్రాయపడ్డాడు. 'మాకు విజయం దక్కలేదన్న అక్కసుతో చెప్పడంలేదు. సెమీస్ స్థాయి మ్యాచ్‌కు ఇది తగిన పిచ్ కాదు. ఇరుజట్ల మధ్య న్యాయమైన పోరాటం జరగాలి. కానీ, బంతిని ఆడేందుకు బ్యాటర్లు ఎంతగా ఇబ్బందులు పడ్డారో మ్యాచ్‌ను చూసిన ప్రతి ఒక్కరికీ అర్థమవుతుంది. టీ20 క్రికెట్ అంటే బ్యాటర్లు ఎదురుదాడి చేయడం.. వికెట్లను కాపాడుకోవడం కాదు. అఫ్ఘాన్ తక్కువ స్కోరు చేయడం వల్ల సౌతాఫ్రికా నెగ్గింది. అంతేకానీ అసలు సిసలు పోరు జరగనేలేదు' అని ట్రాట్ అన్నాడు.

రెండేళ్ల క్రితం టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్.. 169 పరుగుల ఛేదనను ఇంగ్లండ్ ఓపెనర్లే మెరుపు ఆటతీరుతో ముగించి భారత్‌కు ఘోర ఓటమిని అందించారు. ఇప్పుడు అదే టోర్నీ సెమీఫైనల్.. ఇంగ్లండ్ ముందు 172 పరుగుల లక్ష్యం. ఈసారి ఏమవుతుందో అని ఓవైపు ఫ్యాన్స్ ఆందోళనపడినా.. భారత స్పిన్ ద్వయం కుల్దీప్ యాదవ్ (3/19), అక్షర్ పటేల్ (3/23) తమ సుడులు తిరిగే బంతులతో బట్లర్ సేనకు ఉచ్చు బిగించారు. దీంతో విలవిల్లాడిన ప్రత్యర్థి ఛేదనకు ఎంతో దూరంలో నిలిచిపోగా.. అటు భారత్ దశాబ్దం తర్వాత తుది పోరుకు అర్హత సాధించింది.

స్పిన్‌తో చుట్టేసి..

టైటిల్ పోరుకు భారత్

సెమీస్‌లో ఇంగ్లండ్ చిత్తు


రోహిత్ శర్మ (57)

అక్షర్ (3/23)

రోహిత్ హాఫ్ సెంచరీ

చెలరేగిన అక్షర్, కుల్దీప్

గయానా: టీ20 వరల్డ్‌కప్‌లో జైత్రయాత్ర సాగిస్తోన్న టీమిండియా ఆశించినట్టుగానే.. ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఏకపక్షంగా ముగిసిన రెండో సెమీస్‌లో ఇంగ్లండ్ జట్టును 68 రన్స్ తేడాతో భారత్ చిత్తుగా ఓడించింది. అలాగే 2007, 2014 తర్వాత తుదిపోరుకు అర్హత సాధించిన భారత జట్టు శనివారం దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో తలపడనుంది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. రోహిత్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 57), సూర్యకుమార్ (36 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 47), హార్దిక్ (13 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 23) రాణించారు. జోర్డాన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ 16.4 ఓవర్లలో 103 పరుగులకు కుప్పకూలింది. హ్యారీ బ్రూక్ (25), బట్లర్ (23) మాత్రమే ఆకట్టుకున్నారు. బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అక్షర్ నిలిచాడు.

స్పిన్‌కు దాసోహం

ఛేదన కోసం బరిలోకి దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు స్లో బంతులతో పాటు తక్కువ ఎత్తులో వచ్చిన బౌన్స్‌తో ఉక్కిరిబిక్కిరయ్యారు. ముఖ్యంగా స్పిన్నర్ అక్షర్ పటేల్ తన మ్యాజిక్ బంతులతో టాపార్డర్ నడ్డివిరవగా, ఆ తర్వాత కుల్దీప్ చెలరేగాడు. వీరి బౌలింగ్‌లో స్వీప్ షాట్లకు వెళ్లిన బ్యాటర్లు మూల్యం చెల్లించుకున్నారు. మూడో ఓవర్‌లో బట్లర్ మూడు ఫోర్లతో కాస్త భయపెట్టినా.. ఆ తర్వాత వికెట్ల పతనం కొనసాగింది. అక్షర్ తన తొలి బంతికే కీలక బట్లర్ వికెట్ తీయగా.. ఫిలిప్ సాల్ట్ (5)ను పేసర్ బుమ్రా అవుట్ చేయడంతో భారత శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. ఇక బెయిర్‌స్టో (0), మొయిన్ అలీ (8)లను అక్షర్ తన వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో ఇంగ్లండ్ 46/4 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడింది. మరో ఎండ్‌లో చైనామన్ కుల్దీప్ తన హవా చూపాడు. సామ్ కర్రాన్ (2)తో పాటు ఫామ్‌లో ఉన్న హ్యారీ బ్రూక్‌ను సైతం కుల్దీప్ అవుట్ చేయడంతో ఇక బట్లర్ సేన ఓటమి ఖరారైంది.


కుల్దీప్ (3/19)

రోహిత్-సూర్య అండగా..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. అయితే కెప్టెన్ రోహిత్ శర్మ వరుసగా రెండో హాఫ్ సెంచరీతో ఫామ్‌ను చాటుకోగా.. విడిలార్డర్‌లో సూర్యకుమార్, హార్దిక్ మెరుపులతో జట్టు సవాల్ విసిరే స్కోరందుకుంది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు రషీద్, లివింగ్‌స్టోన్ కట్టడి చేశారు. గతంలో మూడు టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌ల్లో అర్ధసెంచరీలు సాధించిన విరాట్ (9) తన పేలవ ఫామ్‌ను మళ్లీ చాటుకున్నాడు. మూడో ఓవర్‌లో ఓ అద్భుత సిక్సర్‌తో అదుర్స్ అనిపించి అదే ఓవర్‌లో టోప్లే బంతికి బౌల్డ్ అయ్యాడు. రోహిత్ మాత్రం ఎప్పట్లాగే ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగాడు. ఐదో ఓవర్‌లో తను రెండు ఫోర్లతో ఆకట్టుకోగా, పంత్ (4)ను సామ్ కర్రాన్ అవుట్ చేశాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 46/2 స్కోరుతో నిలిచింది. అయితే కెప్టెన్‌కు సూర్యకుమార్ జత కలవడంతో పరుగుల్లో వేగం పెరిగింది. ఏడో ఓవర్‌లో సూర్య తన దైన శైలిలో ఫైన్ లెగ్ వైపు సిక్స్ బాదాడు. అయితే 8 ఓవర్లు ముగిసిన వెంటనే కాసేపు భారీ వర్షం కురిసింది. వర్షం తగ్గినా మైదానం తడిగా ఉండడంతో 75 నిమిషాల పాటు మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. అనంతరం రోహిత్-సూర్య జోడీ అడపాదడపా భారీ షాట్లతో చెలరేగింది. 13వ ఓవర్‌లో రోహిత్ 6, సూర్య 6,4తో 19 రన్స్ రాగా స్కోరు కూడా 100 దాటింది. 36 బంతుల్లో అర్ధసెంచరీ సాధించిన రోహిత్‌ను స్పిన్నర్ రషీద్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు మరో ఓవర్ వ్యవధిలోనే సూర్యకుమార్ వికెట్‌ను పేసర్ ఆర్చర్ పడగొట్టాడు. చాలా ఎత్తుగా గాల్లోకి లేచిన క్యాచ్‌ను లాంగాన్‌లో జోర్డాన్ అందుకున్నాడు. ఈ దశలో బౌలర్లు కట్టుదిట్టమైన బంతులు వేయడంతో 14-17 ఓవర్ల మధ్య పరుగులు నెమ్మదించాయి. 18వ ఓవర్‌లో హార్దిక్ చెలరేగి వరుసగా రెండు సిక్సర్లతో గేరు మార్చే ప్రయత్నం చేశాడు. కానీ పేసర్ జోర్డాన్ హార్దిక్‌తో పాటు దూబేను గోల్డెన్ డకౌట్‌గా పెవిలియన్‌కు చేర్చి భారత్‌కు షాకిచ్చాడు. అయితే 19వ ఓవర్‌లో జడేజా (17 నాటౌట్) రెండు ఫోర్లతో 12 రన్స్ రాబట్టగా.. ఆఖరి ఓవర్‌లో అక్షర్ (10) సిక్సర్ బాది అవుటైనా.. భారత్ స్కోరు 170 దాటగలిగింది.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (బి) రషీద్ 57, కోహ్లీ (బి) టోప్లే 9, పంత్ (సి) బెయిర్‌స్టో (బి) కర్రాన్ 4, సూర్యకుమార్ (సి) జోర్డాన్ (బి) ఆర్చర్ 47, హార్దిక్ (సి) కర్రాన్ (బి) జోర్డాన్ 23, జడేజా (నాటౌట్) 17, దూబే (సి) బట్లర్ (బి) జోర్డాన్ 0, అక్షర్ పటేల్ (సి) సాల్ట్ (బి) జోర్డాన్ 10, అర్ష్‌దీప్ సింగ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 171/7; వికెట్ల పతనం:** 1-19, 2-40, 3-113, 4-124, 5-146, 6-146, 7-170; **బౌలింగ్:** టోప్లే 3-0-25-1, ఆర్చర్ 4-0-33-1, కర్రాన్ 2-0-25-1, రషీద్ 4-0-25-1, జోర్డాన్ 3-0-37-3, లివింగ్‌స్టోన్ 4-0-24-0.

ఇంగ్లండ్: సాల్ట్ (బి) బుమ్రా 5, బట్లర్ (సి) పంత్ (బి) అక్షర్ 23, మొయిన్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 8, బెయిర్‌స్టో (బి) అక్షర్ 0, బ్రూక్ (బి) కుల్దీప్ 25, కర్రాన్ (ఎల్బీ) కుల్దీప్ 2, లివింగ్‌స్టోన్ (రనౌట్) 11, జోర్డాన్ (ఎల్బీ) కుల్దీప్ 1, ఆర్చర్ (ఎల్బీ) బుమ్రా 21, రషీద్ (రనౌట్) 2, టోప్లే (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 16.4 ఓవర్లలో 103 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-26, 2-34, 3-35, 4-46, 5-49, 6-68, 7-72, 8-86, 9-88, 10-103; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 2-0-17-0, బుమ్రా 2.4-0-12-2, అక్షర్ 4-0-23-3, కుల్దీప్ 4-0-19-3, జడేజా 3-0-16-0, హార్దిక్ 1-0-14-0.

1 ఈ మెగా టోర్నీలో ఇంగ్లండ్ తరఫున ఎక్కువ వికెట్లు (31) తీసిన బౌలర్లుగా ఆదిల్ రషీద్, జోర్డాన్

2 టీ20 వరల్డ్‌కప్‌ల్లో అధిక సిక్సర్లు (50) బాదిన రెండో బ్యాటర్‌గా రోహిత్. గేల్ (63) ముందున్నాడు.

జార్జియా పెను సంచలనం

పోర్చుగల్‌కు షాక్

నాకౌట్‌లో ప్రవేశం

యూరో చాంపియన్‌షిప్

గ్లెసెన్‌కిర్చెన్ (జర్మనీ): అరంగేట్ర జట్టు జార్జియా అదరగొట్టింది. సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో కెప్టెన్సీలోని పోర్చుగల్‌కు షాకిచ్చి యూరోపియన్ చాంపియన్‌షిప్ చరిత్రలో పెను సంచలనం సృష్టించింది. గ్రూప్ 'ఎఫ్'లో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో జార్జియా 2-0తో పోర్చుగల్‌ను చిత్తు చేసింది.. తద్వారా జార్జియా రౌండ్-16లో అడుగు పెట్టింది. అయితే పోర్చుగల్ ఇప్పటికే నాకౌట్‌కు చేరినందున ఈ పరాజయం ప్రభావం ఆ జట్టుపై పడలేదు. కానీ కీలకమైన ప్రీక్వార్టర్ ఫైనల్‌కు ముందు ఈ ఓటమి పోర్చుగల్ ఆటతీరును ప్రభావితం చేసే అవకాశం లేకపోలేదు. ఈ గ్రూపు నుంచి పోర్చుగల్, తుర్కియే చెరో ఆరేసి పాయింట్లతో నాకౌట్‌కు చేరగా..మూడో అత్యుత్తమ జట్టుగా జార్జియా కూడా ముందంజ వేసింది. నాకౌట్‌కు చేరాలంటే తప్పక గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో జార్జియా కసిగా ఆడింది. యువ ఆటగాడు ఖ్విచా కర్ట్స్‌కెలియా రెండో నిమిషంలోనే గోల్ చేసి పోర్చుగల్ దిమ్మతిరిగేలా చేశాడు. ప్రత్యర్థి రక్షణశ్రేణిని గందరగోళంలో పడేసిన ఖ్విచా జార్జియా ఖాతా తెరిచాడు. అనంతరం జార్జెస్ మికాడ్జే 57వ నిమిషంలో పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచాడు. ఇదే గ్రూపులో జరిగిన మరో మ్యాచ్‌లో తుర్కియే 2-1తో చెక్ రిపబ్లిక్‌ను ఓడించింది. ఈ ఓటమితో చెక్ జట్టు ఇంటిదారి పట్టింది. మరోవైపు జార్జియా విజయం..గ్రూప్ 'ఎ'లో మూడో స్థానంలో నిలిచిన హంగేరి జట్టును టోర్నీ నుంచి తిరుగుముఖం పట్టించింది. కాగా..నాకౌట్ సమరం శనివారం ప్రారంభం కానుంది. తొలి రోజు మ్యాచ్‌ల్లో స్విట్జర్లాండ్-ఇటలీ, జర్మనీ-డెన్మార్క్ తలపడతాయి.


గోల్ కొట్టిన ఆనందంలో కర్ట్స్‌కేలియా

పదేళ్ల తర్వాత తొలిసారి..


లారా వోల్వార్ట్

భారత్ X దక్షిణాఫ్రికా ఢీ

నేటినుంచి చెన్నైలో ఏకైక టెస్ట్

ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్ 18లో



చెన్నై: మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి ఆత్మవిశ్వాసంతో ఉన్న భారత మహిళలు శుక్రవారం ఇక్కడ ప్రారంభమయ్యే ఏకైక టెస్ట్‌లో దక్షిణాఫ్రికాను ఢీకొనేందుకు సై అంటున్నారు. దశాబ్దం తర్వాత భారత్-సౌతాఫ్రికా జట్లు టెస్ట్ మ్యాచ్‌లో తలపడుతుండడం గమనార్హం. చివరిసారి 2014లో మైసూరులో ఆడిన టెస్ట్‌లో మన మహిళలు 34 పరుగులతో నెగ్గారు. ఇకపోతే.. మన మహిళల క్రికెట్ సిరీస్‌లలో క్రమం తప్పకుండా టెస్ట్‌లు లేని నేపథ్యంలో..సఫారీలతో ఈ మ్యాచ్‌లో ఐదుగురు క్రీడాకారిణులు అరంగేట్రం చేసేందుకు ఎదురు చూస్తున్నారు. ఉమా ఛెత్రి, ప్రియా పూనియా, సైకా ఇషాఖ్, తెలుగు క్రికెటర్లు అరుంధతి రెడ్డి, షబ్నమ్ షకీల్ వీరిలో ఉన్నారు. మరోవైపు భారత జట్టు చివరిసారి గత డిసెంబరులో టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లతో జరిగిన ఒక్కో టెస్ట్‌లో మనోళ్లు విజయం సాధించారు. దక్షిణాఫ్రికాపై వన్డే సిరీస్‌లో బ్యాటింగ్‌లో అదరగొట్టిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్, వైస్-కెప్టెన్ మంధాన అదే జోరు కొనసాగిస్తారని భారత్ భావిస్తోంది. ఇంగ్లండ్, ఆసీస్‌తో టెస్ట్ మ్యాచ్‌లలో అద్భుతంగా రాణించిన జెమీమా కూడా సత్తా చాటాలి. ఇక షఫాలీ వర్మ, దీప్తిశర్మ.. ప్రస్తుతం టెస్ట్‌ల్లో భారత్ తరఫున అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్లలో రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. వీరు కూడా బ్యాట్ ఝుళిపిస్తే భారత్‌కు తిరుగుండబోదు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లను వణికించిన దీప్తిశర్మ, పూజా వస్త్రాకర్ ఆ ప్రదర్శను పునరావృతం చేస్తారని ఆశిస్తోంది. చెపాక్ పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండడంతో.. స్నేహ్ రాణా ఆఫ్ స్పిన్‌ను ఎదుర్కోవడం సఫారీలకు సవాలే. రెండేళ్లలో కేవలం ఒక టెస్టే ఆడిన సౌతాఫ్రికా జట్టులో కూడా ఐదుగురు క్రికెటర్లు ఈ ఫార్మాట్‌లో అరంగేట్రానికి సిద్ధంగా ఉన్నారు. కెప్టెన్ వోల్వార్ట్, ఆల్‌రౌండర్లు సునె లుస్, డెల్మీ టకర్, బౌలర్లు క్లాస్, అనెకా బాష్, మ్లాబా కీలకం కానున్నారు. చెపాక్ పిచ్‌పై ఎప్పుడో 1976లో ఏకైక మహిళా టెస్ట్ మ్యాచ్ జరిగింది. భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన ఆ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ కౌర్, (కెప్టెన్), స్మృతీ మంధాన, షఫాలీ వర్మ/ప్రియా పూనియా, సుభా సతీష్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, అరుంధతి రెడ్డి, పూజా వస్త్రాకర్/రేణుకా ఠాకూర్, రాజేశ్వరీ గైక్వాడ్.

దక్షిణాఫ్రికా: లారా వోల్వార్ట్ (కెప్టెన్), అనేకె బాష్, సునే లుస్, తజ్మిన్ బ్రిట్స్, మరిజానే కాప్, డెల్మీ టకెర్, డి క్లెర్క్, సినాలో జఫ్టా, మ్లాబా, మసబాటా క్లాస్, టుమి సెఖుకునే/డెర్క్‌సెన్.

పాహల్‌కు ఒలింపిక్ బెర్త్



పంచకుల (హరియాణా): మహిళల 400 మీటర్ల రేసులో కిరణ్ పాహల్ పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకుంది. గురువారం ఇక్కడ జరిగిన జాతీయ అంతరాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాహల్ 400 మీటర్ల సెమీఫైనల్లో 50.92 సెకన్లలో గమ్యాన్ని చేరుకొని ఫైనల్ చేరింది. దీంతో పారిస్ క్రీడల క్వాలిఫయింగ్ మార్క్ అయిన 50.95 సెకన్ల టైమింగ్‌ను అధిగమించడంతో పాహల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. హరియాణాకు చెందిన పాహల్‌కు ఈ సీజన్‌లో ఇదే అత్యుత్తమ టైమింగ్.

శ్రీలంక క్రికెట్ చీఫ్ కోచ్ రాజీనామా

కొలంబో: టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక జట్టు పేలవ ప్రదర్శన నేపథ్యంలో హెడ్ కోచ్ క్రిస్ సిల్వర్‌వుడ్ తప్పుకొన్నాడు. కన్సల్టింగ్ కోచ్‌గా జయవర్ధనె వైదొలిగినప్పుడే సిల్వర్‌వుడ్ కూడా రాజీనామా చేస్తాడని భావించారు.ప్రస్తుతం జరుగుతున్న పొట్టికప్‌లో లంక సూపర్-8కు కూడా చేరలేదు. 2022లో లంక కోచ్‌గా సిల్వర్‌వుడ్ బాధ్యతలు చేపట్టాడు. అతడి హయాంలో శ్రీలంక 2023 ఆసియాకప్ ఫైనల్ చేరింది. అయితే, వన్డే వరల్డ్‌కప్‌లో చెత్తగా ఆడింది.

నాకంటే వెయ్యి రెట్లు ఉత్తమం

బుమ్రాకు కపిల్ ప్రశంస





న్యూఢిల్లీ: స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై భారత క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ ప్రశంసల వర్షం కురిపించాడు. తాజా ప్రపంచకప్‌లో అతడు వైవిధ్యమైన బంతులతో ఆకట్టుకుంటున్నాడని తెలిపాడు. అందుకే బుమ్రా తన కంటే వెయ్యి రెట్లు అద్భుతమైన బౌలర్‌గా కితాబిచ్చాడు. ఇప్పటి ఆటగాళ్లలో చక్కటి నైపుణ్యం ఉందని, అనుభవం గడించేకొద్దీ మరింత రాటుదేలుతారని తేల్చాడు. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంలోనూ తీవ్రంగా శ్రమిస్తుండడం శుభ పరిణామమని, అంతర్జాతీయ క్రికెట్‌లో గొప్ప ఆటగాళ్లుగా రాణించేందుకు ఇదెంతో దోహదపడుతుందని కపిల్ చెప్పుకొచ్చాడు.


ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌తో బీఆర్‌ఎస్ ఎంపీలు

జగదీప్ ధన్‌ఖడ్‌తో బీఆర్‌ఎస్ ఎంపీల భేటీ

న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఢిల్లీలోని చైర్మన్ చాంబర్‌లో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత సురేశ్ రెడ్డి, ఉప నేత వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ బండి పార్థసారథి రెడ్డి సమావేశమయ్యారు. వారిని ఉపరాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించారు.

హరిత హోటళ్లను ప్రైవేటు పరం చేయొద్దు: చాడ

హైదరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న హరిత హోటళ్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించవద్దని సీఎం రేవంత్ రెడ్డిని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన హరిత హోటళ్లు లాభాల బాటలో నడుస్తున్నాయని, ఇందులో నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన హరిత హోటల్ కూడా ఉందని లేఖలో పేర్కొన్నారు. కడెం ప్రాజెక్టు వద్ద ఉన్న హోటల్‌ను ప్రైవేటు పరం చేయడానికి పర్యాటక శాఖకు చెందిన కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై విజిలెన్స్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీఎంను కోరారు.

ఆయన రాడు.. వచ్చినా చేర్చుకోం!

- ఎర్రబెల్లి కాంగ్రెస్‌లో చేరికపై మంత్రి కొండా సురేఖ

వరంగల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 'ఎర్రబెల్లి దయాకర్‌రావు రాడు.. వచ్చినా మేం కాంగ్రెస్‌లో చేర్చుకోం.. రాజకీయంగా ప్రచారం చేసుకోవడం ఆయనకు అలవాటే. ఆయన అవసరం పార్టీకి ఏం లేదని.. ఈ విషయంపై ఇప్పటికే సీఎం సహా అందరికీ స్పష్టత ఉంది' అని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. హన్మకొండలో ఆమె మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయండి

- తెలంగాణ ప్రభుత్వ నర్సుల సంఘం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వ నర్సుల సంఘం అడ్‌హక్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సంఘం గౌరవాధ్యక్షురాలు సుజావతి, అధ్యక్షురాలు జయమ్మల ఆధ్వర్యంలో జరిగిన కమిటీ సమావేశంలో ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను పెట్టింది. 317 జీఓపై వెంటనే నిర్ణయం తీసుకుని, బాధిత నర్సింగ్ అధికారులకు న్యాయం చేయాలని, సాధారణ బదిలీలు పారదర్శకంగా జరిగేలా చూడాలని, ప్రతి జిల్లాకు ఒక నర్సింగ్ అధికారి పోస్టును ఏర్పాటు చేయాలని, 2021లో విధుల్లో చేరిన నర్సింగ్ ఆఫీసర్లను రెగ్యులరైజ్ చేయాలని, ఇంకా జీతాలు రానివారికి వెంటనే చెల్లించాలని కోరింది.

అక్రమాలు బయటపడతాయనే కేసీఆర్ రావట్లేదు

- మీడియాతో నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలులో అవకతవకలపై న్యాయ విచారణ జరపాలని అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కోరారని, ఇప్పుడు మాజీ సీఎం కేసీఆర్ అసలు విచారణ అవసరం లేదనడంలో ఆంతర్యమేంటని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రశ్నించారు. అప్పుడు కేసీఆర్‌కు చెప్పకుండానే జగదీశ్‌రెడ్డి న్యాయ విచారణ చేయమన్నారా? అని నిలదీశారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అవకతవకలు బహిర్గతమవుతాయని భావించి కేసీఆర్ న్యాయ విచారణకు హాజరుకావడంలేదని ఆరోపించారు. గురువారం అసెంబ్లీ మీడియా హాల్‌లో వీరేశం మీడియాతో మాట్లాడుతూ 'గత రెండ్రోజులుగా కేసీఆర్, జగదీశ్‌రెడ్డి అసత్యాలు మాట్లాడుతున్నారు. 2014కు ముందు జగదీశ్‌రెడ్డి ఆస్తి ఎంత? ఇప్పుడు ఎంత? దీనిపై బహిరంగ చర్చకు రావాలి. పోరాడే తత్వం ఉన్న కేసీఆర్ ఎందుకు డొంక దారి వెతుక్కుంటున్నారు' అని అన్నారు. ఇసుక దందా కోసమే యాదాద్రి ప్లాంట్ అని ఆరోపించారు. నల్లగొండ జిల్లాలో జగదీశ్ రెడ్డికి అవినీతి అక్రమాలపై ఉన్న శ్రద్ధ.. అభివృద్ధిపై లేదన్నారు. జగదీశ్ రెడ్డి మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఫిరాయింపులకు తెరలేపింది కేసీఆర్, జగదీశ్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు.

నిరుద్యోగులతో కేటీఆర్ రాజకీయం: దయాకర్

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకులు నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయం చేయాలని చూస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ఉద్యోగాల ప్రక్రియ కొనసాగిస్తుండగా కేటీఆర్ నిరుద్యోగులతో రాజకీయం చేయడం సిగ్గనిపిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గాంధీభవన్‌లో చనగాని దయాకర్ విలేకరులతో మాట్లాడారు. గ్రూప్ 1 పరీక్ష పేపర్ లీక్ అయినప్పుడు కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో కొనసాగి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు రవాణా ఉద్యోగుల పెన్‌డౌన్

హైదరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలోని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ)పై జరిగిన దాడికి నిరసనగా ఆ శాఖ ఉద్యోగులు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్ చేయనున్నారు. రవాణాశాఖ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆటో యూనియన్ నాయకుడు అమానుల్లాఖాన్ ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలోని హైదరాబాద్ జేటీసీ రమేష్ చాంబర్‌లోకి గురువారం మధ్యాహ్నం అక్రమంగా ప్రవేశించి ఆయనపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిని నిరసిస్తూ ఆందోళనకు దిగిన ఉద్యోగులు అమానుల్లాఖాన్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పెన్‌డౌన్ పాటించనున్నట్లు ప్రకటించారు. కాగా, హైదరాబాద్ జేటీసీపై జరిగిన దాడిని మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. జేటీసీపై దాడి చేసిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

బీజేపీతో ఎవరు కుమ్మక్కయ్యారు?

- మల్కాజ్‌గిరి, పాలమూరులో కమలం ఎలా గెలిచింది?
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గు చేటు: మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): "అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి 32 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. పార్లమెంటు ఎన్నికల్లో అక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 21వేల మెజారిటీనే వచ్చింది. మిగతా ఓట్లను రేవంత్ బీజేపీకి వేయించారా..? సీఎం సొంత నియోజకవర్గమైన మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఎలా విజయం సాధించింది..? రేవంత్‌రెడ్డి మొన్నటి వరకు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో బీజేపీ భారీ మెజారిటీతో ఎలా గెలిచింది..?" అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కయ్యాయని రేవంత్ రెడ్డి ఆరోపించడం సిగ్గు చేటని మండిపడ్డారు. మెదక్‌లో బీజేపీని బీఆర్‌ఎస్ గెలిపించిందని సీఎం స్థాయి వ్యక్తి గాలి మాటలు మాట్లాడటం సరికాదని అన్నారు. గురువారం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు స్పందించారు. మెదక్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే అందులో మూడు చోట్ల బీఆర్‌ఎస్ మెజారిటీ సాధించిందని, రఘునందన్ రావు సొంత నియోజకవర్గం దుబ్బాకలో కూడా బీఆర్‌ఎస్ మెజారిటీ సాధించిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో ఉండి బీజేపీ ఎజెండా అమలు చేస్తున్నారని ఆరోపించారు. నిండు సభలో మోదీని పెద్దన్న అని సంబోధించారని.. పీఎం, సీఎం కుమ్మక్కై సింగరేణిని ప్రైవేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. రెండు జాతీయ పార్టీలు కలిసి ప్రాంతీయ శక్తి అయిన బీఆర్‌ఎస్‌ను టార్గెట్ చేశాయని విమర్శించారు.

..వానొచ్చింది!

- రాష్ట్రంలో వర్షాలతో రైతుల్లో ఆనందం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలుచోట్ల 10 సెం.మీ.పైనే నమోదు
- కుంటాల, పొచ్చెర జలపాతాల పరవళ్లు
- మేడిగడ్డకు 8,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కొద్దిరోజులుగా ముఖం చాటేసిన వరుణుడు కరుణించడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సాగు పనులు ఊపందుకోనున్నాయి. తొలకరి వానలకు నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో పలు చోట్ల మళ్లీ విత్తేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. గురువారం ఉమ్మడి కరీంనగర్‌తో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో వానలు పడ్డాయి. కొన్ని జిల్లాల్లో భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇళ్లలోకి వరద చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ మోస్తరు వర్షం పడటంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో వాహనదారులు సతమతమయ్యారు. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలుచోట్ల 10 సెం.మీ.కు పైనే వర్షపాతం నమోదైంది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో 10.6, అదే జిల్లా మల్యాలలో 10.5, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తిలో 10.4, కరీంనగర్ జిల్లా కేంద్రంలో 10.1, అదే జిల్లా గన్నేరువరంలో 7.9, ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 7.8 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాలలో వెంగల్‌చెరువు మత్తడి దూకింది. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం బుగ్గగూడలో పిడుగు పాటు గిరిజన రైతు ఏదుల మల్లేశ్ ఎద్దు మృతి చెందింది. ఆసిఫాబాద్‌లో గంట పాటు కురిసిన వర్షానికి వరద నీరు రోడ్లపై నిలిచిపోయింది. మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాలలో ఇళ్ల మధ్య వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మల్యాల మండలం రాంపూర్ శివారులో రహదారి కోతకు గురైంది. జగిత్యాల జిల్లా సూరంపేటలో కురిసిన వర్షానికి వరి నారుమళ్లలో ఇసుక మేటలు పెట్టింది. ఇటు ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, పొచ్చెర జలపాతాలు వర్షపు నీటితో పరవళ్లు పెడుతున్నాయి.

మేడిగడ్డకు 8,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మేడిగడ్డ బ్యారేజీకి ప్రాణహిత నుంచి వచ్చే వరద క్రమంగా పెరుగుతోంది. రెండ్రోజుల వరకు బ్యారేజీలోకి వచ్చే ఇన్‌ఫ్లో 4వేల క్యూసెక్కులుండగా గురువారం సాయంత్రానికి 8,800క్యూసెక్కులకు పెరిగింది. మేడిగడ్డ బ్యారేజీలోని కుంగిన 7వ బ్లాకులో చేపట్టిన మరమ్మతులకు సంబంధించి షీట్‌ఫైల్స్, సీసీ బ్లాకుల పునరుద్ధరణ పూర్తవగా దెబ్బతిన్న 20వ గేటు తొలగింపు పనులు 95 శాతం అయిపోయాయి. గ్రౌటింగ్ పనులు పూర్తయినప్పటికీ వాటి కోసం చేసిన రంధ్రాలను మూసివేయాల్సి ఉన్నట్లు తెలిసింది. మేడిగడ్డతో పాటు అన్నారం బ్యారేజీలో మట్టి నమూనాల సేకరణ కోసం చేపట్టిన డ్రిల్లింగ్ పనులు మరో మూడ్రోజుల పాటు కొనసాగనున్నాయి.

సీతారామ ట్రయల్ రన్ సక్సెస్

బీజీ కొత్తూరు పంప్‌హౌస్ నుంచి 9 వేల క్యూసెక్కుల పంపింగ్

- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభం
- నా ఆకాంక్ష నెరవేరబోతోంది: తుమ్మల

ఖమ్మం, జూన్ 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం, అశ్వాపురం: భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో గోదావరిపై నిర్మించిన సీతారామ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ విజయవంతమైంది. గురువారం బీజీ కొత్తూరు వద్ద ఉన్న మొదటి లిఫ్ట్ పంప్ హౌస్‌లోని ఆరు మోటార్లలో ఒకదానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో నీటి పారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి, సీతారామ ఎత్తిపోతల చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి స్విచాన్ చేశారు. దీంతో.. గోదావరి నుంచి గ్రావిటీ కాల్వ ద్వారా పంప్‌హౌస్‌కు చేరిన నీరు ప్రధాన కాలువలోకి దుంకింది. ఈ దృశ్యాన్ని చూసి మంత్రి తుమ్మల హర్షం వ్యక్తం చేశారు. తన ఆకాంక్ష నెరవేరబోతోందన్నారు. అధికారులను అభినందించి భూ మాత, గోదావరి జలాలకు, సీతారామచంద్రస్వామికి నమస్కరించారు. సీతారామకు భూములిచ్చిన రైతుల త్యాగాన్ని కొనియాడారు. వారికి పాదాభివందనం చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ పంప్‌హౌస్ ద్వారా 9 వేల క్యూసెక్కుల గోదావరి జలాలను ఎత్తిపోస్తామన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు అనుసంధానం చేసి సాగర్ ఆయకట్టుకు నీరిస్తామని చెప్పారు. సాగునీటి శాఖ, జిల్లా మంత్రుల సహకారంతో రెండేళ్లలో సీతారామను పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో 10లక్షల ఎకరాలకు నీరిస్తామని వివరించారు. ఆగస్టు నాటికి ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం లిఫ్టులనూ అందుబాటులోకి తెస్తామన్నారు. ఏన్కూర్ లింక్ కెనాల్ పూర్తి చేసి చెరువులను నింపుతామని తెలిపారు. ఇల్లెందుకూ సాగునీరిచ్చే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.


కొత్తగూడెంలో తాగునీటి పథకం పనులకు శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి

ఫలించనున్న మంత్రి తుమ్మల కృషి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7.88 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా దుమ్ముగూడెం (సీతారామ) నుంచి గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించడం తుమ్మల దశాబ్దాల కల. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడే దీనికి కృషి చేశారు. అప్పట్లో సాకారం కాకున్నా, తెలంగాణ ఏర్పడి ఆర్‌అండ్‌బీ మంత్రి అయ్యాక మళ్లీ ప్రయత్నం చేశారు. నాటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి మూడు భారీ లిఫ్టులతో రూ.13,500 కోట్లతో సీతారామ పనులు చేపట్టారు. మూడేళ్లు పనులు వేగంగా జరిగినా 2018 ఎన్నికల్లో తుమ్మల ఓటమి, గత ప్రభుత్వం కాళేశ్వరంపై దృష్టిసారించడంతో సీతారామకు నిధుల కొరత ఏర్పడింది. ఇటీవలి ఎన్నికల్లో గెలిచి మంత్రి అయిన తుమ్మల.. సీఎం రేవంత్ భద్రాచలం వచ్చినప్పుడు సీతారామకు కొద్దిమొత్తంలో నిధులు కేటాయిస్తే ఈ ఏడాదే గోదావరి జలాలను సాగుకు అందించవచ్చని తెలిపారు. సీఎం అంగీకరించడంతో పనులు వేగిరమయ్యాయి. వైరా రిజర్వాయర్‌కు రూ.72 కోట్లు మంజూరు చేయించి ఏన్కూర్ లింక్ కెనాల్ పనులను ప్రారంభించారు. వీటిని ఆగస్టు 15కే పూర్తి చేయనున్నారు. పూసుగూడెం, కమలాపురం పంప్‌హౌస్‌ల ట్రయల్ రన్‌కు చైనాకు చెందిన ఇంజనీర్లను రప్పిస్తున్నారు. ప్రజా ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ ఫలితమే సీతారామ ప్రాజెక్టుకు గోదావరి జలకళ అని కాంగ్రెస్ పేర్కొంది. జనవరి 7న సీఎం రేవంత్ ఈ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారని గుర్తు చేసింది. ఆరు నెలల్లో పూర్తయ్యేలా మంత్రి తుమ్మల కృషి చేశారని వివరించింది.

ఆటంకాలు ఎదురైనా రుణమాఫీ చేస్తాం

కొత్తగూడెంలో ఇంటింటికి తాగునీరు అందించేందుకు అమృత్ పథకం కింద రూ.125కోట్లతో చేపట్టనున్న పథకానికి ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం శ్రీకారం చుట్టారు. బైపాస్ రోడ్డు నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు రూ.4 కోట్లతో డ్రైనేజీ నిర్మాణానికి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. భట్టితో పాటు మంత్రులు మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైనా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపిస్తామన్నారు. రైతు భరోసాపై అసెంబ్లీలో చర్చించి సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.

తెలంగాణకు కేంద్రం సహకరించట్లేదు

- వేలకోట్లు రావాల్సి ఉన్నప్పటికీ ఇవ్వట్లేదు
- రాష్ట్రపతి ప్రసంగంలో కొత్తదనమేమీ లేదు
- బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత సురేశ్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించడం లేదని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రానికి వేల కోట్లు రావాల్సి ఉన్నప్పటికీ ఆ నిధులు ఇవ్వట్లేదన్నారు. గురువారం ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రపతి ప్రసంగంలో కొత్తదనమేమీ లేదని సురేశ్‌రెడ్డి అన్నారు. గత ప్రసంగంలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పారని, అది నేటికీ అమలు కాలేదని, ఇలాంటివి ఎన్నో ఉన్నాయని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయేతోపాటు ఇండియా కూటమికి కూడా బలమిచ్చేలా ఓట్లు వేశారని.. అధికార, ప్రతిపక్షాలు ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. పదేళ్లలో కేసీఆర్ తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా నిలిపారన్నారు. ప్రపంచానికి భారతదేశం విశ్వబంధుగా నిలిచిందని రాష్ట్రపతి చెప్పారని, అలాగే భారత్‌కు తెలంగాణ దేశబంధుగా నిలిచిందని తెలిపారు. లోక్‌సభలో అనేకమంది రాజ్యాంగ ప్రతులను చేతిలో పట్టుకుని ప్రమాణాలు చేశారని, వాటిని పాటించాలని సూచించారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీస్తామని చెప్పారు. ఢిల్లీలో తెలంగాణ గొంతుక వినిపిస్తామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. సింగరేణి తెలంగాణ కొంగు బంగారమని, ఎట్టి పరిస్థితుల్లోనూ సంస్థను ప్రైవేటుపరం కానివ్వబోమని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి సాగునీటి పథకానికి జాతీయ హోదా కల్పించి, నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకుని బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని కోరారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.


నిరుద్యోగ యువకులతో మాట్లాడుతున్న కేటీఆర్

బీజేపీతో రేవంత్ కుమ్మక్కు

- సింగరేణిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర
- సంస్థను ప్రైవేటీకరించేందుకే బొగ్గు వేలం
- నిరుద్యోగులకు కాంగ్రెస్ దగా: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అనాలోచిత నిర్ణయాలకు అనుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఆయన బీజేపీతో కుమ్మక్కయ్యారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆరోపించారు. లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని.. సంస్థను ప్రైవేటీకరించే ప్రయత్నంలో భాగంగా తెలంగాణ బొగ్గు బ్లాకులను కేంద్రం వేలం వేసిందని పేర్కొన్నారు. తర్వాత సింగరేణి నష్టాల్లో ఉందంటూ పెట్టుబడుల ఉపసంహరణకు సిద్ధమవుతోందని ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంత పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో కేటీఆర్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సింగరేణి అభివృద్ధికి కృషి చేశామని, కేంద్రం ఒత్తిడి తెచ్చినా.. తెలంగాణ బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా ఆపగలిగామని తెలిపారు. కార్మికులతో కలిసి బీఆర్‌ఎస్ ఉద్యమించి సింగరేణిని కాపాడుకుంటుందని, ఇందుకుగాను ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని కేటీఆర్ వెల్లడించారు. 'అధికారం చేపట్టగానే మెగా డీఎస్సీ వేస్తాం. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలు పెడతాం. గ్రూప్-2లో రెండు వేలు, గ్రూప్-3లో 3 వేల ఉద్యోగాలు పెంచుతాం' అన్న రేవంత్‌రెడ్డి హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసిందని ఆరోపించారు. గురువారం నందినగర్‌లోని తన నివాసంలో నిరుద్యోగులతో కేటీఆర్ సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని విపక్షంలో ఉన్నప్పుడు డిమాండ్ చేసిన భట్టి విక్రమార్క ఇప్పుడు మాట నిలబెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరుద్యోగులు తిరగబడే రోజు వస్తుందని, వారికి మద్దతుగా కదం తొక్కుతామని కేటీఆర్ వెల్లడించారు.

సీతారామ ప్రాజెక్టును 70% మేమే కట్టాం..

ఉమ్మడి ఖమ్మం జిల్లా వరప్రదాయిని అయిన సీతారామ ప్రాజెక్టు పనులు తమ హయాంలోనే 70 శాతం పూర్తయ్యాయని, ఇప్పుడు ఆ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతం కావడం ఆనందంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ మహా సంకల్పం నెరవేరిన రోజు ఇది అంటూ గురువారం ఎక్స్ వేదికగా ప్రాజెక్టు విషయాలను ఆయన పంచుకున్నారు. ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు.

నాడు ఎన్టీఆర్‌ను గెలిపించినట్లే..

మళ్లీ ప్రజలు ఆదరిస్తారు

- ఓపికతో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి
- పార్టీ నేతలు, కార్యకర్తలతో కేసీఆర్

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో చైతన్యం వచ్చి బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తారని అప్పటి దాకా ఓపికతో ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, పట్టుదలతో ప్రజల మధ్యనే ఉండాలని నాయకులు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సూచించారు. ఒక ఎన్నికల్లో ఓడించి.. ఆ తర్వాత ఎన్నికల్లో అఖండ మెజార్టీ కట్టబెట్టిన విధంగా.. నాడు ఎన్టీఆర్‌ను ప్రజలు ఎలా గెలిపించారో.. అంతకన్నా గొప్పగా బీఆర్‌ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు తిరిగి ఆదరిస్తారని, ఆరోజు త్వరలోనే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో తనను కలిసేందుకు వచ్చిన పార్టీ నేతలు, ఆర్మూర్, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాటాడారు. తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యం కోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర బీఆర్‌ఎస్ సొంతమని, రాష్ట్రాన్ని సాధించిన ఘనత ముందు ముఖ్యమంత్రి పదవి అనేది తనకు పెద్ద విషయం కాదని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. సమైక్య పాలనలో దిక్కు మొక్కులేని పరిస్థితి ఉండేదని, స్వరాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పాలనలో అద్భుత ప్రగతి సాధించడంతోపాటు సాగునీరు, తాగునీరు, కరెంటు వంటి పలు కీలక వసతులను కల్పించుకున్నామన్నారు. ఇటువంటి కీలక సమయంలో వచ్చిన ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారని, కొన్నిసార్లు ఇలాంటి తమాషాలు జరుగుతుంటాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారని చెప్పారు. పాలిచ్చే బర్రెను వదిలి దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరడం లేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో దారి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం తమ 25 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదని, అయిపోలేదని అన్నారు. ఏ పార్టీ అయినా నాయకులను సృష్టిస్తుందని.. అధికారంలో లేమని కొందరు పార్టీ వీడినంత మాత్రాన ఇబ్బందేమీ లేదని.. బీఆర్‌ఎస్ పార్టీకి బుల్లెట్లలాంటి కార్యకర్తలున్నారని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ బీ ఫాం ఇచ్చి అవకాశమిస్తే ఎవరైనా సిపాయిలుగా తయారవుతారన్నారు.


ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన మహిళలు

మినీ వ్యాన్ నడిపిన కేసీఆర్

మర్కుక్: కేసీఆర్ డ్రైవింగ్ సీట్లో కూర్చొని స్టీరింగ్ పట్టడం ఎన్నడైనా చూశారా? గురువారం తన వ్యవసాయ క్షేత్రంలో ఆయన మినీ వ్యాన్ నడిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలొచ్చిన తొలినాళ్లలో ఆయన స్నానాల గదిలో జారిపడటంతో గాయపడ్డ సంగతి తెలిసిందే. నెమ్మదిగా కోలుకున్న ఆయన ఇటీవల దాకా చేతికర్ర సాయంతోనే నడిచారు. వైద్యుల సూచన మేరకు ఇప్పుడిప్పుడే చేతి కర్ర లేకుండా నడవగలుగుతున్నారు. ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో గురువారం సాయంత్రం కూడా కొంత దూరం నడిచారు. కొద్దిసేపటికి తన వద్ద ఉన్న పాత మినీ వ్యాన్ డ్రైవింగ్ సీట్లో కూర్చున్నారు. ఆ వాహనాన్ని నడుపుతూ ఫామ్‌హౌస్ కలియతిరిగారు. అలాగే వ్యాన్‌తో ఫామ్‌హౌస్ బయట రోడ్డు మీదకొచ్చారు. ఎర్రవల్లి సమీప గ్రామాలను సందర్శించారు. వ్యాన్ నడుపుతూ రోడ్డు మీద కనపించిన వారిని కేసీఆర్ అప్యాయంగా పలకరించారు. స్వయంగా కేసీఆర్ డ్రైవింగ్ చేస్తూ కనిపించడంతో స్థానికులు ఆశ్చర్యపోయారు. ఆయనే తమతో మాట్లాడటంతో సంతోషం వ్యక్తం చేశారు.

విద్యుత్ కమిషన్.. వివక్ష చూపుతోంది!

- ఇక.. కమిషన్ ఎదుట హాజరై ఏం లాభం?
- కేసీఆర్ తరఫున న్యాయవాది వాదనలు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన జస్టిస్ నర్సింహారెడ్డి నేతృత్వంలోని విద్యుత్ కమిషన్ తీవ్ర వివక్ష చూపుతోందని మాజీ సీఎం కేసీఆర్ తరఫు న్యాయవాది ఆరోపించారు. కమిషన్ ఏర్పాటు చెల్లదని, విద్యుత్ చట్టం ప్రకారం కమిషన్ వేసే అధికార పరిధి ప్రభుత్వానికి లేదని, కమిషన్ తనకు ఇచ్చిన నోటీసులను కొట్టేయాలని పేర్కొంటూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్.. రిజిస్ట్రీ అభ్యంతరాల మధ్య గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసిపుచ్చిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం.. కేసీఆర్ పిటిషన్‌కు రెగ్యులర్ నంబర్ కేటాయించాలని ఆదేశించింది. కేసీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి వాదనలు వినిపించారు. 'ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్షతోనే విచారణ కమిషన్ వేసింది. కమిషన్ హెడ్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కేసీఆర్ వాదన వినకుండానే తప్పు చేసినట్లు ముందే ఓ నిర్ణయానికి వచ్చేశారు. తప్పు జరిగిందని మీడియా సమావేశం పెట్టి ముందే తీర్పు ప్రకటించేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్ కమిషన్ ఎదుట వాదన వినిపించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. జస్టిస్ నర్సింహారెడ్డి విచారణ నుంచి తప్పుకోవాలని పేర్కొంటూ సమగ్ర వివరాలతో లేఖ రాశాం. ఆయన కమిషన్‌లో ఉండడం మా ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుంది. ఇదే జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి డివిజన్ బెంచ్‌లో సభ్యుడిగా ఉండి.. ఎంక్వైరీ కమిషన్ ఎలా వ్యవహరించాలో వివరిస్తూ 'పీలా పోతినాయుడు' కేసులో తీర్పు ఇచ్చారు. కానీ.. ఆయనే ఇప్పుడు హద్దులు దాటి ప్రవర్తిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాలకు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల ఈఆర్సీలు ఆమోదం తెలిపాయి. కేంద్ర అటవీ, పర్యావరణ, విద్యుత్‌శాఖల అనుమతులు పొందిన తర్వాతే ప్రాజెక్టులు చేపట్టాం. మేం చేసుకున్న ఒప్పందాలన్నీ ప్రభుత్వాల మధ్య జరిగినవే. ఎక్కడా ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం లేదు. బీహెచ్‌ఈఎల్ సైతం మహారత్న హోదా కలిగిన ప్రభుత్వం సంస్థ. విద్యుత్ చట్టం ప్రకారం విచారణ పరిధి ఈఆర్సీకి మాత్రమే ఉంటుంది. రాజకీయ కక్షతో వేసిన ఈ కమిషన్... తదుపరి చర్యలు తీసుకోకుండా, ఎలాంటి నివేదిక ఇవ్వకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వండి'అని కోరారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. అసలు కమిషన్ నివేదిక ఇచ్చిన తర్వాత ఏం జరుగుతుంది? సదరు రిపోర్టును అసెంబ్లీలో పెట్టి చర్చిస్తారా? అని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. కమిషన్ నివేదికను హైకోర్టులో సవాల్ చేస్తామని, కానీ..తన క్లయింట్‌కు వ్యతిరేకంగానే రిపోర్ట్ ఇచ్చే అవకాశం ఉన్నందున.. విచారణను అడ్డుకోవాలని కోరుతున్నామన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

రైతుబంధులో రూ. 26,500 కోట్లు దుబారా

» గత సర్కారుపై మంత్రి తుమ్మల ఆగ్రహం



హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా అంశంలో బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు చూస్తుంటే మతి భ్రమించి మాట్లాడుతున్నారని అనిపిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు బంధు అమలులో అనుసరించిన విధానాల వల్ల గత ప్రభుత్వం రూ.26,500 కోట్ల ప్రజాధనం దుబారా చేసిందని ఆరోపించారు. రైతు భరోసా విధివిధానాలు ఏమిటి ? రైతు భరోసా ఎప్పుడిస్తారు ? అని బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు మాట్లాడటం చూస్తుంటే వారికి మతిమరుపు ఉందనుకోవాలా? వాళ్లు చేసిన తప్పులను రైతులు మర్చిపోయారని అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు పథకం ఎలా అమలైందో ప్రజలకు తెలుసునని స్పష్టం చేశారు. 2018లో వానాకాలం 128 రోజులు (4 నెలల 5 రోజులు), యాసంగిలో 161 రోజులు, 2019 వానాకాలంలో 138 రోజులు, 2020 వానాకాలంలో 169 రోజులు, 2021- 22 యాసంగిలో 84 రోజులు, 2022- 23 యాసంగిలో 148 రోజులు, 2023 వానాకాలంలో 108 రోజుల పాటు బీఆర్ఎస్ సర్కారు రైతుబంధు నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కోడిగుడ్డు మీద ఈకలు ఏరుతున్నట్లు ఉన్నదని ఎద్దేవా చేశారు. అప్పటి రైతుబంధులో గుట్టలకు, రాళ్లూరప్పలకు, పుట్టలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, జాతీయ రహదారులకు, బంజరు భూములకు 12 విడతల్లో రూ.26,500 కోట్లు ఇచ్చి ప్రజాధనాన్ని దుబారా చేశారని ఆరోపించారు.

కేంద్ర మంత్రి మాంఝీతో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ

డిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి గురువారం కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జితన్ రామ్ మాంఝీని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

అక్టోబరులో 'యాదాద్రి' 2 యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభించాలి

» ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రానున్న అక్టోబరులో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రెండు యూనిట్లలో విద్యుత్తు ఉత్పాదన ప్రారంభం కావాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ కార్యదర్శి, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డి.రొనాల్డ్‌రాస్ అధికారులను ఆదేశించారు. కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బుధవారం రాత్రి యాదాద్రి థర్మల్ ప్లాంట్ పనులపై ఆయన అధికారులతో సమీక్షించారు. యాదాద్రికి బొగ్గు సరఫరా అత్యంత కీలకమని, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ రైల్వే లైన్ పనులను పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. యాదాద్రిలో విద్యుత్తు ఉత్పాదనకు అవసరమైన బొగ్గును అందించడానికి సింగరేణి సమ్మతి తెలిపిందన్నారు. అక్టోబరులోపు రైల్వే లైన్ పనులు పూర్తి కావాలని చెప్పారు.

విద్యుత్ అధికారులు ప్రధాన కార్యాలయంలోనే ఉండాలి

నిరంతరం అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని అధికారులకు ఇంధనశాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రొనాల్డ్ రోస్ ఆదేశించారు. గురువారం విద్యుత్‌సౌధలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఆయన అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలోని అధికారులంతా ప్రధాన కార్యాలయంలోనే ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వారు అత్యవసర విధులకు హాజరుకావడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు.

సేఫ్టీ అండ్ ఫైర్ ఇంజనీరింగ్‌తో మెరుగైన ఉపాధి

» అగ్నిమాపకశాఖ అధికారులు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీటెక్ సేఫ్టీ అండ్ ఫైర్ ఇంజనీరింగ్ చేసిన విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఓఎన్‌జీసీ, గెయిల్, సెయిల్, వేదాంత, టాటాపవర్ వంటి ప్రముఖ సంస్థల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని అలాగే క్యాంపస్ నియామకాలతోపాటు డీఆర్‌డీఓ తదితర సంస్థల్లో ఫైర్ సేఫ్టీ విభాగంలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. నాగపూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీసెస్ కళాశాల (ఎన్ఎఫ్ఎస్‌సీ)లో బీటెక్ ఫైర్ ఇంజనీరింగ్‌కు సంబంధించి 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు జూలై 2న చివరి తేదీ అని పూర్తి సమాచారం కోసం ఎన్ఎఫ్ఎస్‌సీ అధికారిక వెబ్‌సైట్‌తోపాటు 8983300060, 0712-2982225 నంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

ఐఐటీ-రూర్కీలో మేడిగడ్డ నమూనా అధ్యయనం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాకు కుంగుబాటుకు సంబంధించిన సమగ్ర మూల్యాంకన నమూనాను అధ్యయనం చేసేందుకు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల బృందం ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ-రూర్కీకి వెళ్లింది. గురువారం ఈ శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, ఈఎన్‌సీ (ఓఅండ్ ఎం) బి.నాగేంద్రరావు నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం మేడిగడ్డ నమూనా అధ్యయనాన్ని పరిశీలించింది. ఈ బ్యారేజీపై హైడ్రాలిక్ నమూనా అధ్యయనం చేయాలని ఐఐటీ-రూర్కీని ప్రభుత్వం కోరింది. దీంతో ఇప్పటికే రూర్కీ బృందం రెండు దఫాలుగా నమూనా అధ్యయనం చేసింది. బ్యారేజీలోని ఏడో బ్లాకు ఎలా కుంగింది? దీని ప్రభావం మిగతా బ్లాకులపైనా ఉందా? ఒకవేళ ఉంటే ఆ తీవ్రత ఎలా ఉండనుంది? రానున్న వరదల ప్రభావం బ్యారేజీలోని ఇతర బ్లాకులపై ఉంటుందా? వంటి అంశాలపై అధ్యయనంలో తేలిన వివరాల ఆధారంగా అధికారులు పరిశీలించారు. రెండు దఫాలుగా జరిగిన నమూనా అధ్యయనంలో తేలిన ఫలితాలను విశ్లేషించే ప్రక్రియ రూర్కీలో జరగ్గా.. అధికారులు దీన్ని నిశితంగా పరిశీలించారు.

జూలై 5న రాష్ట్రానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్..!

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై మలిదశ విచారణ కోసం జూలై 5వ తేదీన జస్టిస్ పినాకి చంద్రఘోష్ రాష్ట్రానికి రానున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 16 వరకు కాళేశ్వరంపై విచారణ జరిగింది. దీనికి హాజరైన వారు తాము కమిషన్‌కు ఏయే అంశాలు వివరించారో ఆ అంశాలకు సంబంధించి ఇప్పటిదాకా 58 అఫిడవిట్లు దాఖలు చేశారు. ఈ విచారణలో భాగంగా ఈ నెల 25వ తేదీ నుంచి 28 వరకు విచారణలో చెప్పిన అంశాలకు కట్టుబడి, అఫిడవిట్లు దాఖలు చేయాలని కమిషన్ నిర్దేశించింది. ఈ అఫిడవిట్ల రూపంలో అందిన వివరాల ఆధారంగా తదుపరి నోటీసులపై కమిషన్ నిర్ణయం తీసుకోనుంది. కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యం, అవినీతికి కారకులు ఎవరూ వంటి వివరాల ఆధారంగా కమిషన్ నోటీసులు ఇవ్వనుంది. దాంతో కీలక ప్రక్రియ ప్రారంభం కానుంది.

నేడు టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఫలితాలను వెల్లడించనున్నారు. www.bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు ఫలితాలను తెలుసుకోవచ్చు.

మాకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలి

» ప్రభుత్వానికి ఎంఎస్ఎంఈ అసోసియేషన్ విజ్ఞప్తి

బర్కత్‌పుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చిన్న పరిశ్రమల నిర్వాహకులకు రాయితీ కింద రావాల్సిన రూ.474 కోట్లను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని ఎంఎస్ఎంఈ రైట్స్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండల్ డానియల్, సలహాదారులు గొల్లపల్లి దయానందరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు. దశాబ్దకాలంగా ఎంఎస్ఎంఈల యజమానులు నిరాశతో ఉన్నారని, కేసీఆర్ ప్రభుత్వం తమకు రావాల్సిన రూ.474 కోట్లను కుట్రపూరితంగా దారి మళ్లించినట్టు ఆరోపించారు. పెండింగ్ నిధులను విడుదల చేసి చిన్న పరిశ్రమల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రోస్టర్ విధానం ద్వారా భూములను కేటాయించాలని, పెట్టుబడులకు కావాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు.

ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఆరోగ్య కేంద్రం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వోలతో సమీక్షలో మంత్రి దామోదర



హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఉండాలని, తదనుగుణంగా చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో డీఎంహెచ్‌వోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను అందించడంలో డీఎంహెచ్‌వోలది గురుతర బాధ్యత అని, ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో ఉండాలన్నారు. ఆస్పత్రులను వైద్య సేవలపరంగా జిల్లా, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అనుసంధానించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని ప్రైవేటు ఆస్పత్రుల లైసెన్సులను రద్దు చేయాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

విచారణ కమిషన్ల గడువు పెంచండి

కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ వ్యవహారాలపై ఏర్పాటైన కమిషన్ల విషయంలో సర్కారుకు వినతి

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు కరెంటు కొనుగోలు, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ల గడువు రెండు రోజుల్లో ముగియనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నిర్మాణ లోపాలు, అవినీతిపై ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్ వేసింది. 100 రోజుల్లో విచారణ పూర్తి చేసి ఈ నెల 30లోగా నివేదిక ఇవ్వాలని లక్ష్యం పెట్టింది. అయితే విచారణ ప్రక్రియ ప్రారంభించి 55 రోజులు మాత్రమే కావడం.. ప్రస్తుతం విచారణ కీలక దశలో ఉండటంతో మరో రెండు నెలల పాటు కమిషన్ గడువు పెంచాలని ప్రభుత్వానికి ఫైలు చేరింది. దీనిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ సంతకం చేశారు. సీఎం రేవంత్ సంతకం చేయగానే గడువును పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వనుంది. ఇక ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం, 2000 మెగావాట్ల కారిడార్‌లో బుకింగ్‌తో జరిగిన నష్టం, కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణం, సమీపంలో బొగ్గు లేకున్నా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ గడువునూ నెల పాటు పొడిగించాలని కోరుతూ ప్రభుత్వానికి ఫైలు చేరింది. ఈ కమిషన్ విచారణ ప్రక్రియను ఏప్రిల్ 7న ప్రారంభించింది. ఈ నెల 30 వరకు గడువు ఇచ్చారు. విచారణ ప్రారంభించి 70 రోజులే కావడంతో గడువును నెలపాటు పొడిగించాలనే ఫైలును ప్రభుత్వానికి పంపించారు.

ఫిరాయింపు పునాదులు కేసీఆర్‌వే

(మొదటిపేజీ తరువాయి)

8 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిందని, 14 స్థానాల్లో మూడో స్థానానికి పడిపోయిందని, అయినా, కేసీఆర్‌కు కనువిప్పు కలగలేదని దుయ్యబట్టారు. పైగా, ప్రజలదే తప్పు అన్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. "కేవలం కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్ నేతలు తమ ఓట్లను బీజేపీకి గంపగుత్తగా వేశారు. లేకపోతే, కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో బీజేపీకి ఫస్టు ప్లేసు వస్తుందా!? సిద్దిపేటలో బీజేపీ, బీఆర్ఎస్‌కు సమానంగా ఓట్లు వస్తాయా? బీఆర్ఎస్ కంచుకోట మెదక్‌లో బీజేపీకి మెజారిటీ వస్తుందా!?" అని నిలదీశారు. కేసీఆర్‌కు ఇప్పటికైనా కనువిప్పు కలగాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. నిన్నటి వరకూ గేటు దగ్గరకు కూడా రానివ్వని ఎమ్మెల్యేలను ఇప్పుడు పిలిచి భోజనాలు పెట్టే పరిస్థితి కేసీఆర్‌కు తలెత్తిందని, తలుపులు మూసి కాళ్లు పట్టుకుంటుండో, కడుపులో తల కాయ పెడుతుండో తనకు తెలియదని ఎద్దేవా చేశారు. "ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రమ్మన్నా రాడు. రాష్ట్ర అవతరణ దినోత్సవాలకు సైతం రాడు. రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో ప్రతిపక్ష నాయకులకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటాడు. దేశంలో ఎక్కడైనా ఈ సంప్రదాయం ఉందా? గత పదేళ్లలో ఎప్పుడైనా మమ్మల్ని పిలిచాడా? పదేళ్ల సీఎంగా పని చేసినందున సముచిత గౌరవంతో ఆహ్వానించాం. కేసీఆర్‌కు ఉద్యమ స్ఫూర్తి ఉంటే మేం పిలిచినప్పుడు హుందాగా వచ్చి అవతరణ వేడుకల్లో పాల్గొని ఉండేవాడు. సంబరాల్లో పాల్గొననివాడు.. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోయాలని అనుకున్నవాడు తెలంగాణ బాగును ఎలా కోరుకుంటాడు?" అని నిలదీశారు. స్వార్థం, దోపిడీ, తన కుటుంబానికే అన్నీ ఉండాలన్న కోరిక.. ఇవన్నీ ఎల్లకాలం కేసీఆర్‌ను బతికించవని మండిపడ్డారు.



విద్యుత్తు కమిషన్‌ను డిమాండ్ చేసింది జగదీశ్ రెడ్డే

విద్యుత్తు కొనుగోళ్లపై విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని తాము ప్రతిపాదించలేదని, బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అసెంబ్లీలో సవాల్ విసిరి మరీ విచారణకు డిమాండ్ చేశారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. "కమిషన్‌ను ఏర్పాటు చేసిన మూడు నెలల వరకూ టీఆర్ఎస్, కేసీఆర్ ఏమీ మాట్లాడలేదు. కేసీఆర్‌ను వచ్చి వివరణ ఇవ్వాలని నోటీసులు పంపించిన తర్వాత ఆరోపణలు చేస్తున్నారు. విచారణ కమిషన్ వేయడం తప్పా? కేసీఆర్‌ను వివరణ ఇవ్వాలని అడిగినందుకు తప్పు పడుతున్నారా? జస్టిస్ నర్సింహా రెడ్డిని తప్పు పడుతున్నారా? బీఆర్ఎస్ నేతల మాటల్లోనే వ్యత్యాసం ఉంది. వాళ్లకే సమన్వయం లేదు" అని ఎద్దేవా చేశారు. వాళ్లు డిమాండ్ చేస్తేనే విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, అవకాశం వచ్చినప్పుడు ఒకరు శ్రీరామచంద్రుడు, మరొకరు సత్య హరిశ్చంద్రుడు అని నిరూపించుకుంటే సరిపోతుంది కదా? అని వ్యాఖ్యానించారు. జస్టిస్ నర్సింహా రెడ్డి కమిషన్లో లోపాలు ఏమైనా ఉంటే విచారణకు వెళ్లి కేసీఆర్ తన అనుభవాన్ని ఉపయోగించుకుని అద్భుతంగా వాదించుకోవచ్చు కదా అని అన్నారు. కేసీఆర్ కోరుకుంటే లైవ్ టెలికాస్ట్‌కు ప్రభుత్వం కూడా కమిషన్‌కు విజ్ఞప్తి చేస్తుందని తెలిపారు.

చివరిగా ఉండేది పార్టీయే: మంత్రి శ్రీధర్ బాబు

నాయకుల్లో చిన్న చిన్న విభేదాలు ఉన్నా.. చివరికి కాంగ్రెస్ పార్టీనే తమలో ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ చేరికతో జీవన్‌రెడ్డి మనస్తాపం చెందారని, కాంగ్రెస్ అంతర్గత అంశంపై చిచ్చు పెట్టాలని కొన్ని పార్టీల నాయకులు చూశారని, కానీ.. పార్టీ నేతలు చూపిన ఐకమత్యం చిచ్చు పెట్టాలని చూసిన ఇతర పార్టీల నాయకులకు మేలుకొలుపని వ్యాఖ్యానించారు.

పక్క రాష్ట్రాల్లోలా రాజకీయ కేసులుండవు

"తెలంగాణలో ఇప్పటి వరకూ ఎలాంటి రాజకీయ ప్రేరేపిత కేసులు నమోదు కాలేదు. గతంలో పక్క రాష్ట్రాల్లో జరిగినట్లు మా పాలనలో ఉండవు. చిన్న కేసు కూడా నమోదు కాలేదంటే మా పాలన బాగున్నట్లా? బాగా లేనట్లా?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలపై త్వరలోనే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసుకుని కేంద్రం నుంచి నిధులు, అనుమతులతో సహా ఏపీతో ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటామని, ఏపీ సర్కారుతో చర్చల పట్ల తమ ప్రభుత్వానికి ఎటువంటి భేషజాలు లేవని స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుతో వీలైన మేరకు సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకుంటామని తెలిపారు. "కేంద్రం వల్ల కూడా కాకపోతే సమస్యల పరిష్కారానికి కోర్టులున్నాయి. ఇరు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి వివిధ వేదికలను ఉపయోగించుకుంటాం. పక్క రాష్ట్రం అభివృద్ధి చెందితే అసూయ పడం. మా రాష్ట్ర అభివృద్ధి కోసం అలసత్వం ప్రదర్శించం" అని రేవంత్ వ్యాఖ్యానించారు. రోజుకూ 18 గంటలు కష్టపడుతూ తెలంగాణ పునర్నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. తనకు ఫాంహౌజ్‌లలో పడుకునే అలవాటు లేదని రేవంత్ ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రులతో చర్చలు సానుకూలంగా జరిగాయని, కంటోన్మెంట్‌లో 25 ఏళ్లుగా పెండింగులో ఉన్న ఎలివేటెడ్ కారిడార్లకు అనుమతులు తీసుకున్నామని, నిధులు విడుదల చేయించుకున్నామని, త్వరలోనే ప్రధానిని, హోం మంత్రిని కలవనున్నామని తెలిపారు.

"రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఇప్పటి వరకు చర్చలు జరగలేదు. కానీ, కొన్ని మీడియా సంస్థలు ప్రమాణ స్వీకారాలకు కూడా ముహూర్తాలు పెట్టేశాయి" అని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నడిచే మీడియా సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంలో పలు శాఖలకు మంత్రులు లేరని వార్తలు రాస్తున్నాయని, కానీ, కేసీఆర్ రెండోసారి సీఎం అయిన తర్వాత కొన్ని నెలల పాటు మంత్రులే లేరని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో అన్ని శాఖలకు మంత్రులున్నారని, సమర్థంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. వచ్చే నెల ఏడో తేదీతో పీసీసీ చీఫ్‌గా

క్యాబినెట్ విస్తరణపై చర్చలు జరగలేదు

తన పదవీ కాలం ముగుస్తోందని, ఆలోపే సామాజిక న్యాయంతోపాటు సమర్థంగా పార్టీని నడిపించే వ్యక్తిని నియమించాలని పార్టీ అధ్యక్షుడు ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను కోరినట్లు రేవంత్ తెలిపారు. "రుణమాఫీ, ఆరు గ్యారంటీల అమలుతో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మా సర్కారుకు సహకరించాలని నిర్ణయించుకున్నారు. ఆయన చేరికతో జీవన్ రెడ్డి మనస్తాపానికి గురయ్యారు. పీసీసీ తరఫున తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మంత్రి శ్రీధర్ బాబు జీవన్ రెడ్డిని సంప్రదించి అధిష్ఠానానికి హుటాహుటిన వివరాలు అందజేసి ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు. అధిష్ఠానం కూడా జీవన్‌రెడ్డి కమిట్‌మెంట్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయన గౌరవానికి భంగం కలగకుండా చూస్తామని మాట ఇచ్చింది. ఆయన గౌరవాన్ని కాపాడడంతోపాటు కార్యకర్తలను ఆదుకోవాలని పార్టీ ఆదేశించింది. దానికి మేం కట్టుబడి ఉంటాం" అని వివరించారు. ఒంటె పెదాలకు నక్కలు ఆశపడ్డట్టు యథావిధిగా కొన్ని గోతికాడి నక్కలు ఏమైనా జరిగితే బాగుండునని భావించాయని, కాంగ్రెస్‌కు నష్టం జరగాలని చూసిన వారికి జీవన్‌రెడ్డి అవకాశం ఇవ్వలేదని వ్యాఖ్యానించారు.



ఒకే సీజన్‌లో 9 కోట్ల పనిదినాలు!

» ఉపాధి హామీ పనులు లక్ష్యానికి మించి చేయడంపై కేంద్రం ఆరా

» వెంటనే నివేదిక పంపాలని ఆదేశం

» క్షేత్రస్థాయి తనిఖీలకు జూలై మొదటి వారంలో రాష్ట్రానికి కేంద్ర బృందం రాక

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవి కాలం.. వ్యవసాయ, ఇతర పనులు లేకపోవడంతో కూలీలంతా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేయడానికి ఆసక్తి చూపే సమయం. దీంతో రాష్ట్రంలో ఒకే సీజన్‌లో 9 కోట్లకు పైగా పనిదినాలు కల్పించారు. అయితే అధిక సంఖ్యలో పనిదినాలు నమోదు కావడంపై కేంద్ర విభాగాలు మాత్రం విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించడం మంచిదే అయినప్పటికీ గతంలో ఎన్నడూ లేనివిధంగా పెరగడానికి కారణాలు పేర్కొంటూ తక్షణం నివేదిక పంపాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్రాన్ని ఆదేశిస్తూ లేఖ రాసింది. ఆ శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరానికి 8 కోట్ల పనిదినాలు కల్పించాలని నిర్దేశించింది. అయితే రాష్ట్రంలో కేవలం 80 రోజుల్లో 9 కోట్లకు పైగా పనిదినాలు కల్పించారు. రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభమయ్యాయి. ఆ నెలలో 19,89,700 మంది కూలీలకు 4,27,08,616 పనిదినాలు, మేలో 23,08,256 మందికి 4,28,91,467, ఈ నెల (జూన్) 24 వరకు 11,38,155 మందికి 95,90,952 పనిదినాలు కల్పించినట్లు నమోదయింది. గత ఏడాది కంటే ఈసారి అత్యధిక పనిదినాలు నమోదైన 18 జిల్లాల పేర్లను కేంద్రం తన లేఖలో ప్రస్తావించింది. వరంగల్‌లో 232 శాతం, ములుగులో 231, కామారెడ్డిలో 238, ఖమ్మంలో 218, కరీంనగర్‌లో 217, సిద్దిపేటలో 200, పెద్దపల్లిలో 191, జోగులాంబ గద్వాలలో 187, రాజన్న సిరిసిల్లలో 181, మంచిర్యాలలో 180, హనుమకొండలో 170, ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌లలో 163, జగిత్యాలలో 185, భద్రాద్రి కొత్తగూడెంలో 156, జనగామలో 155, మహబూబాబాద్, నిజామాబాద్‌లో 151శాతం చొప్పున పనిదినాలు పెరిగినట్లు పేర్కొంది. ఈ జిల్లాలకు సంబంధించి క్షేత్రస్థాయి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని, జూలై మొదటి వారంలో కేంద్ర బృందాలు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తాయని రాష్ట్రానికి సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ 18 జిల్లాల పరిధిలో ఉపాధి పనులపై సమగ్ర వివరాలు సేకరించే పని మొదలుపెట్టింది. వేతనం పెరిగిన నేపథ్యంలో ఎక్కువ పనిదినాలు దక్కడంతో కూలీల్లో ఓ వైపు ఆనందం వ్యక్తమవుతోంది. మరోవైపు అధిక సంఖ్యలో ఉపాధి పనులు చేపట్టడంపై కేంద్రం ఆరా తీస్తున్న విషయం తెలిసిన కూలీలు తమకు డబ్బులు చెల్లిస్తారా లేదా అని ఆందోళనకు గురవుతున్నారు.

పుంజుకునేందుకు కేసీఆర్‌కు అవకాశాలు లేకపోలేదు

అందుకు అసెంబ్లీకి వచ్చి ఉనికిని నిరూపించుకోవాలి.. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు చేరికలు అవసరం

» మన పగ తీర్చుకోవడానికి ప్రజలు అధికారం ఇవ్వరు

» కక్ష సాధింపు చర్యల కారణంగానే జగన్‌కు గుణపాఠం చెప్పారు

» జగన్ ఇంటి వద్ద కూల్చివేతలకు, చంద్రబాబుకు సంబంధం లేదు

» బాబు అలాంటి చిల్లర పనులు చేయలేదు.. అలా దిగజారలేదు

» ఓ మంత్రి పట్టుబట్టి.. అధికారులకు చివాట్లు పెట్టి చేయించారు

» విలేకరులతో సీఎం రేవంత్ చిట్‌చాట్



న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): "కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తన ఉనికిని నిరూపించుకోవాలి. అప్పుడు ఆయన మళ్లీ పుంజుకునేందుకు అవకాశాలు లేకపోలేదు. కానీ, కేసీఆర్ ఇప్పుడు హరీశ్ రావు ట్రాప్‌లో ఉన్నారు. కేసీఆర్ బతికున్నంత వరకూ హరీశ్ ఆయనను ఏమీ చేయలేరు. కేసీఆర్ పూర్తిగా బలహీనమయ్యాక పార్టీని అధీనంలోకి తీసుకుంటారు. లేదా కొత్త మార్గాన్ని ఎంచుకుంటారు" అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మీ వల్లే కేసీఆర్ తమకు గౌరవం ఇస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, వెళ్లగానే లేచి దండం కూడా పెడుతున్నారని చెప్పారని వివరించారు. గత వైఖరికి భిన్నంగా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించాల్సి వస్తున్న తీరుతో కేసీఆర్ మానసిక క్షోభతో బాధ పడుతున్నారని, జైలుకెళ్లినా కేసీఆర్‌కు అంత బాధ ఉండేది కాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ఎమ్మెల్యేల చేరికలు అవసరమని, ఉన్న ప్రభుత్వమే పోతే చేసేదేమీ ఉండదని చెప్పారు. ఢిల్లీలోని తన నివాసంలో సీఎం రేవంత్ గురువారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మనం పగ తీర్చుకోవడానికి అధికారాన్ని ప్రజలు ఇవ్వరని, మన కోపం తీర్చుకోవడానికి అధికారాన్ని ఉపయోగించుకోకూడదని ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి రేవంత్ విమర్శల బాణాలు సంధించారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు ఇతర రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలతో వ్యవహరించి, పాలనను విస్మరించినందువల్ల జగన్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. టీడీపీని ఖతం చేయాలని పగబట్టి ఆ పార్టీని ఏమీ చేయకుండా చివరకు తన పార్టీనే ఖతం చేసుకున్నాడని వ్యాఖ్యానించారు. మనం చేసిన పాపాలు మనల్ని ఏదో ఒకనాడు మింగుతాయని చెప్పడానికి జగన్ తుడిచిపెట్టుకుపోయిన ఉదంతమే ఉదాహరణ అని అన్నారు. అంతకు మించిన శిక్ష జగన్‌కు మరేమీ లేదని చెప్పారు. జగన్‌పై నమ్మకంతో ప్రజలు 150కుపైగా సీట్లు ఇచ్చారని, కానీ, అతడు తప్పు చేయడంతో గద్దె దించారని గుర్తు చేశారు. రెండు పార్టీల పంచాయితీ ప్రజల పంచాయితీ కాదన్నారు. జగన్ వ్యవహార శైలే ఆయనను దెబ్బతీసిందని, తన వద్దకు వచ్చిన వైసీపీ ఎంపీలను ఆయన తిట్టి పంపించారని, వారే ఇతర పార్టీల్లో చేరి గెలిచి వచ్చారని గుర్తు చేశారు. జగన్ చేసిన అక్రమాలతో పరిశ్రమలు కుప్పకూలాయని, రాష్ట్రం దెబ్బ తిందని గుర్తు చేశారు.

దిగజారడం బాబు వ్యక్తిత్వం కాదు

"చంద్రబాబు ఫోన్ చేస్తే హైదరాబాద్‌లోని జగన్ ఇంటి వద్ద కూల్చివేతలు జరిపించానన్న విమర్శల్లో వాస్తవం లేదు. చంద్రబాబుది నాకు ఫోన్ చేసే స్థాయి కాదు. ఆయన తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో అలాంటి చిల్లర పనులు చేయలేదు. అలా దిగజారడం ఆయన వ్యక్తిత్వం కాదు" అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒక మంత్రి పట్టుబట్టి, అధికారులకు చివాట్లు పెట్టి జగన్ ఇంటి వద్ద కట్టడాల్ని కూల్చి వేయించారని, ఆ మంత్రికి సుబ్బారెడ్డి 50 సార్లు ఫోన్ చేసి ఆపించే ప్రయత్నం చేశారని, ఖమ్మానికి చెందిన ఒక మంత్రి ద్వారా కూడా రాయబారం నడిపారని వివరించారు. జగన్ ఇంటి వద్ద కూల్చివేతల విషయం తనకు దృష్టికి వచ్చిన వెంటనే సదరు అధికారిని జీఏడీకి అటాచ్ చేశానని గుర్తు చేశారు. చంద్రబాబుతో తనకు వ్యక్తిగత సంబంధాలు న్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలు, తన రాజకీయ భవిష్యత్తు తనకు ముఖ్యమని రేవంత్ తెలిపారు.

మూడు రాజకీయ లక్ష్యాలూ నెరవేరాయి

రాష్ట్రంలో కూడా కేసీఆర్ తన అహంకారం, అతి తెలివితేటల వల్ల దెబ్బతిన్నారని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. తాను ముఖ్యమంత్రి కావడం, బీఆర్ఎస్ ఓటమి, కేసీఆర్‌ను గద్దెదించడమనే తన మూడు రాజకీయ లక్ష్యాలూ నెరవేరాయని వివరించారు. "తెలంగాణలో బీఆర్ఎస్ పూర్తిగా తమ ఓటును బీజేపీకి మళ్లించినందువల్లే కాంగ్రెస్‌కు సీట్లు తగ్గాయి. బీజేపీ గెలిచిన చోట్లల్లా బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయింది. డబ్బులు పంచి మరీ ఆ పార్టీ బీజేపీకి ఓటు వేయించింది. కాంగ్రెస్‌ను ఓడించాలన్న కసితో వాళ్ల ఓట్లు కూడా వాళ్లు వేసుకోలేదు" అని వివరించారు. కేసీఆర్ ఒక్క సీటు కూడా గెలవడని తాను ముందే చెప్పానని రేవంత్ గుర్తు చేశారు. అనుకున్నట్లుగా కాంగ్రెస్‌కు 12 సీట్లు రాకపోయినా బీఆర్ఎస్ శాశ్వతంగా మరణించిందని చెప్పారు. లోక్‌సభలో ఆ పార్టీకి ప్రాతినిధ్యమే లేకుండా చేశానన్నారు. గత రెండు ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ పనిచేస్తే ఈసారి కేసీఆర్ వ్యతిరేక గాలి పని చేసిందని, కేసీఆర్ నియంతృత్వ పాలనపై తాను చేసిన పోరులో ప్రజలు భాగమయ్యారని వివరించారు.

రాహుల్‌ను ఒప్పించింది నేనే

రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉండాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తానే తొలుత మాట్లాడానని, సిద్దరామయ్య బలపరిచేలా చేశానని సీఎం రేవంత్ చెప్పారు. ఈ మేరకు వర్కింగ్ కమిటీ తీర్మానం చేసిందని, అందుకే పదవి పట్ల విముఖంగా ఉన్న రాహుల్ కూడా ఒప్పుకోవాల్సి వచ్చిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 240 సీట్లు దాటవని తొలుత చెప్పిందీ తానేనన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు బీజేపీ ప్రత్యామ్నాయం అవుతుందని చెప్పలేమని, స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ బలమేందో తెలుస్తుందని అన్నారు. ఢిల్లీలో తెలంగాణ భవన్ కట్టిన తర్వాత మెయింటినెన్స్‌ను స్టార్ హోటల్‌కు అప్పగిస్తామని, అప్పుడు రాష్ట్రానికి కావాల్సిన రూములు, ఆహారం కోసం ఒప్పందం చేసుకుంటామని, అప్పుడే నాణ్యమైన వసతి సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు.

ఎంతమందిని తీసేస్తాం!?

తాను పాలనను విస్మరించి తప్పులు చేసిన అధికారులపైనే దృష్టి సారిస్తే వ్యవస్థలు పని చేయవని, అప్పుడు బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వవని, కంపెనీలు దెబ్బతింటాయని గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతి గురించి మాట్లాడుతూ సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఎంతమందిని తీసేస్తామని అన్నారు. "అవినీతిని మితిమీరకుండా చూసుకోవాలి. సామాన్యుడు నష్టపోకూడదు. నేను అధికారంలోకి వచ్చాక ఏసీబీ, విజిలెన్స్ క్రియాశీలంగా పని చేస్తున్నాయి. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హోంగార్డులతో సహా 86 మందిని బదిలీ చేశాం. అక్రమాలకు పాల్పడిన అనేకమంది కలెక్టర్లు, అధికారులను బదిలీ చేశాం. ఒక ఎస్పీ స్థాయి అధికారిణి తన కుటుంబ సభ్యులతో పత్తాలాటలను ప్రోత్సహించింది. సదరు అధికారిణికి పక్క రాష్ట్రానికి చెందిన కీలక నేత కుటుంబంతో బంధుత్వం ఉన్నా ఖాతరు చేయలేదు. ఒక ఐఏఎస్ అధికారిణి భర్త అక్రమాలకు పాల్పడితే గంటలలోనే ఆమెకు సమాధుల బాధ్యతలు అప్పజెప్పాను" అని వివరించారు. రాష్ట్రంలో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించే వరకూ వెనకాడబోనని, అమ్మాయిలు, అబ్బాయిలు అన్నా తేడా లేకుండా యువత మత్తులో దిగి జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

లులు మాల్‌లో కాలం చెల్లిన ఆహార పదార్థాలు

» నోటీసులు జారీ చేసిన టాస్క్‌ఫోర్స్

» జేఎన్‌టీయూ క్యాంటీన్‌లోనూ అదే పరిస్థితి



లులు మాల్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని లులు మాల్‌లో తెలంగాణ కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. మాల్‌లోని బేకరీలో కాలం చెల్లిన ఆహార పదార్థాలు, బూజు పట్టిన బ్రెడ్ మిక్స్, 10 కిలోల అట్ట బ్రెడ్ మిక్స్, 15 కిలోల లూజ్ బాగుట్టి బ్రెడ్ మిక్స్‌కు బూజు పట్టినట్టు గుర్తించారు. గడువు ముగిసిన 20 కిలోల నువ్వుల గింజలు, 20 లీటర్ల టోన్డ్ పాలు, 7.5 కిలోల బిస్కెట్ ప్యాకెట్లు, ఐదు కిలోల జెమ్స్, రెండు ప్యాకెట్ల పళ్ల రసాలు గుర్తించి బయట పడేశారు. అలాగే ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి పత్రాన్ని ప్రవేశ ద్వారం వద్ద ప్రదర్శించ లేదని గుర్తించారు. నిర్వాహకులకు నోటీసులు ఇచ్చామని, తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. అనంతరం జేఎన్‌టీయూలోని క్యాంటీన్ (శ్రీ శ్రీ కేటరర్స్)లో తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన 3.5 కిలోల బియ్యం పిండిని గుర్తించారు. ఆహార పదార్థాలు నిల్వ ఉంచడంలో ప్రమాణాలు పాటించలేదని అపరిశుభ్ర వంటగది, సిబ్బంది హెయిర్ క్యాపులు, గ్లౌజులు ధరించలేదని, పెస్ట్ కంట్రోల్ రికార్డులు, సిబ్బందికి సంబంధించిన ఆరోగ్య ధ్రువపత్రాలు లేవని అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు.

భర్తను గొడ్డలితో నరికి చంపిన భార్య

» కుమార్తెపై తరచూ లైంగిక వేధింపులకు పాల్పడటంతోనే

పుల్‌కల్, జూన్ 27: కన్నతండ్రి అయివుండి మద్యం మత్తులో కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. దుర్మార్గపు చేష్టలు కూడదంటూ ఓపిగ్గా భర్తకు చెబుతూ వచ్చిన భార్య, అమ్మాయి పట్ల అతడి చేష్టలు మితి మీరడంతో సహనం కోల్పోయింది. గొడ్డలితో భర్తను నరికి చంపేసింది. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని ఓ గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి (50)కి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె (30)కు పెళ్లి చేసి పంపినా, భర్త చనిపోవడంతో ఆమె పుట్టింటికి వచ్చి ఉంటోంది. ఆమెకు కొన్నాళ్లుగా కన్నతండ్రే నరకం చూపిస్తున్నాడు. తాగుడుకు అలవాటు పడి, ఆ మత్తులో ఆమెను లైంగికంగా వేధిస్తున్నాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో కూతురు పట్ల అతడు అసభ్యంగా ప్రవర్తించడంతో చూసి భార్య తట్టుకోలేకపోయింది. కూతురును వేధిస్తున్న భర్తను గొడ్డలితో విచక్షణారహితంగా నరికి చంపింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలో ఇతర శాఖల అధికారుల తనిఖీలేంటి?

» నల్లగొండ కలెక్టర్ ఉత్తర్వులను నిరసిస్తూ..

జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆందోళన

నల్లగొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లా కేంద్ర ప్రధాన ఆస్పత్రిలో ఇతర శాఖల అధికారుల జోక్యాన్ని నిరసిస్తూ డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, కార్మికులు సమ్మెకు దిగారు. వైద్యులు సహా సిబ్బంది గురువారం ఉదయం 11 గంటల సమయంలో విధులు బహిష్కరించి ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. అదనపు కలెక్టర్(స్థానికసంస్థలు) పూర్ణచంద్రను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆస్పత్రి వద్దకు పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్లు, సిబ్బందికి అదనపు కలెక్టర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినకపోవడంతో ఆయన వెళ్లిపోయారు. డాక్టర్లు, సిబ్బంది ఆందోళనకు దిగడంతో ఆస్పత్రిలో అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలు నిలిచిపోయాయి. శుక్రవారం మరోసారి నిరసనకు దిగాలని నిర్ణయించుకున్న వైద్యులు, సిబ్బంది ఆందోళనను విరమించారు. కాగా, డాక్టర్లు, సిబ్బంది ఆందోళనపై స్పందించిన కలెక్టర్ నారాయణరెడ్డి.. డాక్టర్ల పనితీరుపైనా, వారి వృత్తిపరమైన విషయాల్లో ఏ శాఖ అధికారులు జోక్యం చేసుకోవడం లేదని, ఎలాంటి అజమాయిషీ చేయడం లేదని వెల్లడించారు.

ప్రతాపసింగారంలో హెచ్ఎండీఏ టౌన్‌షిప్

» 130 ఎకరాల్లో లేఅవుట్ ఏర్పాటు

» ఉప్పల్ భగాయత్ తరహాలో అభివృద్ధి

హైదరాబాద్ సిటీ, జూన్27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారులో మరో మెగా టౌన్‌షిప్ ప్రాజెక్టుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) రంగం సిద్ధం చేస్తోంది. భూసమీకరణ పథకం(ల్యాండ్ పూలింగ్ స్కీమ్) కింద చేపట్టిన ఉప్పల్ భగాయత్ లే అవుట్ తరహాలో మేడ్చల్ జిల్లా ఘటకేసర్ మండలంలోని ప్రతాపసింగారంలో మెగా టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తోంది. మూసీ నది వెంట రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరిట రైతుల నుంచి సమీకరించిన 129.28 ఎకరాల భూమిలో లేఅవుట్ అభివృద్ధి చేస్తోంది. ఫిర్జాదిగూడ-గౌరెల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా ఈ లేఅవుట్ ఉంటుంది. ముసాయిదా లేఅవుట్‌కు హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం ఆమోదముద్ర వేసింది. దీంతో ప్లాట్ల హద్దు నిర్ణయిస్తూ రాళ్లను కూడా పాతుతున్నారు. లేఅవుట్‌లోని ప్లాట్లు పూర్తిగా రెసిడెన్షియల్ అవసరాలకు అనుగుణంగా ఉండేలా కనిష్ఠంగా 150చ.గజాల నుంచి గరిష్ఠంగా 300చ.గజాల విస్తీర్ణంతో ఉండేలా చర్యలు తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నార్వా, కందుకూరు మండలం లేమూర్‌లోని లేఅవుట్లలోని ప్లాట్ల విక్రయానికి వచ్చే నెలలో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో ఈ-వేలం నిర్వహించేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తుంది. వాటితోపాటే ప్రతాపసింగారానికి సంబంధించి తొలి విడతగా 30 నుంచి 60 ప్లాట్లు విక్రయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

డాక్టర్ కేఎస్ రావుకు సృజన్ శిఖర్ పురస్కారం

హైదరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావు(కేఎస్ రావు)కు సృజన్ శిఖర్ పురస్కారం లభించింది. వారణాసికి చెందిన ప్రముఖ సాహిత్య సంస్థ నాందీ సేవాన్యాస్ సమితి ప్రతి సంవత్సరం ప్రముఖ సాహితీవేత్తలను ఈ పురస్కారంతో సన్మానిస్తోంది. భారతీయ భాషా సాహిత్యాల అభివృద్ధికి కేఎస్ రావు చేస్తున్న కృషితో పాటు జాతీయస్థాయిలో ఆయన అందిస్తున్న నిరంతర సాహితీసేవకూ గుర్తింపుగా సృజన్ శిఖర్ పురస్కారం అందిస్తున్నట్టు నాందీ సేవాన్యాస్ సమితి పేర్కొంది. వారణాసిలో బుధవారం జరిగిన సుప్రసిద్ధ హిందీ సాహితీవేత్త రాజేంద్రప్రసాద్ పాండే స్మారక సాహిత్య కార్యక్రమంలో కేఎస్ రావుకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

అర్ధశతాబ్ది నగర తెలుగు సాంస్కృతికమూర్తి కేఎస్ మూర్తి కన్నుమూత



కేఎస్ మూర్తి(ఫైల్)

చిక్కడపల్లి, హైదరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అర్ధశతాబ్ది నగర తెలుగు సాంస్కృతిక మూర్తిగా పేరుగాంచిన కేఎస్ మూర్తి(77) ఇక లేరు. సోమవారం అమెరికాలో ఆయన తుది శ్వాస విడిచారు. దశాబ్దకాలంగా అమెరికాలో ఉంటున్న కేఎస్ మూర్తి హైదరాబాద్‌లో దాదాపు అయిదు దశాబ్దాల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నాటకాలలో, దూరదర్శన్ ఆనందోబ్రహ్మ సీరియల్‌లో నటించారు. అమెరికా వెళ్లాక అక్కడ ఉన్న భారతీయ సీనియర్ సిటిజన్లతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు మన దేశభక్తిని, దేశ సమగ్రతను తెలియజేసేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి వ్యక్తిగా పేరొందారు. ఆయన అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సంఘం, ఫాస్ ఫిలిం సంస్థల అమెరికా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపక సభ్యులైన ఆయన స్టేట్ బ్యాంకు మూర్తిగా అందరికీ పరిచయస్థులు. కేఎస్ మూర్తి మరణం పట ఇటక్లా, ఫాస్, ఇట్ మా సంస్థల ముఖ్యులు సంస్కృతిరత్న డా. ధర్మారావు, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, సినీ నిర్మాత రామ సత్యనారాయణ తదితరులు సంతాపం ప్రకటించారు.

వేములవాడ రాజన్నకు రూ.35 లక్షల విరాళం

» నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.25 లక్షలు, గోశాలకు రూ.10 లక్షలు

» మంచి మనసు చాటుకున్న సికింద్రాబాద్ వాసి

వేములవాడ కల్చరల్, జూన్ 27: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి ఓ భక్తుడు గురువారం రూ.35 లక్షల విరాళం అందజేసి మంచి మనసు చాటుకున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన గల్లా గుండయ్య అనే భక్తుడు.. రాజన్న ఆలయ నిత్యాన్నదాన ట్రస్ట్ కోసం రూ.25 లక్షలు, గోశాల నిర్వహణ కోసం రూ.10 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో నవీన్‌కు అందజేశారు. అంతకుముందు గుండయ్య కుటుంబసభ్యులతో రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఆయన్ను సన్మానించారు. అనంతరం ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.



భక్తుడు గల్లా గుండయ్యను సన్మానిస్తున్న ఏఈవో నవీన్

ట్యాపింగ్ నిందితుల బెయిల్ పిటిషన్ల తిరస్కరణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్ రావు బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. 90 రోజుల జుడీషియల్ కస్టడీ ముగియడం, చార్జిషీట్ దాఖలు చేయనందున డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ముగ్గురు నిందితులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై బుధవారం వాదనలు విన్న న్యాయమూర్తి వాటిని తిరస్కరిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, నిబంధనల మేరకు 90 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేశామన్న దర్యాప్తు అధికారుల వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి నిందితుల బెయిల్ పిటిషన్లను తిరస్కరించారు.

తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలు ఎవరికి?

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ల అభిప్రాయాలను ఏఐసీసీ సేకరిస్తోంది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ కూడా ఈ అంశంపై సోనియాగాంధీని కలిశారు. ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. హుటాహుటిన ఢిల్లీకి వెళ్లి.. దీపాదాస్ మున్షీతో భేటీ అయ్యారు. గురువారం రాత్రి జరిగిన ఈ భేటీలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మధుయాష్కీ, మహేశ్‌కుమార్ గౌడ్ కూడా ఉన్నారు. సీనియర్ నేతలతో పాటు ఆశావహులంతా ఢిల్లీలో మకాం వేయటంతో కాంగ్రెస్ పార్టీలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం ఏ సామాజికవర్గం వైపు మొగ్గు చూపుతుందనేదే ఇప్పుడు కీలకంగా మారింది.

సామాజిక సమీకరణాలే కీలకం!

రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావటంతో.. పీసీసీ అధ్యక్ష పదవిని ఆ వర్గానికి ఇచ్చే అవకాశం కనిపించడంలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందినవారిలో ఒకరికి పీసీసీ చీఫ్ పదవిని అప్పగిస్తారనే అంశంపై స్పష్టత ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే బలహీనవర్గాల్లో.. బీసీలకిస్తారా? ఎస్సీలకిస్తారా? ఎస్టీలకిస్తారా? అనేది ఇంకా తేలాల్సి ఉందని వివరిస్తున్నాయి. సీనియర్లంతా పీసీసీ అధ్యక్ష పదవికి పోటీపడుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తటస్థంగా వ్యవహరిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

బీసీ కోటాలో మహేశ్ ఆశలు

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్.. రేసులో ముందు వరుసలో ఉన్నారు. పార్టీలో సీనియర్ నేతగా మహేశ్‌కు గుర్తింపు ఉంది. ఢిల్లీ పెద్దలతో కూడా సత్సంబంధాలున్నాయి. పీసీసీ వ్యవస్థీకృత వ్యవహారాలనూ మహేశ్ పర్యవేక్షించారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నిజామాబాద్ అర్బన్ టికెట్‌ను ఆశించినప్పటికీ అవకాశం రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్సీగా నియమితులయ్యారు. ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ పదవులకు రెడ్డి-బీసీ కాంబినేషన్ 1992 నుంచి కొనసాగుతోందని, ఇప్పుడు కూడా ముఖ్యమంత్రి రెడ్డి వర్గానికి చెందిన నేత కావడంతో.. ఇప్పుడు మహేశ్ పీసీసీ చీఫ్ పదవిని ఆశిస్తున్నారు.



మరోవైపు బీసీ కేటగిరీలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాష్కీ పేర్లు కూడా అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ముగ్గురూ గౌడ సామాజిక వర్గానికి చెందినవారే కావడం గమనార్హం..! రాష్ట్రంలో పుంజుకుంటోన్న బీజేపీ బీసీ నాయకత్వం వైపే మొగ్గుచూపుతున్న నేపథ్యంలో.. ఇప్పుడు కాంగ్రెస్ కూడా పీసీసీ పగ్గాలను అదే వర్గానికి ఇస్తుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

అనూహ్యంగా తెరపైకి బలరాంనాయక్

పీసీసీ చీఫ్ రేసులో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ పేరు కూడా అనూహ్యంగా తెరపైకి వచ్చింది. బలరాం నాయక్ ఎస్టీ కేటగిరీలో మెజారిటీ ఉపకులమైన 'లంబాడా' వర్గానికి చెందిన వారు. 2009-14 మధ్యకాలంలో కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. అప్పట్లో ఎవరూ ఊహించని రీతిలో సోనియాగాంధీ ప్రతిపాదనతో బలరాం నాయక్‌కు కేంద్ర క్యాబినెట్‌లో స్థానం దక్కింది. వివాద రహితుడు, అధిష్ఠానానికి విధేయంగా ఉంటారనే పేరు ఆయనకు ఉంది.

భట్టి, సంపత్ పోటీ

పీసీసీ అధ్యక్ష పదవిని ఎస్సీ సామాజికవర్గాలకు ఇవ్వాల్సి వస్తే.. ఇద్దరు నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేటగిరీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాల కేటగిరీలో ముందువరుసలో ఉన్నారు. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తే.. ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చారని, ఇప్పుడు పీసీసీ అధ్యక్ష పదవిని కూడా తనకే ఇవ్వాలనే ప్రతిపాదనను భట్టి అధిష్ఠానం ముందు పెట్టినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కర్ణాటక ఫార్ములాను తెలంగాణలో కూడా పాటించవచ్చుకదా? అనే వాదనను భట్టి తెరపైకి తెచ్చినట్లు సమాచారం. అయితే.. కాంగ్రెస్‌లో మాలలకు ప్రాధాన్యత పెరుగుతోందని.. పీసీసీ పగ్గాలను మాదిగలకు ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పీసీసీ రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ టికెట్‌ను ఆశిస్తే.. మల్లు భట్టివిక్రమార్క సోదరుడు మల్లు రవికి దక్కడాన్ని ఆయన గుర్తుచేస్తున్నట్లు సమాచారం.

నీటి వనరులకు జియో ట్యాగింగ్

» జల వినియోగంపై శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించండి

» రాష్ట్రాలకు కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నీటి వనరులన్నింటికీ జియో ట్యాగింగ్ చేయాలని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా ఆదేశించారు. తమ తమ రాష్ట్రాల్లోని నీటి వనరుల వినియోగానికి ఒక శాస్త్రీయ ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. గురువారం నీటి సంరక్షణకు సంబంధించిన 'జలశక్తి అభియాన్'పై రాష్ట్రాల సీఎస్‌లు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులతో ఆయన ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, ఆర్థిక, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గౌబా మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరుల వివరాలను సేకరించి పెట్టుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం, కాంపెన్సేటరీ అఫోరెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కాంపా), ఆర్థిక సంఘం నిధులను నీటి సంరక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా గతేడాది అమృత్ సరోవర్ కార్యక్రమం కింద 75 వేలకు పైగా కొత్త నీటి వనరులను నిర్మించినందుకు ప్రధాన కార్యదర్శులను ఆయన అభినందించారు. ఈ ఏడాది 'నారీ శక్తిసే జలశక్తి అభియాన్' ఇతివృత్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వాములుగా చేసి నీటి సంరక్షణలో వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. నీటి వినియోగంపై నిర్ణయం తీసుకోవడంలో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరాన్ని ఆయన పునరుద్ఘాటించారు. గ్రామీణ, పట్టణ నీటి సరఫరా కోసం రాష్ట్రాలు సమగ్ర విధానాన్ని రూపొందించుకోవాలని సూచించారు.

పిల్లల గుండెలో ఆ ఇద్దరు.. గదిలో బందీగా ఒకరు

» బదిలీపై వెళుతున్న ఇద్దరు టీచర్ల పట్ల పిల్లల్లో భావోద్వేగం

» గేటు మూసివెళ్లనీయకుండా అడ్డగింత

» జనగామ జిల్లా శామీర్‌పేట స్కూల్లో ఘటన

» మరో ఘటనలో ఫూటుగా తాగొచ్చినటీచర్

» ఆయన్ను గదిలో బంధించిన చిన్నారులు

» కొత్తగూడెం జిల్లాలో ఘటన



జనగామ రూరల్ శామీర్‌పేటలో ఉపాధ్యాయుడు వెళ్లకుండా గేటు మూసి అడ్డంగా నిల్చున్న విద్యార్థులు



మద్యం మత్తులో ఉన్న ఉపాధ్యాయుడిని తరగతి గదిలో నిర్బంధించిన దృశ్యం

జనగామ కల్చరల్/ఇల్లెందు టౌన్: ఎవరు నేర్పారమ్మ ఈ కొమ్మకు.. పూలిమ్మనీ రెమ్మరెమ్మకూ అంటారో భావకవి! కల్లాకపటం తెలియని పిల్లలూ ఇంతే! చక్కగా అర్థమయ్యేట్టు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల పట్ల మాటలకందని గొప్ప బంధాన్ని ఏర్పరుచుకుంటారు. ఆ ఉపాధ్యాయులు ఇక తమ బడికి రారు అని తెలిసినప్పుడు భావోద్వేగంతో కన్నీరు పెట్టుకుంటారు. మరి.. పాఠాలు చెప్పకుండా మద్యం తాగొచ్చిన ఉపాధ్యాయులుంటే? తరగతి గదిలో పెట్టి బంధించేందుకూ వెనుకాడరు! ఓ చోట.. మరో పాఠశాలకు బదిలీ అయిన ఇద్దరు ఉపాధ్యాయులను ఆ బడి పిల్లలు వెళ్లనీయకుండా మారాం చేస్తే.. మరోచోటేమో ఫూటుగా తాగొచ్చి.. ఆ మత్తులో తమను ఇష్టంవచ్చినట్లుగా తిడుతున్న ఉపాధ్యాయుడిని గదిలో పెట్టి బంధించారు చిచ్చర పిడుగులు! ఉపాధ్యాయుల తీరు పట్ల పిల్లల మనసుల్లో ముద్రపడే భావాలకు ప్రతిబింబాలుగా ఉన్న రెండు ఘటనలూ గురువారం ఒకేరోజు జరగడం మరో విశేషం! జనగామ రూరల్ మండలం శామీర్‌పేట ప్రాథమిక పాఠశాలలో సుధీర్ రెడ్డి అనే ఉపాధ్యాయుడు 13 ఏళ్లుగా, ఫాతిమా మేరీ అనే ఉపాధ్యాయురాలు ఆరేళ్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన పదోన్నతులలో భాగంగా సుధీర్‌రెడ్డి బచ్చన్నపేట మండలం కొన్నె ఉన్నత పాఠశాలకు, ఫాతిమా మేరీ పాలకుర్తి మండలం చెన్నూరు ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ ఇద్దరు టీచర్లూ ఇక తమ బడికి రారనే విషయాన్ని అక్కడ ఒకటో క్లాసు నుంచి ఐదో క్లాసు దాకా చదువుతున్న చిన్నారులు తెలుసుకున్నారు. అందరూ కలిసి ఆ ఇద్దరు టీచర్ల దగ్గరకు వెళ్లారు. మీరు మమ్మల్ని, మా బడిని వదిలి పోవద్దూ అంటూ బతిమాలుకున్నారు. టీచర్లు సర్దిచెబుతూ బయటకు వెళ్లబోతుంటే.. పిల్లలంతా కన్నీళ్లు పెట్టుకుంటూ బడి గేటు మూసివేసి 'మిమ్మల్ని పోనిచ్చేది లేదు' అంటూ అడ్డుకున్నారు. తమ పట్ల అలా ఉబికొచ్చిన చిన్నారుల మనసులోని ఆప్యాయతకు ఆ ఇద్దరు టీచర్ల మనసు కరిగి కళ్లు చెమ్మగిల్లాయి. పిల్లలను దగ్గరకు తీసుకొని బుజ్జగించిన ఆ టీచర్లు 'మళ్లీ ఈ స్కూలుకే వస్తాం' అంటూ చెప్పి బరువైన హృదయాలతో వీడ్కోలు తీసుకున్నారు. ఇక కొత్తగూడెం జిల్లా ఇల్లెందులోని ఇల్లెందులపాడులోని పాఠశాలలో కాల్వ సుధాకర్ అనే ఉపాధ్యాయుడు బడికి తాగొచ్చాడు. ఆ మత్తులో తరగతి గదిలో విద్యార్థులను అసభ్యకరమైన పదజాలంతో తిట్టాడు. ఆ ఉపాధ్యాయుడు రోజూ బడికి తాగొచ్చి.. ఇలానే వ్యవహరిస్తుండటంతో విసుగెత్తిన పిల్లల్లో కొందరు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను వెంటబెట్టుకొచ్చారు. పిల్లలంతా తరగతి గది బయటకొచ్చేసి, ఆ ఉపాధ్యాయుడిని లోపలే ఉంచి తల్లిదండ్రుల సహకారంతో గదికి తాళం వేసి నిర్బంధించారు. 4 గంటలు గడిచాక సమాచారం అందుకున్న ఇల్లెందు ఎంఈవో పిల్లి శ్రీనివాసరావు, ఓ విచారణ అధికారిని పంపారు. తల్లిదండ్రుల నుంచి వివరాలు తీసుకొని ఉపాధ్యాయుడు కాల్వ సుధాకర్‌పై చర్య తీసుకుంటామని ఎంఈవో చెప్పారు. ఆ తర్వాతే ఉపాధ్యాయుడిని పిల్లలు విడుదల చేశారు.

18,942 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

ఎస్జీటీలు, పండితులు, పీఈటీలకు ప్రమోషన్లు

ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయుల హర్షం

సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపిన టీచర్లు



హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భారీ సంఖ్యలో ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి. సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), భాషా పండితులు (ఎల్పీ), వ్యాయామ విద్య ఉపాధ్యాయుల (పీఈటీ)కు పదోన్నతులు లభించాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు మొత్తం 18,942 మంది టీచర్లకు ప్రమోషన్లు దక్కినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కారు సముచిత రీతిలో వ్యవహరించిందని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అర్హులైన వేలాది మంది పదోన్నతులకు నోచుకోలేదని, తమ 20 ఏళ్ల కల నెరవేరిందని పేర్కొంటున్నారు. విద్యా శాఖ కూడా సీఎం వద్దే ఉండడంతో పదోన్నతుల విషయంలో వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడిందంటున్నారు. చట్టపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో పదోన్నతులకు మార్గం సుగమమైందని చెబుతున్నారు. తమ అర్హతకు తగినట్లు పదోన్నతులు దక్కడంతో ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యా శాఖను పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జోన్ల వారీగా పదోన్నతులు

మల్టీ జోన్ 1లో ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 10,083 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి. అలాగే మల్టీ జోన్ 2లో ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా స్థానిక సంస్థల స్కూళ్లలో 5,962 మందికి, మల్టీ జోన్ 2 పరిధిలో ప్రభుత్వ బడుల్లో 1,027 మందికి పదోన్నతులు దక్కాయి. అలాగే మల్టీ జోన్ 2 పరిధిలో స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులుగా స్థానిక సంస్థల పాఠశాలల్లో 776 మందికి, మల్టీ జోన్ 1లో స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులుగా స్థానిక సంస్థల బడుల్లో 995 మందికి, మల్టీ జోన్ 1లో ప్రభుత్వ స్కూళ్లలోని 99 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 28 జూన్ 2024
diksuchi@andhrajyothy.com

జేఎన్‌టీయూహెచ్‌లో
ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్(ఐడీడీఎంపీ)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. మొదటి మూడున్నరేళ్లు జేఎన్‌టీయూహెచ్‌లో, చివరి ఏడాదిన్నర బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున మొత్తం పది సెమిస్టర్లు ఉంటాయి. బీటెక్, ఎంటెక్ డిగ్రీలను జేఎన్‌టీయూహెచ్; ఎంఎస్ డిగ్రీని బీటీహెచ్ ప్రదానం చేస్తాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ద్వారా 70 శాతం సీట్లను, ఐఐటీ జేఈఈ(మెయిన్) 2024 ర్యాంక్ ద్వారా 30 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ కోర్సుకు సంబంధించిన అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను జూలై 13న సాయంత్రం నాలుగు గంటలకు ఆన్‌లైన్ ద్వారా జేఎన్‌టీయూహెచ్ నిర్వహిస్తుంది. స్వీడన్‌లో ఐడీడీఎంపీ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.



స్పెషలైజేషన్‌లు-సీట్లు: ఈసీఈలో 20 సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో ఈసీఈ; ఎంటెక్, ఎంఎస్‌లలో మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ & సిస్టమ్స్ చదవాల్సి ఉంటుంది.

- సీఎస్ఈలో 60 సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్ ఉంటుంది. ఎంటెక్, ఎంఎస్‌లలో సీఎస్ఈ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. ఒక్కోదానిలో 20 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: బీఐఈ(టీఎస్/ఏపీ)/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 లేదా జేఈఈ(మెయిన్) 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. అడ్మిషన్స్ నాటికి అభ్యర్థుల వయసు పదహారేళ్లు నిండి ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 8
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 15
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

విశాఖ ఐఎంయూలో లేటరల్ ఎంట్రీ

విశాఖపట్నంలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ(ఐఎంయూ-సెంట్రల్ యూనివర్సిటీ)-బీటెక్ (నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్/నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్) ప్రోగ్రామ్‌లో లేటరల్ ఎంట్రీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సీఈటీ), సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ల ద్వారా రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 13 సీట్లు ఉన్నాయి. ఎన్ఏఓఈ స్పెషలైజేషన్‌లో 7 సీట్లు, ఎన్ఏఎస్‌బీ స్పెషలైజేషన్‌లో 6 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి నిర్దేశిత ధ్రువపత్రాలు జతచేసి ఆర్డినరీ/స్పీడ్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కింది చిరునామాకు పంపాలి. వెబ్‌సైట్‌లో ఇచ్చిన గూగుల్ లింక్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని అప్‌లోడ్ చేయాలి.

అర్హత: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల డిప్లొమా(సివిల్/మెకానికల్/నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు; నాలుగేళ్ల డిప్లొమా ఇన్ షిప్ బిల్డింగ్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసినవారు; మూడేళ్ల బీఎస్సీ(షిప్ బిల్డింగ్ అండ్ రిపైర్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. బీఎస్సీ/డిప్లొమా స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు; పదోతరగతి/ఇంటర్ స్థాయిలో ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

వయసు: ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి పురుషులకు జనరల్ కేటగిరీ 25 ఏళ్లు; ఓబీసీ కేటగిరీ 28 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు 30 ఏళ్లు మించకూడదు. మహిళలకు జనరల్ కేటగిరీ 27 ఏళ్లు; ఓబీసీ కేటగిరీ 30 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు 32 ఏళ్లు మించకూడదు.

కామన్ ఎంట్రెన్స్ టెస్ట్: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. దీనిని పెన్ అండ్ పేపర్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్, మేథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్, టెక్నికల్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700
- **ఆర్డినరీ/స్పీడ్/రిజిస్టర్డ్ పోస్ట్ దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 5
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 13
- **చిరునామా:** డైరెక్టర్, ఇండియన్ మారిటైం యూనివర్సిటీ, విశాఖపట్నం క్యాంపస్, వంగలి గ్రామం, సబ్బవరం మండలం, విశాఖపట్నం-531035.
- **వెబ్‌సైట్:** www.imuv.edu.in

తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీలో
పాలిటెక్నిక్ డిప్లొమా

హైదరాబాద్- రాజేంద్రనగర్‌లోని పీ.వీ.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్ టీవీయూ)- యానిమల్ హస్బెండరీ(పశుసంవర్థక)పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. మొత్తం 110 సీట్లు ఉన్నాయి. మహబూబ్ నగర్, కరీంనగర్, సిద్దిపేట ఏహెచ్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు; మామునూరు ఏహెచ్ పాలిటెక్నిక్‌లో 20 సీట్లు ఉన్నాయి. బీసీ అభ్యర్థులకు 29 శాతం; ఎస్సీ అభ్యర్థులకు 15 శాతం; ఎస్టీ అభ్యర్థులకు 10 శాతం; బలహీన వర్గాల అభ్యర్థులకు 10 శాతం; దివ్యాంగులకు 3 శాతం; మహిళలకు 33 1/3 శాతం; డిఫెన్స్ అభ్యర్థుల పిల్లలకు 2 శాతం; ఎన్‌సీసీ అభ్యర్థులకు 1 శాతం; క్రీడాకారులకు 0.5 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకోసం ప్రతి కళాశాలలో అదనంగా 10 శాతం సీట్లు నిర్దేశించారు. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. తెలంగాణ పాలిసెట్(ఎంబైపీసీ) 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఏహెచ్ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోర్సులో చేరేందుకు వీలు లేదు. వీరు దోస్త్ ద్వారా బీఏ/బీకాం/బీబీఏ అడ్మిషన్స్ పొందవచ్చు.

అర్హత: రాష్ట్రంలోని గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. కంపార్ట్‌మెంట్ అభ్యర్థులు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. తెలంగాణ పాలిసెట్(ఎంబైపీసీ)2024 ర్యాంక్ పొంది ఉండాలి.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.830; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.415
- **స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 20
- **జతచేయాల్సిన పత్రాలు:** తెలంగాణ పాలిసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డ్; పదోతరగతి సర్టిఫికెట్, కులం, ఆదాయం, వైకల్యం, గ్రామీణ ప్రాంతాల్లో చదివిన ఆధార ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ స్టడీ సర్టిఫికెట్; టీసీ, ఎన్‌సీసీ సర్టిఫికెట్, అంతర్జాతీయ/జాతీయ/రాష్ట్రీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న పత్రాలు; అభ్యర్థి ఫొటో, సంతకం
- **చిరునామా:** రిజిస్ట్రార్, పీవీ.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030
- **వెబ్‌సైట్:** www.tsvu.edu.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంసీఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్-సెంట్రల్ యూనివర్సిటీ)- 'మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిమ్‌సెట్(నిట్ సంస్థలు దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: మొత్తం 42 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 16, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3, ఓబీసీ అభ్యర్థులకు 11, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 2 సీట్లు కేటాయించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నిమ్‌సెట్ 2024 అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు 600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 550; ఓబీసీ అభ్యర్థులకు 400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **వెబ్‌సైట్:** https://uohyd.ac.in, acad.uohyd.ac.in

ఇండియన్ నేవీలో
అగ్నివీర్(ఎంఆర్ మ్యుజీషియన్) పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నివీర్(ఎంఆర్ మ్యుజీషియన్) ఖాళీల నియామకానికి ప్రకటన వెలువడింది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమయ్యే 02/2024(నవంబరు 24) బ్యాచ్ పేరున శిక్షణ ఉంటుంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: పదో తరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతో పాటు మ్యూజికల్ ఎబిలిటీ, మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఉండాలి.

వయసు: 2003 నవంబరు 1 నుంచి 2007 ఏప్రిల్ 30 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలి.

కనిష్ఠ ఎత్తు ప్రమాణాలు: పురుషులు, మహిళల ఎత్తు 157 సెం.మీ. ఉండాలి

ఎంపిక ప్రక్రియ: మెట్రిక్యులేషన్ మార్కులు, స్టేజ్-1(ప్రిలిమినరీ స్క్రీనింగ్), స్టేజ్-2(ఫైనల్ స్క్రీనింగ్), మ్యూజిక్ స్క్రీనింగ్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

శిక్షణ: అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది నవంబరులో కోర్సు శిక్షణ ప్రారంభం అవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తరవాత ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

జీతభత్యాలు: ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేల వేతనం లభిస్తుంది.

దరఖాస్తు: అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి

దరఖాస్తు ప్రారంభం: జూలై 1

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 11

వెబ్‌సైట్: www.joinindian-navy.gov.in/

ఎస్ఎస్‌సీ- సీజీఎల్ ఎగ్జామ్ 2024

జాబ్ కార్నర్

కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్(సీజీఎల్) ఎగ్జామ్- 2024 నోటిఫికేషన్‌ను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల్లో గ్రూప్-బి, గ్రూప్-సి విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేస్తారు.

ఖాళీల సంఖ్య: 17,727

పోస్టుల వివరాలు

1. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్
2. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్
3. ఇన్‌స్పెక్టర్
4. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్
5. సబ్ ఇన్‌స్పెక్టర్
6. ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్
7. రీసెర్చ్ అసిస్టెంట్
8. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్
9. సబ్ ఇన్‌స్పెక్టర్/జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్
10. ఆడిటర్
11. అకౌంటెంట్
12. అకౌంటెంట్/జూనియర్ అకౌంటెంట్
13. పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్
14. సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్
15. సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్
16. టాక్స్ అసిస్టెంట్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక విధానం: టైర్-1, టైర్-2 తదితర పరీక్షల ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ/ఎస్టీ/మహిళలు/దివ్యాంగులు/ఎక్స్‌సర్వీస్‌మన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 24

వెబ్‌సైట్: https://ssc.gov.in/

ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో సూపర్‌వైజర్లు

మాల్పే(కర్ణాటక)లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 16

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, స్కాఫ్ ఫోల్డింగ్, హెచ్ఆర్.

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్), డిగ్రీ(ఆర్ట్స్/కెమిస్ట్రీ), ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 12 నాటికి 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ప్రాక్టికల్ టెస్ట్, పని అనుభవం తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.300. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 12

వెబ్‌సైట్: udupicsl.com/index.php/careers/

ఏసీటీఆర్ఈసీలో సైంటిఫిక్ ఆఫీసర్లు

నవీ ముంబయిలోని టాటా మెమోరియల్ సెంటర్ పరిధిలోని అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్(ఏసీటీఆర్ఈసీ)...కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 19

1. సైంటిఫిక్ ఆఫీసర్: 4 పోస్టులు
2. ఇంజనీర్: 1 పోస్టు
3. అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్: 4
4. సైంటిఫిక్ అసిస్టెంట్: 8
5. టెక్నీషియన్: 1
6. లోయర్ డివిజన్ క్లర్క్: 1

విభాగాలు: ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ, న్యూక్లియర్ మెడిసిన్, డేటా అనలిస్ట్, సెంటర్ ఫర్ క్యాన్సర్ ఎపిడెమియాలజీ, సివిల్, పర్చేజ్, బయోమెడికల్, రేడియేషన్ అంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, యానిమల్ సైన్సెస్, పాథాలజీ.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, డీఎంఆర్ఐటీ/పీజీడీఎఫ్ఐటీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుకు 35-45 ఏళ్లు, ఇంజనీర్‌కు 35 ఏళ్లు, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 40 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, టెక్నీషియన్, లోయర్ డివిజన్ క్లర్క్‌కు 27 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ/ఎస్టీ/మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.


దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 18 **వెబ్‌సైట్:** actrec.gov.in/index.php/

కష్టార్జితం




సిరిపురంలో ఉండే రాజారాం అనే యువకుడికి చదువు మీద కానీ మరే ఇతర పని మీద కానీ పెద్దగా ఆసక్తిలేదు. అతని స్నేహితులంతా ఏదో ఒక వృత్తిలో స్థిరపడి వివాహాలు చేసుకుని, కుటుంబాలతో జీవనం గడపసాగారు. రాజారాం తన తండ్రి వత్తకు వెళ్లి, తనకు కూడా పెళ్లి చేయమని అడిగాడు.దానికి వాళ్ల నాన్న అలాగే చేస్తాను కానీ ముందుగా నాకో పదివేలరూపాయలు తెచ్చివ్వు. అపుడు నీకు మంచి వధువును చూసి వివాహం జరిపిస్తాను అన్నాడు. ఆ మర్నాడు రాజారాం ధనవంతుడైన తనస్నేహితుని దగ్గర పదివేలు అప్పుగా తీసుకుని తెచ్చి వాళ్ల నాన్న చేతికి ఇచ్చాడు. వాళ్ల నాన్నఆ డబ్బు తీసుకుని, పారవేశాడు అతను ఎందుకలా చేశాడో రాజారాంకి అంతు పట్టలేదు. మరొక వారం ఆతర్వాత రాజారాం వాళ్ల అమ్మను అడిగి మరో పదివేలు తీసుకుని తెచ్చి వాళ్ల నాన్న చేతికి ఇచ్చాడు. వాళ్ల నాన్న ఈ డబ్బును కూడా అంతకు ముందు లాగే పారవేశాడు. మరి కొన్ని రోజుల తర్వాత, రాజారాం ఇంకో పదివేలు తెచ్చి వాళ్ల నాన్న చేతికి ఇచ్చాడు. వాళ్ల నాన్న ఆ డబ్బు పారవేయబోతూ ఉంటే, రాజారాం వాళ్ల నాన్నచేతిని పట్టుకుని ఆపి, 'ఆగండినాన్నా, ఇది నేను నెల రోజులు కష్టపడి పనిచేసి, సంపాదించిన డబ్బు, దయచేసి దీన్ని పారవేయకండిఅని అన్నాడు. దానికి వాళ్ల నాన్న 'చూసావా? గతంలో రెండు సార్లు నేను డబ్బు పారవేసినపుడు నీకు కలగని బాధ ఇపుడుకలిగింది. నువ్వు కష్టపడి పనిచేసి సంపాదించిన డబ్బు కాబట్టి, నీకు దీని విలువ తెలియాలనే నేను నువ్వు అడిగి తెచ్చిన డబ్బు పారవేశాను. ఇపుడు నీకు వివాహం చేసే సమయం వచ్చింది' అన్నాడు ఆ తర్వాత కొన్ని రోజులకు రాజారాంచేత మంచి వ్యాపారం పెట్టించి, అతనికి ఘనంగా వివాహం జరిపించాడు వాళ్ల నాన్న.

ఎన్ని ఆవులు ఉన్నాయి?



7 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 344

3		5		2	1			
9			8					
	1		7			8		
				7	5		8	6
7	5		9	4				
		4			6		7	
					7			5
			5	3		2		1

సుడోకు - 343 సమాధానం

3	8	5	4	2	1	6	9	7
9	4	7	8	6	3	5	1	2
6	1	2	7	5	9	8	3	4
2	9	1	3	7	5	4	8	6
4	3	8	6	1	2	7	5	9
7	5	6	9	4	8	1	2	3
5	2	4	1	9	6	3	7	8
1	6	3	2	8	7	9	4	5
8	7	9	5	3	4	2	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.